అనుదినం... జనస్వరం

www.navatelangana.com

నవతెలంగాణ

గురువారం 26-10-2023

సమగ్ర తెలుగు దినపత్రిక



గాజాలో ఆరోగ్య వ్యవస్థను పునరుద్ధరించండి

- అంతర్జాతీయ సమాజాన్ని కోరిన పాలస్తీనా

వివరాలు 2లో..

సంపుటి : 9 సంచిక : 295 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 8 పేజీలు + టాబ్లాయిడ్ 12 పేజీలు | వెల : 6.50

కేసీఆర్‌ని గద్దెదించే శక్తి కాంగ్రెస్సే...

అందుకే ఆ పార్టీలో చేరుతున్నా..

- బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటే
- అవకాశం ఇస్తే గజ్వేల్ నుంచి పోటీ చేస్తా : మాజీ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి



నవతెలంగాణ - రంగారెడ్డి ప్రాంతీయ ప్రతినిధి

తెలంగాణలో సీఎం కేసీఆర్‌ను గద్దె దించే శక్తి కాంగ్రెస్‌కే ఉందని, బీజేపీ కేంద్రంలో అధికారంలో ఉన్నా అవినీతి చేసిన కేసీఆర్‌పై చర్యలు తీసుకోకపోవడం బాధ అనిపించి, ప్రజల అకాంక్ష మేరకు కాంగ్రెస్‌లో చేరాలని నిర్ణయించుకున్నానని మాజీ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ అవకాశం ఇస్తే కేసీఆర్‌పై గజ్వేల్‌లో పోటీ చేయడానికి సిద్ధంగా ఉన్నట్టు తెలిపారు. బుధవారం రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండల పరిధిలోని తన ఫామ్‌హౌస్‌లో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. స్వరాష్ట్రం కోసం తాను ఎన్నో ఉద్యమాలు చేశానని, తెలంగాణ ఇచ్చిన ఘనత కాంగ్రెస్‌దేనని తెలిపారు. అయితే రాష్ట్రంలో నెలకొన్న రాజకీయ పరిణామాల దృష్ట్యా బీజేపీలో చేరినట్టు తెలిపారు. గతంలో బీఆర్ఎస్‌ను ఓడించే శక్తి బీజేపీకి ఉండేదని, అందుకే తను ఆ పార్టీలో చేరినట్టు తెలిపారు.

తన స్వార్థం కోసం ఎప్పుడూ పార్టీ మారలేదన్నారు. అయితే రాష్ట్రాన్ని దోచుకున్న సీఎం కేసీఆర్, అతని కుటుంబంపై కేంద్ర ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం కేసీఆర్ అవినీతి పాలనను అంతం చేయడం బీజేపీతో సాధ్యం కాదన్నారు. కేసీఆర్ దుర్మార్గ పాలన పోవాలని ప్రజలు భావిస్తున్నారని తెలిపారు.

తను ఎల్బీనగర్, తన భార్య మునుగోడు నుంచి పోటీ చేస్తారని మీడియాలో వస్తున్న ప్రచారాన్ని తిప్పికొట్టారు. తన భార్య ప్రత్యక్ష రాజకీయాల్లో లేదని, ఆమెకు అసలు రాజకీయాల్లోకి రావాలని లేదని స్పష్టం చేశారు. ఆమె ఎప్పటికీ పోటీ చేయదని, మునుగోడు నుంచి తానే పోటీ చేస్తానని తేల్చి చెప్పారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

ఆ పార్టీకి ఓటేస్తే మూడు గంటలే కరెంటు

కాంగ్రెస్ ఎవర్నీ ఓన్ చేసుకోలేదు...

- 'కేసీఆర్ భరోసా'ను ఇంటింటికీ తీసుకెళ్లండి : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

దేశాన్ని దశాబ్దాలపాటు పాలించిన కాంగ్రెస్... ఏ ఒక్కర్నీ, ఏ ఒక్క తరగతినీ ఓన్ చేసుకోలేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర మంత్రి కేటీఆర్ ఎద్దేవా చేశారు. అందుకే అది అందరికీ దూరమవుతోందని విమర్శించారు. పెద్దపల్లి నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ నాయకులు సత్యనారాయణరెడ్డి, రామ్మూర్తి తదితరులు బుధవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్‌లో చేరారు. కేటీఆర్ వారికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం



ఆయన మాట్లాడుతూ... కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సొంత రాష్ట్రమైన కర్నాటకలో ప్రస్తుతం కరెంటు కష్టాలు కొనసాగుతున్నాయని తెలిపారు. అక్కడి రైతులకు ఐదు గంటల కంటే ఎక్కువ సమయం కరెంటు ఇవ్వలేమంటూ ప్రభుత్వం చేతులెత్తేసిందని తెలిపారు. ఇక్కడ తెలంగాణలో ఆ పార్టీకి ఓటేస్తే మూడు గంటల కరెంటే దిక్కవుతుందని హెచ్చరించారు. అందువల్ల ఒక్క అవకాశమివ్వాలంటూ కోరుతున్న కాంగ్రెస్ నేతల మాటలు నమ్మి మోసపోవద్దంటూ ఓటర్లకు సూచించారు. రాష్ట్రంలో బీఆర్ఎస్‌ను ప్రజలందరూ తమ పార్టీగా భావిస్తున్నారని చెప్పారు. ముఖ్యమంత్రి కేసీఆర్ దూరదృష్టి, నిర్ణయాల వల్ల ఉమ్మడి కరీంనగర్ జిల్లా నేడు సస్యశ్యామలమైందని వివరించారు.

బీఆర్ఎస్‌ను మరోసారి ఆశీర్వదించటం ద్వారా కేసీఆర్‌ను ముచ్చటగా మూడోసారి సీఎంగా చూడాలని కేటీఆర్ ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. 'కేసీఆర్ భరోసా' పేరిట తమ పార్టీ మ్యానిఫెస్టోలోని అంశాలను విస్తృతంగా జనంలోకి తీసుకెళ్లాలని కార్యకర్తలను కోరారు. ఈసారి అధికారంలోకి వస్తే ప్రతీయేటా జాబ్ క్యాలెండర్‌ను నిర్ణీత కాల వ్యవధిలో తప్పకుండా అమలు చేస్తామని హామీనిచ్చారు.

ఇండియా కాదు... భారత్

పాఠ్య పుస్తకాల్లో దేశం పేరు మార్పు

- విద్యార్థులకు ఇండియా బదులు భారత్ అనే బోధించాలి
- భారత్ ప్రస్తావన విష్ణుపురాణంలోనే ఉన్నది: ఎన్సీఈఆర్టీ
- 'హిందూ ఓటముల' ప్రస్తావన వద్దని సిఫారసు




జీ..20 సమావేశాల్లో ప్రధాని మోడీ ఇండియాకు బదులుగా భారత్ అని బోర్డు పెట్టుకోవడం, రాష్ట్రపతి ఆహ్వానాల్లో సైతం భారత్ అని ముద్రించడంపై అప్పట్లో పెద్ద చర్చే జరిగింది. అదలా ఉండగానే.. ఇపుడు పాఠ్యపుస్తకాల్లోనూ ఇండియాకు బదులుగా భారత్ ను జొప్పించే ప్రయత్నం జరుగుతోంది. బీజేపీ, ఆర్ఎస్ఎస్ తమ అనుకూలగణంతో ఏర్పాటు చేసుకున్న ఎన్సీఈఆర్టీ కమిటీ హిందూయిజాన్ని విద్యాబోధన రూపంలో బలవంతంగా రుద్దే ప్రయత్నాలకు దిగుతోంది. పాఠ్యపుస్తకాలు మొదలుకుని సమస్త చదువుల్లోనూ చరిత్రను చెరిపే కుట్రలు జరుగుతున్నాయని రాజకీయ పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు.



న్యూఢిల్లీ : పాఠ్య పుస్తకాల్లో మన దేశం పేరు ఇకపై 'ఇండియా' కాదు. 'భారత్' అనే ఉంటుంది. ప్రాథమిక స్థాయి నుంచి హైస్కూలు స్థాయి వరకూ అన్ని తరగతుల పాఠ్య పుస్తకాలలోనూ దేశం పేరును భారత్ అనే ముద్రిస్తారు. పాఠ్య ప్రణాళికను సవరించేందుకు ఎన్సీఈఆర్టీ ఏర్పాటు చేసిన ఉన్నత స్థాయి కమిటీ ఈ మేరకు సిఫారసు చేసిందని ఆ సంస్థ ఛైర్మన్ ప్రొఫెసర్ సీఐ ఇస్సాక్ (రిటైర్డ్) తెలిపారు. ఇస్సాక్ ఆర్ఎస్ఎస్ సిద్ధాంతవేత్త కూడా.

పాఠ్య ప్రణాళికలో 'హిందూ ఓటముల'పై పెద్దగా దృష్టి సారించకూడదని కూడా కమిటీ సూచించిందని ఇస్సాక్ తెలిపారు. ఏడుగురు సభ్యులతో కూడిన కమిటీ ఏకగ్రీవంగా సిఫారసులు చేసిందని ఆయన చెప్పారు. జీ-20 సదస్సుకు హాజరైన అతిథులను విందుకు



ఆహ్వానిస్తూ గత నెల ఐదవ తేదీన కేంద్ర ప్రభుత్వం పంపిన సందేశంలో 'ప్రెసిడెంట్ ఆఫ్ ఇండియా' బదులు 'ప్రెసిడెంట్ ఆఫ్ భారత్' అని పేర్కొన్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో దీనిపై జరిగిన చర్చకు ఎన్సీఈఆర్టీ కమిటీ సిఫార్సు ఓ కొత్త కోణాన్ని చేర్చింది. జీ-20 అతిథులకు కేంద్ర ప్రభుత్వం ఆహ్వానం పంపడానికి నాలుగు రోజుల ముందు ఆర్ఎస్ఎస్ అధినేత మోహన్ భగవత్ ఓ వ్యాఖ్య చేస్తూ ప్రజలు ఇండియాకు బదులు భారత్ అనే పదాన్ని ఉపయోగించాలని సూచించారు. పాఠ్య పుస్తకాల్లో పాఠశాల విద్యార్థులకు ...7లో

ఎవరీ ఇస్సాక్?

ఇస్సాక్ కేంద్ర విద్యా శాఖకు చెందిన భారతీయ చారిత్రక పరిశోధనా మండలిలో సభ్యుడు. కొట్టాయంలోని సీఎంఎస్ కాలేజీలో చరిత్ర విభాగంలో అధ్యాపకుడిగా పనిచేశారు. 1975లో ఆర్ఎస్ఎస్ అనుబంధ ఏబీవీపీలో చేరారు. ప్రస్తుతం ఆర్ఎస్ఎస్‌తో సంబంధమున్న భారతీయ విచార కేంద్రం కేరళ రాష్ట్ర విభాగం కార్యనిర్వాహక అధ్యక్షుడిగా పనిచేస్తున్నారు. కమిటీ సభ్యుడైన జేఎన్‌యూ ప్రొఫెసర్ వందనా మిశ్రా గతంలో ఏబీవీపీ మాజీ జాతీయ కార్యదర్శిగా, ఆ సంస్థకు జాతీయ ఉపాధ్యక్షుడిగా పనిచేశారు.

నో ఇన్‌కమింగ్... ఓన్లీ ఔట్ గోయింగే

నేడు రాజగోపాల్‌రెడ్డి.. రేపెవరో?

- ఎన్నికల వేళ తుస్సుమంటున్న బీజేపీ బాంబులు
- కొత్తగా ఈటల వర్సెస్ విద్యాసాగర్‌రావు పంచాయితీ
- తమకు న్యాయం చేయాలంటున్న హార్డ్‌కోర్ కార్యకర్తలు
- పార్టీ మారాలని వలస నేతలపై అనుచరుల ఒత్తిడి



చేరికలకు ఎన్ని ప్రణాళికలు వేసినా ఆ పార్టీలో ఔట్ గోయింగే తప్ప ఇన్‌కమింగ్ లేని పరిస్థితి. గ్రామ, మండల స్థాయి నేతలను చేర్చుకుని చేరికలని పెద్దగా చేసి చూపెడుతున్నది. తెలంగాణలో కేసీఆర్‌ను ఓడించే శక్తి బీజేపీనే అని భావించి ఆ పార్టీలో చేరి అక్కడ జరుగుతున్న పరిణామాలను చూసి జీర్ణించుకోలేక పార్టీని వీడిన వారి లిస్టు పెద్దగానే ఉంది.పార్టీని వీడిన వారిలో స్వామిగౌడ్, ఎన్నం శ్రీనివాస్‌రెడ్డి, దాసోజు శ్రవణ్‌కుమార్, మోత్కుపల్లి నర్సింహులు, రాపోలు ఆనందభాస్కర్, మాజీ మంత్రి చంద్రశేఖర్, ఎర్రశేఖర్, జిట్టా బాలకృష్ణారెడ్డి, పుష్పలీల, నాగం జనార్థన్‌రెడ్డి, రాజగోపాల్‌రెడ్డి, తదితర నేతలున్నారు.

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఎన్నికల వేళ బీజేపీకి బిగ్‌షాక్. తమ పార్టీలో గెలిచే తొలి అభ్యర్థి అని చెప్పుకుంటున్న రాజగోపాల్‌రెడ్డి హ్యాండిచ్చారు. కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నానని ప్రకటించారు. కేసీఆర్‌పై పోరాటంలో బీజేపీ మెతక వైఖరి అవలంబిస్తోందంటూ బాంబు పేల్చేశారు. 'బీజేపీ వద్దు...కాంగ్రెస్‌లో చేరు' అని అనుచరులు, నియోజకవర్గ ప్రజలు ఒత్తిడి చేయడంతోనే తాను పార్టీ మారుతున్నానంటూ ప్రకటించారు. రాజగోపాల్‌రెడ్డి బాటలోనే మరికొంత మంది సీనియర్ నేతలు ఆ పార్టీకి గుడ్‌బై చెప్పే యోచనలో ఉన్నట్టు చర్చ నడుస్తున్నది. ఏడాది కాలం పాటు తెలంగాణలో తామే అధికారంలోకి రాబోతున్నామంటూ హడావిడి చేసిన నేతలంతా మెత్తబడిపోయారు. ప్రస్తుతం కాంగ్రెస్ వర్సెస్ టీఆర్ఎస్ అనే మూడ్ ప్రజల్లోకి ...7లో

నిరుద్యోగ భారత్

- పొరుగు దేశాల కంటే ఇక్కడే అధికం
- అన్‌ఎంప్లాయిమెంట్ పై ప్రపంచబ్యాంక్



న్యూఢిల్లీ : ఏటా రెండు కోట్ల ఉద్యోగాలిస్తామంటూ అధికారంలోకి వచ్చిన మోడీ..నిరుద్యోగ యువతతో చెడుగుడు ఆడుకుంటున్నారు. ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయకుండా..ఆ ఖాళీలను అలాగే ఉన్నాయంటూ పార్లమెంట్‌లో కేంద్రం చెప్పుకుంటోంది. నియామకాల వైపు దృష్టిపెట్టడంలేదు. పకోడీలు వేసుకోమనో, మరో కటో అనేసి నిరుత్సాహపరుస్తోంది. మరోవైపు ...7లో

మరో 33 స్థానాలకు అభ్యర్థులు

కాంగ్రెస్ సీఈసీ నిర్ణయం

- మిగిలిన స్థానాలపై నేడు మరోసారి భేటీ



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించిన మరో 33 స్థానాలకు కాంగ్రెస్ కేంద్ర ఎన్నికల కమిటీ (సీఈసీ) అభ్యర్థులను ఖరారు చేసింది. ఈ జాబితా గురువారం ఉదయం విడుదల చేసే అవకాశం ఉంది. వీటితో పాటు మిగిలిన స్థానాలపై కూడా స్పష్టత వచ్చిన తరువాత మొత్తం స్థానాలకు సంబంధించిన జాబితా విడుదల చేయనుంది. బుధవారం ...7లో



ఎన్నికల ప్రలోభాలపై ఐటీ కన్ను

- రూ.10 లక్షలు దాటితే ఐటీ పరిధిలోకి...
- అంతకంటే తక్కువుంటే జిల్లా ఎన్నికల అధికారి పరిధి : ఐటీశాఖ డీజీ సంజయ్ బహదూర్ వివరణ

వివరాలు 7లో..

దర్యాప్తు కొనసా..గుతోంది..

మేడిగడ్డ బ్యారేజీ నిర్మాణ నాణ్యతపై కేంద్రం బృందం విచారణ

- సాగునీటి శాఖ ఇంజినీర్లతో భేటీ
- నిర్మాణ లోపాల్లేవు: మురళీధర్
- ఇసుక కదలికతోనే సమస్య ఉత్పన్నమైందని వ్యాఖ్య




నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

తెలంగాణలో మేడిగడ్డ బ్యారేజీ కుంగిన వ్యవహారంపై కేంద్ర బృందం పర్యటన కొనసాగుతున్నది. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ ఛైర్మెన్ అనిల్‌జైన్‌తో కూడిన ఆరుగురు సభ్యుల బృందం బుధవారం రాష్ట్ర నీటిపారుదల శాఖ ఇంజినీర్లతో భేటీ అయింది. తెలంగాణ ఇంజినీర్ ఇన్ చీఫ్ సి. మురళీధర్, నాగేంద్రరావు, వెంకటేశ్వర్లు, సీఎం ఓఎస్డీ శ్రీధర్‌దేశ్‌పాండే, ...7లో

24 గంటల్లో రూ.4.44 కోట్ల సొత్తు స్వాధీనం

- ఈసీ మొత్తం స్వాధీనాల విలువ రూ.340 కోట్లు



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో పోలీసులు నిర్వహిస్తున్న తనిఖీల్లో పెద్దమొత్తంలో నగదు, బంగారం, ఆభరణాలు, చీరలు, మత్తు పదార్థాలు పట్టుబడుతున్నాయి. గడచిన 24 గంటల్లో (అక్టోబరు 24 నుంచి 25వ తేదీ ఉదయం వరకు) రూ. 2.72 కోట్ల నగదును స్వాధీనం చేసుకున్నారు. అక్రమంగా తరలిస్తున్న 2,916 లీటర్ల మద్యం, 160 కిలోల నల్లబెల్లం, 11 కిలోల ఆలం స్వాధీనం చేసుకున్నారు. దీనివిలువ రూ.96.89 లక్షలు ఉంటుందని అధికారులు తెలిపారు. రూ.37.58 లక్షలు విలువైన 30.73 కిలోల గంజాయి ...7లో

అమలుకాని పాత హామీలు...

మరబోట్లు లేవు.. ట్రిబుల్ ఐటీ రాలే..

- ఊసే లేని పీజీ, డిగ్రీ, కళాశాలలు
- మళ్లీ నేడు అచ్చంపేట, వనపర్తికి సీఎం కేసీఆర్ రాక

నవ తెలంగాణ - మహబూబ్‌నగర్ ప్రాంతీయ ప్రతినిధి

"శ్రీశైలం రిజర్వాయర్‌లో తెలంగాణ వాటా ఉంది.. అది ఎవడి అబ్బా జాగీర్ కాదు. అచ్చంపేట వనపర్తి జిల్లాల పరిధిలో ఉండే కృష్ణానదిలో మరబోట్లను ఉపయోగించి మత్స్య కార్మికుల చేపల వేట కొనసాగేలా చర్యలు తీసుకుంటాం.. వనపర్తిలో ట్రిబుల్ ఐటీ ద్వారా ఈ ప్రాంత విద్యార్థులకు ఉన్నత సాంకేతిక విద్య అందిస్తాం. అచ్చంపేటలో 1.55 లక్షల ఎకరాలకు సాగునీరు అందించి ఈ ప్రాంత కరువును పారదోలే విధంగా చర్యలు తీసుకుంటాం" అని 2018లో అచ్చంపేట, వనపర్తి పట్టణాల్లో జరిగిన ప్రజా ఆశీర్వాద సభలో కేసీఆర్ హామీ ఇచ్చారు. వీటిలో ఏ ఒక్కటీ అమలు కాలేదు. నేడు మళ్లీ అచ్చంపేట, వనపర్తి పట్టణాల్లో బహిరంగ సభల్లో పాల్గొనేందుకు ముఖ్యమంత్రి కేసీఆర్ వస్తున్నారు. ఈ సందర్భంగా 'నవ తెలంగాణ' ప్రత్యేక కథనం.

ఐదు సంవత్సరాల కిందట 2018లో ముఖ్యమంత్రి కేసీఆర్ ఇదే నెలలో అచ్చంపేట, వనపర్తి పట్టణాల్లో ...2లో



బిజినెస్

అదానీ గ్రూప్ ఆడిటర్ 'ఇవై'పై విచారణ..!



న్యూఢిల్లీ : అదానీ గ్రూప్ కంపెనీలకు దీర్ఘకాలం ఆడిటర్‌గా వ్యవహరించిన 'ఇవై'పై భారత అకౌంటింగ్ రెగ్యులేటరీ సంస్థ విచారణ ప్రారంభించిందని సమాచారం. ఇటీవల కొద్ది వారాల క్రితం నేషనల్ ఫైనాన్షియల్ రిపోర్టింగ్ అథారిటీ (ఎన్ఎఫ్ఆర్ఏ) ఇవై సంస్థకు చెందిన భారత సంస్థ ఎస్ఆర్ బాట్లిబోయ్‌పై విచారణ చేపట్టిందని బ్లూమ్‌బర్గ్ రిపోర్ట్ చేసింది. ఎన్ఎఫ్ఆర్ఏ విచారణకు ఎంత సమయం పట్టవచ్చు లేదా ఆడిటర్, అదానీ కంపెనీలు ఎలాంటి పరిణామాలు ఎదుర్కొన్నాల్సి వస్తుందని నివేదిక పేర్కొనలేదు. ... [illegible]

తగ్గిన క్రెడిట్ కార్డ్‌ల వినియోగం



ముంబయి : అధిక ధరలు ప్రజల కొనుగోలు శక్తిని తగ్గిస్తున్నాయి. సాధారణంగా పండుగ సీజన్‌లో కొనుగోళ్లు పుంజుకోవడంతో పాటుగా క్రెడిట్ కార్డుల చెల్లింపులు పెరుగుతాయి. కాగా ... ఈ ఏడాది సెప్టెంబర్‌లో 4.2 శాతం తగ్గి రూ.1.42 లక్షల కోట్లకు పరిమితమయ్యాయి. ... [illegible]

పెరిగిన పసిడి అక్రమ రవాణా

- ఆరు నెలల్లో 2వేల కిలోల స్మగ్లింగ్
- అధిక పన్ను రేట్ల ఎఫెక్ట్



న్యూఢిల్లీ : భారత్‌లోకి అక్రమంగా తీసుకొస్తున్న బంగారం భారీగా పట్టుబడుతోంది. కేంద్ర ప్రభుత్వం పసిడిపై అమలు చేస్తున్న హెచ్చు పన్ను రేట్ల నుంచి తప్పించుకోవడానికి స్మగ్లర్లు అడ్డదారుల్లో దిగుమతి చేసుకుంటున్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి సెప్టెంబర్‌తో ముగిసిన కాలంలో బంగారం స్మగ్లింగ్ 43 శాతం పెరిగి 2,000 కిలోలుగా నమోదయ్యింది. ... 2022-23లో మొత్తంగా 3800 కిలోల పసిడి పట్టుబడింది. ... [illegible]

ఆన్‌లైన్ గేమింగ్ కంపెనీలకు భారీ షాక్

- రూ.1 లక్ష కోట్లకు జిఎస్‌టి నోటీసులు

న్యూఢిల్లీ : ఆన్‌లైన్ గేమింగ్ కంపెనీలకు కేంద్ర ప్రభుత్వం భారీ షాక్ ఇచ్చింది. పన్ను ఎగవేతకు పాల్పడిన సంస్థలకు జిఎస్‌టి అధికారులు నోటీసులు జారీ చేశారు. ఆయా కంపెనీలకు దాదాపుగా రూ.1 లక్ష కోట్ల విలువైన షోకాజ్ నోటీసులు ఇచ్చినట్టు జిఎస్‌టి సీనియర్ అధికారి వెల్లడించారు. ... 28 శాతం జిఎస్‌టి ... [illegible]

ఐదో రోజూ మార్కెట్ల నేల చూపులు

- సెన్సెక్స్‌కు 523 పాయింట్ల నష్టం

ముంబయి : దేశీయ స్టాక్ మార్కెట్లలో పండుగ సీజన్ కనరావడం లేదు. వరుసగా ఐదో రోజూ ఈక్విటీ మార్కెట్లు నష్టాలు చవి చూశాయి. బుధవారం బిఎస్ఇ సెన్సెక్స్ 523 పాయింట్లు కోల్పోయి 64,049 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఇ నిఫ్టీ 160 పాయింట్లు తగ్గి 19,122 వద్ద ముగిసింది. ... 0.52 శాతం, 0.77 శాతం పాయింట్ల చొప్పున విలువ కోల్పోయాయి. ... [illegible]

అమలుకాని పాత హామీలు

(మొదటిపేజీ తరువాయి)

జరిగిన బహిరంగ సభలో మాట్లాడారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో విశాలంగా ప్రవహిస్తున్న కృష్ణ, తుంగభద్ర నదులున్నాయి. ... 1000 ఎకరాల్లో పారిశ్రామిక వాడను ఏర్పాటు చేస్తామని చెప్పారు. ... 1.55 లక్షల ఎకరాలకు సాగునీరు ... 95 సర్వే నెంబర్‌లో పట్టాలు ఇవ్వడమే గాక ... 83 సర్వే నెంబర్‌లో ... ఉంటాయన్నారు. అచ్చంపేట నియోజకవర్గంలో 10 ... [illegible]

ఒక్కటీ అమలు కాలే..

సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటీ అమలు కాలేదు. ... ఒక్కనాడు కూడా ... వక్తం చేస్తున్నారు. [illegible]

'నిజం గెలవాలి'కి తెలుగు మహిళల సంఘీభావం



నవతెలంగాణ-హైదరాబాద్

కార్యకర్తల కోసం నేనున్నా నంటూ నారా భువనేశ్వరి చేపట్టిన 'నిజం గెలవాలి' కార్యక్రమం సఫలీకృతం కావాలని తెలుగు మహిళ అధ్యక్షురాలు వంగలపూడి అనిత ... బుధ వారం హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్‌లో మీడియాతో సంయుక్తంగా మాట్లాడారు. చంద్రబాబు అక్రమ అరెస్ట్‌తో ... 47 రోజులైనా ... సమావేశంలో పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి బుడిగి అనూష్ కుమార్ పాల్గొన్నారు. [illegible]

గాజాలో ఆరోగ్య వ్యవస్థను పునరుద్ధరించండి

అంతర్జాతీయ సమాజాన్ని కోరిన పాలస్తీనా



గాజా: గత 24గంటల్లో మొత్తంగా 756మంది పాలస్తీనియన్లు మరణించారని పాలస్తీనా ఆరోగ్య మంత్రిత్వ శాఖ ప్రకటించింది. గాజాలో 6,546మంది మరణించారని పాలస్తీనా ఆరోగ్య మంత్రిత్వ శాఖ ప్రకటించింది. వీరిలో 2,704మంది పిల్లలు ఉన్నారు. ఇప్పటివరకు 17వేల మందికి పైగా గాయపడ్డారు. ... 21మంది పాలస్తీనా జర్నలిస్టులు మృతి చెందగా, ... [illegible]

లండన్‌లో శివ్ నారాయణ్ జ్యువెలర్స్ ప్రివ్యూ

హైదరాబాద్: లండన్‌లో జరిగిన ప్రత్యేక ప్రివ్యూతో శివ్ నారాయణ్ జ్యువెలర్స్ అంతర్జాతీయ మార్కెట్‌లో ప్రవేశించినట్టు తెలిపింది. ... ఆ సంస్థ ఎండి తుషార్ అగర్వాల్ పేర్కొన్నారు. తమ సంస్థ 10 గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ టైటిల్‌ను పొందిందని ఆయన గుర్తు చేశారు.

డిసెంబర్‌లో జైపూర్ జ్యువెలరీ ప్రదర్శన

హైదరాబాద్: వచ్చే డిసెంబర్‌లో జైపూర్ జ్యువెలరీ షోను ఏర్పాటు చేస్తున్నట్టు జెజెఎస్ గౌరవ కార్యదర్శి రాజీవ్ జైన్ తెలిపారు. ... డిసెంబర్ 22 నుంచి 25వరకు జరగనున్న 21వ ఎడిషన్ ప్రదర్శనకు ... 40వేల మంది సందర్శకులు హాజరు కావొచ్చన్నారు.



పంచతంత్రం-2023



ఛత్తీస్‌గఢ్ బరిలో సీపీఐ(ఎం) అభ్యర్థులు



న్యూఢిల్లీ : ఛత్తీస్‌గఢ్ అసెంబ్లీ ఎన్నికల్లో సీపీఐ(ఎం) తరుపున పోటీ చేయనున్న ముగ్గురి పేర్లను ఆ పార్టీ బుధవారం ప్రకటించింది. కోర్బా జిల్లాలో కట్ఘోరా నుంచి జవహార్ సింగ్ కుమార్, సూరజ్‌పుర్ జిల్లాలోని భట్గావ్ నుంచి కపిల్ పయిక్రా, సర్గుజ జిల్లా లంద్రా (ఎస్‌టి) నియోజకవర్గం నుంచి బల్బీర్ నగేశ్ పోటీ చేయనున్నట్లు సీపీఐ(ఎం) తెలిపింది.

ఆ బిగ్‌షాట్ల గురించే మోడీకి బెంగ

- కేంద్ర ప్రభుత్వంపై ప్రియాంక ఫైర్



న్యూఢిల్లీ : కేంద్ర ప్రభుత్వం కేవలం ఆ ఇద్దరు బిగ్‌షాట్లను బాగు చేయటం గురించే మోడీకి బెంగ పట్టుకుందని, వారి అభివృద్ధి గురించే కేంద్రంలోని బీజేపీ సర్కార్ ఆలోచన చేస్తుందని కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రియాంకా గాంధీ వాద్రా ఎద్దేవా చేశారు. విమానాశ్రయాలు, ఓడరేవులు, ప్రభుత్వ రంగ సంస్థలను మోడీ సర్కారు వాళ్లకే ధారాదత్తం చేస్తోందని విమర్శించారు. దేశంలో బడా వ్యాపారులైన గౌతమ్ అదానీ, ముకేశ్ అంబానీల పేర్లను నేరుగా ప్రస్తావించకుండా వాళ్లను ఉద్దేశించి ప్రియాంకాగాంధీ ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రభుత్వం నుంచి లబ్ది పొందుతున్న ఆ ఇద్దరు బడా వ్యాపారులు గానీ, కేంద్ర సర్కారు గానీ నిరుద్యోగుల కోసం ఎలాంటి ఉద్యోగ, ఉపాధి అవకాశాలను సృష్టించడం లేదని ప్రియాంకా గాంధీ ఆరోపించారు. ప్రధాని మోడీ మహిళా రిజర్వేషన్ గురించి మాట్లాడారని, కానీ అది పదేండ్ల తర్వాత అమలవు తుందని ప్రియాంకాగాంధీ తెలిపారు. ఆయన కుల గణన ఊసే ఎత్తడం లేదని విమర్శించారు. ఈస్టర్న్ రాజస్థాన్ కెనాల్ ప్రాజెక్టు గురించి హామీ ఇచ్చిన కేంద్రం.. ఇప్పటివరకు ఆ ప్రాజెక్టు కోసం చేసేందేమీ లేదని ఎద్దేవా చేశారు. బీజేపీ ఇచ్చిన హామీలను తుంగలో తొక్కుతోందని, కానీ, కాంగ్రెస్ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చిందని చెప్పారు.

డిప్యూటీ కలెక్టర్ రాజీనామా

- ఎట్టకేలకు ఎంపీ సర్కారు ఆమోదం
- ఎన్నికల బరిలో నిషా బంగ్రే





ఎంపీ : డిప్యూటీ కలెక్టర్ నిషా బంగ్రే రాజీనామాను మధ్యప్రదేశ్ సర్కారు ఆమోదించింది. రాష్ట్ర హైకోర్టు జోక్యం తర్వాత చాలా కాలానికి ది జనరల్ అడ్మినిస్ట్రేషన్ డిపార్ట్‌మెంట్(జీఏడీ) ఈ నిర్ణయాన్ని తీసుకున్నది. దీనితో పాటు శాఖాపరమైన విచారణ కూడా ముగిసింది. ఈ మేరకు జీఏడీ ఒక ఉత్తర్వును జారీ చేసింది. ఛతర్‌పూర్ డిప్యూటీ కలెక్టర్ నిషా బంగ్రే పెట్టుకున్న రాజీనామా అర్జీని ఆమోదించినట్టు పేర్కొన్నది. నిషా బంగ్రే 2018 బ్యాచ్ అధికారి.వాస్తవానికి నిషా బంగ్రే మధ్యప్రదేశ్‌లో రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు తన ఉద్యోగానికి రాజీనామా చేయాలనుకున్నారు. అయితే, శివరాజ్‌సింగ్ చౌహాన్ సర్కారు మాత్రం ఆమె రాజీనామాను ఆమోదించలేదు. దీంతో నిషా బంగ్రే న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. హైకోర్టు ఆమెకు అనుకూలంగా ఉత్తర్వులు జారీ చేయటంతో మధ్యప్రదేశ్ సర్కారు ఆమె రాజీనామాను ఆమోదించాల్సి వచ్చింది.

మూడేండ్లలో 21 మందికే ప్రభుత్వోద్యోగాలు !

మధ్యప్రదేశ్‌లో బీజేపీ ప్రభుత్వ ఘనత

- నమోదైన నిరుద్యోగులు 39 లక్షలు
- నెలకు లక్ష మంది జత కలుస్తున్నారు





భోపాల్ : మధ్యప్రదేశ్ శాసనసభ ఎన్నికలకు కౌంట్‌డౌన్ ప్రారంభం కావడంతో అధికార బీజేపీ, ప్రతిపక్ష కాంగ్రెస్ మధ్య మాటల తూటాలు పేలుతున్నాయి. ముఖ్యంగా నిరుద్యోగ సమస్యపై రెండు పార్టీల మధ్య ఆరోపణలు, ప్రత్యారోపణలు జోరుగా సాగుతున్నాయి. రాష్ట్రంలో 39 లక్షల మంది నిరుద్యోగ యువత ఉండగా వారిలో గత మూడేళ్లలో కేవలం 21 మందికి మాత్రమే శివరాజ్ సింగ్ చౌహాన్ ప్రభుత్వం ఉద్యోగాలు ఇచ్చింది. దీనిపై ప్రతిపక్ష కాంగ్రెస్ మండిపడుతోంది.రాష్ట్ర శాసనసభలో 230 స్థానాలు ఉండగా నవంబర్ 17న ఒకే విడతలో పోలింగ్ జరుగుతుంది. 2008 నుండి అంటే గత 16 సంవత్సరాలుగా శివరాజ్ సింగ్ చౌహాన్ నేతృత్వంలోని ప్రభుత్వమే రాష్ట్రాన్ని పాలిస్తోంది. 2018 డిసెంబర్ నుండి 2020 మార్చి వరకూ మాత్రం సీనియర్ నేత కమల్‌నాథ్ నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో అధికారంలో ఉంది.

హామీలు...ఆరోపణలు

ప్రధాన పార్టీలు రెండూ ప్రజలపై హామీల వర్షం కురిపిస్తున్నాయి. కాంగ్రెస్ పార్టీ ఈ నెల 17న ఎన్నికల ప్రణాళికను విడుదల చేసింది. ఇరవై ఐదు లక్షల రూపాయల ఆరోగ్య బీమా కల్పిస్తామని, కులగణన చేపడతామని, ప్రభుత్వ ఉద్యోగాలలో ఓబీసీలకు 27% కోటా ఇస్తామని, రాష్ట్రంలో ఐపీఎల్ నిర్వహిస్తామని హామీ ఇచ్చింది. పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ జూన్‌లోనే జబల్‌పూర్ నుండి ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టారు. రాష్ట్ర ప్రభుత్వం అవినీతిలో కూరుకుపోయిందని, నిరుద్యోగ సమస్య తీవ్రమైందని ఆమె ఆరోపించారు. గత మూడేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం కేవలం 21 మందికి మాత్రమే ఉద్యోగాలు ఇచ్చిందని, ఈ సమాచారాన్ని తన కార్యాలయం మూడుసార్లు ధృవీకరించుకొని వాస్తవమేనని నిర్ధారించిందని ఆమె తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి, బీజేపీ నేత శివరాజ్ సింగ్ చౌహాన్ గత నెల 30న గిరిజనుల ప్రాబల్యం అధికంగా ఉన్న అలిరాజ్‌పూర్ జిల్లాలో జరిగిన ర్యాలీలో ప్రసంగిస్తూ రాష్ట్రంలో ప్రతి కుటుంబానికీ ఓ ఉద్యోగం ఇస్తామని హామీ ఇచ్చారు. అప్పుడు వారు వలస పోవాల్సిన అవసరమే ఉండదని చెప్పారు. 'అది స్వయం సహాయక బృందం కావచ్చు. ఉద్యమ్ క్రాంతి యోజన కావచ్చు. ప్రభుత్వ ఉద్యోగం కావచ్చు. ప్రతి కుటుంబంలో ఒక వ్యక్తికి ఉద్యోగం ఇస్తాం' అని చెప్పుకొచ్చారు.

ప్రభుత్వ లెక్కలే

పోలింగ్ తేదీ సమీపిస్తుండడంతో ఉద్యోగాల కల్పనపై బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు ప్రజలకు హామీలు గుప్పిస్తుండడంతో అసలు రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య తీవ్రత ఏ మేరకు ఉన్నదో పరిశీలించాల్సిన అవసరం ఉంది. గత సంవత్సరం శాసనసభ శీతాకాల సమావేశాల్లో ప్రభుత్వం సమర్పించిన వివరాల ప్రకారం 2022 ఏప్రిల్ 1 నాటికి రాష్ట్రంలో 25.8 లక్షల మంది నిరుద్యోగ యువత నమోదయ్యారు. ఈ ఏడాది జనవరి 1 నాటికి ఆ సంఖ్య 38,92,949కి పెరిగింది. దీనినిబట్టి చూస్తే మధ్యప్రదేశ్‌లో ప్రతి నెలా లక్ష మంది నిరుద్యోగులు తయారవుతున్నారు. నమోదైన సుమారు 39 లక్షల నిరుద్యోగుల్లో గత మూడేళ్లలో కేవలం 21 మందికి మాత్రమే రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగాలు కల్పించగలిగింది. ఇదేదో ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణ కాదు. ఈ సంవత్సరం మార్చి 1వ తేదీన శాసనసభలో కాంగ్రెస్ సభ్యుడు మేవారమ్ జాతవ్ అడిగిన ప్రశ్నకు ప్రభుత్వమే ఈ మేరకు సమాధానం ఇచ్చింది.

కుంభకోణాలే కారణమంటున్న కాంగ్రెస్

రాష్ట్రంలో 2020 ఏప్రిల్ నుండి 52 ఉపాధి కల్పన కార్యాలయాలు నడపడానికి ప్రభుత్వం రూ.16.74 కోట్లు ఖర్చు చేసింది. అంటే ఒక్కో నిరుద్యోగికి ఉద్యోగం ఇవ్వడానికి రూ.80 లక్షలు ఖర్చు చేసిందన్న మాట. కుంభకోణాల కారణంగా ఉద్యోగాలన్నీ పోయాయని కాంగ్రెస్ నేత శోభా ఓజా ఆరోపించారు. ఉపాధి కల్పన కేంద్రాల్లో 40 లక్షల మంది పేర్లు నమోదు చేసుకుంటే కేవలం 21 మందికి మాత్రమే ఉద్యోగాలు ఇవ్వడం సిగ్గుచేటని ఆమె విమర్శించారు. రాష్ట్రంలో నర్సులు, పోలీస్ కానిస్టేబుళ్లు, ఉపాధ్యాయులు, పట్వారీల నియామకాల్లో కుంభకోణాలు జరిగాయని మండిపడ్డారు. గత మూడేళ్లలో పరీక్షల ద్వారా నర్సుల నియామకాలే చేపట్టలేదని తెలిపారు.

ఆర్థిక సర్వే చెప్పిందీ అదే

వేర్వేరు ప్రభుత్వ ఉద్యోగాల్లో లక్ష మందిని నియమించామని ముఖ్యమంత్రి చౌహాన్ గత నెలలో ప్రకటించారు. రాబోయే కాలంలో వేలాది మందికి ఉద్యోగాలు ఇస్తామని కూడా ఆయన హామీ ఇచ్చారు. అయితే మధ్యప్రదేశ్ ఆర్థిక సర్వే ప్రకారం రాష్ట్రంలో నిరుద్యోగం నిలకడగా పెరుగుతూనే ఉంది. గత సంవత్సరంలో మాత్రం నిరుద్యోగ రేటు కొంత తక్కువగా ఉంది. రాష్ట్రంలో నమోదైన నిరుద్యోగ యువతలో ఎక్కువ మంది ఓబీసీలే. నిరుద్యోగ యువతలో 30% మంది ఎస్సీ, ఎస్టీలకు చెందిన వారు. మిగిలిన 70% మంది ఓబీసీలు. గ్వాలియర్‌లో అత్యధికంగా 1.55 లక్షల మంది నిరుద్యోగులు నమోదవగా భోపాల్, రేవా, మొరేనాలు తర్వాతి స్థానాల్లో నిలిచాయి.

హిందూయిజంతో ఓటు రాజకీయం

ఇస్లామ్ ఫోబియాను రెచ్చగొడుతున్న హిందూత్వ మూకలు !

- ఇజ్రాయిల్ యుద్ధం సాకుతో సోషల్ మీడియాలో సాగుతున్న విష ప్రచారం



ముంబయి : ఇజ్రాయిల్-హమాస్ మధ్య జరుగుతున్న యుద్ధాన్ని సాకుగా తీసుకుని ఇస్లామోఫోబియాను రెచ్చగొట్టడానికి బీజేపీ ప్రయత్నిస్తోంది. భారత్‌లోనే వందలాది గాజా స్ట్రిప్‌లు వున్నాయని, హమాస్ తరహాలో ఇస్లామిస్ట్ దాడులను హిందువులు ఎదుర్కొనే ప్రమాదముందని, అదే జరిగితే వాటి నుంచి భారత్‌ను కాపాడగలిగేది ప్రధాని మోడీ మాత్రమేనని బీజేపీ అనుకూల మితవాద ఆన్‌లైన్ విభాగాలు తీవ్రంగా ప్రచారం చేస్తున్నాయి. ఇజ్రాయిల్-హమాస్ యుద్ధం ముసుగులో తప్పుడు సమాచారంతో బిజెపి ప్రత్యర్థులను లక్ష్యంగా చేసుకుంటున్నాయి.

బీజేపీ నేతల పేర్లతో ప్రొ బీజేపీ వాట్సాప్ గ్రూపులు, ఫేస్‌బుక్ పేజీలు, గ్రూపుల్లో సోషల్ మీడియా యూజర్లు తమ హిందూత్వ ఎజెండాను ప్రజల్లోకి తీసుకెళ్ళడానికి ఈ యుద్ధాన్ని ఒక ఆయుధంగా మలుచుకుంటున్నారు. ముస్లింలే ప్రధాన లక్ష్యంగా తమ తుపాకులను ఎక్కుపెడుతున్నారు.

ఫోటోలు, వీడియోలు ఉపయోగిస్తూ, మెసేజ్‌లు పెడుతూ ఈ గ్రూపుల్లో ఇస్లామ్, ముస్లింలే ప్రధానంగా ఈ యుద్ధానికి కారకులంటూ ప్రజలను నమ్మించేందుకు ప్రయత్నిస్తున్నారు. అదే సమయంలో, పాలస్తీనియన్లను జిహాదీలు, తీవ్రవాదులుగా చిత్రీకరించడం ద్వారా వారు పడుతున్న ఇబ్బందులు, కష్టాలను అమానవీయంగా చూపిస్తున్నారు.

అక్టోబరు 7న దాడులు ప్రారంభమైనప్పటి నుంచి 1400మంది ఇజ్రాయిలీలు, దాదాపు 6వేల మంది పాలస్తీనియన్లు మరణించారు. పాలస్తీనియన్లలో 2300మంది చిన్నారులే వున్నారు. పైగా వీరి మరణాలపై గ్రూపుల్లో జోకులు పేలుస్తున్నారు. వారి ఇబ్బందులు, కష్టాలను అపహాస్యం చేసేలానే ఈ జోకులు వుండడమనేది సర్వసాధారణంగా వుంది.

ఇంటర్‌నెట్ ఫ్రీడమ్ ఫౌండేషన్ పాలసీ డైరెక్టర్ ప్రతీక్ వాఘ్రే మాట్లాడుతూ, భారతీయ మితవాద వర్గాల్లో ఇటువంటి విస్తృత ధోరణికి సంబంధించిన ప్రచారంలో భాగమే ఈ పోస్టులని వ్యాఖ్యానించారు. "అత్యధికంగా ముస్లింలను అప్పుడప్పుడు ఆధునిక హిందువులను శత్రువుగా లేదా ముప్పుగా చూపించేలా అంతర్జాతీయ సంఘటనలను చొప్పించేటువంటి కచ్చితమైన ధోరణి భారత్‌లో గత కొన్నేళ్ళుగా నెలకొంది." అని ఆయన పేర్కొన్నారు.

యూదు రాజ్యమైన ఇజ్రాయిల్, ముస్లింల ఆధిపత్యం కలిగిన పాలస్తీనా మధ్య ఘర్షణ యొక్క మతపరమైన కోణమే ఇందులో ప్రధానంగా వుంటుందని అన్నారు.

ఈ రచయిత వద్ద 13 వాట్సాప్ గ్రూపులకు సంబంధించిన సమాచారం వుంది. ఈ గ్రూపులన్నీ కూడా చాలా స్పష్టంగా హిందూత్వ భావజాలానికి, బీజేపీ, నరేంద్ర మోడీ, ఆర్‌ఎస్‌ఎస్‌లకు స్పష్టమైన మద్దతునిస్తున్నాయి. వాట్సాప్ గ్రూపుల పేర్లు, ఆలాగే డిస్‌ప్లే ఫోటోలు సాధారణంగా మోడీ, ఆదిత్యనాథ్ ఫోటోలు ద్వారా ఆ మద్దతనేది ప్రస్ఫుటంగా కనిపిస్తోంది. ఈ గ్రూపుల్లో సభ్యుల సంఖ్య దాదాపు 50 నుంచి 400 వరకు వుంటోంది. దీనికి తోడు, పలు ఫేస్‌బుక్ పేజీలు, గ్రూపులు కూడా వున్నాయి. అవి కూడా బీజేపీ, ఆ పార్టీ నేతలతో గల సంబంధాలను బాహటంగానే ప్రదర్శిస్తున్నాయి.

ప్రధానంగా నాలుగు థీమ్స్‌తో ఈ గ్రూపులు సాగించే ప్రచారం వుంటోంది. అవి -పాలస్తీనియన్ల ఇబ్బందులను అమానవీయంగా చిత్రీకరించడం, వారికి మద్దతివ్వడాన్ని చట్ట విరుద్ధమైనదిగా ప్రకటించడం, ఇజ్రాయిల్-గాజా యుద్ధానికి చారిత్రక భారతీయ పోలికలను తీసుకురావడం, ఇస్లామిస్ట్ దాడి గురించి హిందువులను హెచ్చరించడం, దీనిపై పోరాడే సమర్థత బీజేపీ, మోడీలకే వుందని ప్రచారం చేయడం - గా వున్నాయి.

ఇజ్రాయిలీల దుస్థితిని కాశ్మీరీ హిందువులతో పోలుస్తూ మెసేజ్‌లు పెడుతున్నారు. హమస్ చెరలో వున్న ఇజ్రాయిల్ కుటుంబానికి సంబంధించిన వీడియో ఒకటి వ్యాప్తి చేస్తూ, దాని కింద 'వారి ముఖాల్లో భయాన్ని చూడండి, 1990లో కాశ్మీరీ హిందువుల ముఖాల్లో నెలకొన్న భయమే కనిపిస్తోంది.' అంటూ పోస్టు పెడుతున్నారు. 'భారతీయులు దీన్ని ఆర్‌ఎస్‌ఎస్ ప్రచారమని పిలుస్తారు. వాస్తవానికి ఇస్లామ్ శాంతిని ప్రేమించే మతం' అంటూ వ్యంగంగా ఆ పోస్టు కింద వ్యాఖ్యానిస్తారు. దానితో వారనుకున్న ప్రయోజనం నెరవేరుతుంది. హమస్‌ను హుమయూన్, బాబర్ వంటి 'ఇస్లామిక్ ఆక్రమణదారుల'తో పోలుస్తారు.

యోగి ఆదిత్యనాథ్ ఫర్ పీఎం 2024 పేరుతో ఒక ఫేస్‌బుక్ పేజీ వుంది. దీనికి 66వేల మంది ఫాలోయర్లు వున్నారు. "హిందూ మహిళలు ఎందుకు ఆత్మాహుతికి పాల్పడ్డారో హమస్ మనకు అర్థమయ్యేలా చేస్తోంది." అంటూ ఆ పేజి అడ్మినిస్ట్రేటర్ పోస్టు పెట్టారు.

ఇజ్రాయిల్ యుద్ధం మనకు సంబంధించినదే అని ఈ గ్రూపులు మనల్ని ఒప్పించడానికి ప్రయత్నిస్తాయి. భారతీయులపై ముఖ్యంగా హిందువులపై ఇస్లామిస్ట్ తీవ్రవాదులు తక్షణమే దాడులు జరుపుతారంటూ భయాందోళనలు రెచ్చగొట్టేలా మెసేజ్‌లు పెడుతున్నారు. ఇజ్రాయిల్ మాదిరిగా భారత్‌లో కూడా భవిష్యత్తులో ఇలాంటి కుట్రలు జరుగుతాయని హెచ్చరిస్తారు. హిందూ మహిళలపై దారుణాలు, అకృత్యాలు జరిగే అవకాశం లేకపోలేదంటూ హెచ్చరిస్తున్నారు. అందువల్ల హిందువులు అప్రమత్తంగా వుండాల్సిన అవసరం వుందంటూ స్పష్టం చేసేలా పోస్టులు పెడుతున్నారు. ముఖ్యంగా రెండు విషయాలను గుర్తు పెట్టుకోవాలని, ఆయుధాలు ధరించాలని, ముస్లింలను పూర్తిగా సామాజికంగా బహిష్కరించాలని పిలుపిస్తున్నారు.

హమాస్ దాడులకు కాంగ్రెస్‌ను నిందిస్తూ కూడా వాట్సాప్‌ల్లో చాలా మెసేజ్‌లు కనిపిస్తున్నాయి. మరోవైపు నాథూరాం గాడ్సేను పొగుడుతూ సందేశాలు వస్తున్నాయి. గాడ్సే, మహాత్మా గాంధీని హత్య చేయకపోతే భారత్‌లో 3వేల కిలోమీటర్ల పొడవునా గాజా స్ట్రిప్ ఏర్పడి వుండేదని వ్యాఖ్యానిస్తున్నారు.

పాలస్తీనియన్లకు మద్దతివ్వడాన్ని అక్రమంగా, చట్టవిరుద్ధంగా పేర్కొంటున్నారు. పాలస్తీనియన్లకు మద్దతిచ్చే వారిని పాములుగా అభివర్ణిస్తున్నారు. భారత్‌లో అటువంటి పాములకు కొదవే లేదని పేర్కొంటున్నారు.

ఈ పోస్టులు, వీడియోలు, వ్యాఖ్యానాల మూల ప్రయోజనం ఒక్కటిగానే వుంటోంది. వీటన్నింటిని సమర్థవంతంగా ఎదుర్కొనగలిగే వ్యక్తి బిజెపి నేత మోడీ అని నేరుగా పేరు పెట్టి చెప్పకుండా బలవంతుడైన నాయకుడిని ఎన్నుకోవాలంటూ ఓటర్లకు విజ్ఞప్తి చేస్తున్నారు.



మణిపూర్‌లో గన్ కల్చర్

గత ఏడేండ్లలో 35,117 గన్‌లైసెన్సులు

- ఇబ్బడిముబ్బడిగా లైసెన్సుల జారీ చేసిన బీరెన్‌సింగ్ సర్కారు
- ఈశాన్య భారత్‌లో అధికంగా ఇక్కడే
- ఆర్టీఐ సమాచారంతో బహిర్గతం

జాతి హింస కారణంగా ఈ ఏడాది మే నుంచి ఈశాన్య రాష్ట్రం మణిపూర్ అల్లర్లతో అట్టుడుకుతున్నది. అధికారిక లెక్కల ప్రకారం 142 మంది చనిపోగా, వందలాది మంది గాయాలపాలయ్యారు. ఆందోళనకారులు సాయుధ బలగాల నుంచి ఆయుధాలు ఎత్తుకెళ్లటం వంటి ఘటనలు చోటు చేసుకున్నాయి. దీంతో రాష్ట్రంలో రెండు వర్గాల మధ్య చెలరేగిన ఘర్షణలు వారి మధ్య కాల్పులుకూ దారి తీశాయి. రాష్ట్రంలో శాంతి భద్రతలు చేదాటాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కూడా అల్లర్లను ఆశించినమేర నియంత్రించటంలో విఫలమయ్యాయి. పౌరుల దగ్గర ఉండే లైసెన్స్‌డ్ గన్‌లు సైతం అల్లర్లలో ఉపయోగించబడ్డాయని వార్తలు ఉన్నాయి. అయితే, రాష్ట్రంలో ఇప్పుడు గన్‌కల్చర్ ఆందోళన కలిగిస్తున్నది.



ఇంఫాల్ : బీజేపీ పాలిత రాష్ట్రం మణిపూర్‌లో గన్ కల్చర్ రాజ్యమేలుతున్నది. బీరెన్‌సింగ్ సర్కారు హయాంలో ఇది తీవ్రరూపం దాల్చింది. గత ఏడేండ్ల ఎన్డీయే పాలనలో రాష్ట్రంలో 35వేలకు పైగా యాక్టివ్ గన్ లైసెన్సులు జారీ అయ్యాయి. ఈశాన్య భారతంలోని రాష్ట్రాల్లో ఇదే అధికం కావటం గమనార్హం. సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ) కింద ఈ సమాచారం వెల్లడైంది. దేశవ్యాప్తంగా రాష్ట్రాలవారీగా జారీ అయిన గన్ లైసెన్సులకు సంబంధించిన సమాచారాన్ని కేంద్ర హౌం మంత్రిత్వ శాఖ వెల్లడించింది.

ఈ సమాచారం ప్రకారం.. దేశవ్యాప్తంగా ఈ ఏడాది జూన్ 20 నాటికి 37.7 లక్షల యాక్టివ్ గన్ లైసెన్సులు ఉన్నాయి. 2016, డిసెంబర్ నాటికి ఉన్న లైసెన్సుల సంఖ్య కంటే ఇది 4 లక్షల కంటే అధికం కావటం గమనార్హం. ప్రస్తుత సమాచారం ప్రకారం మణిపూర్‌లో 35,117 యాక్టివ్ గన్ లైసెన్సులు ఉన్నాయి. 2016, డిసెంబర్ నాటికి ఈ సంఖ్య 26,836గా ఉన్నది. కాగా, మణిపూర్‌లో 2017, మార్చిలో బీజేపీ నేతృత్వంలోని ఎన్. బీరెన్‌సింగ్ సర్కారు కొలువుదీరింది. దీంతో దాదాపు అప్పటి నుంచి రాష్ట్రంలో సుమారు 8 వేలకు పైగా గన్ లైసెన్సులు పెరిగిపోవటం గమనార్హం. మణిపూర్‌లో ఈ గన్ లైసెన్సుల సంఖ్య ఈశాన్య భారత్‌లోని మిగతా రాష్ట్రాల కంటే ఎక్కువ కావటం ఆందోళన కలిగిస్తున్నది. ఇక ఈ విషయంలో నాగాలాండ్ మణిపూర్‌తో పోటీలో ఉన్నది. ఈశాన్యంలో మణిపూర్ తర్వాత నాగాలాండ్ అధిక సంఖ్యలో యాక్టివ్ గన్ లైసెన్సులను కలిగి ఉన్నది.

మణిపూర్‌లో గన్ లైసెన్సుల సంఖ్య పెరిగిపోవటంపై మణిపూర్ మాజీ పోలీసు కమిషనరల్ రాజ్ కుమార్ నీమయ్ ఆందోళన వెలిబుచ్చారు. రాష్ట్ర ప్రభుత్వ ఉదాసీన వైఖరిని ఆయన తప్పుబట్టారు. గన్‌ల సంఖ్య పెరిగిపోవటంపై అసోం మాజీ డీజీపీ జి.ఎం. శ్రీవాస్తవ సైతం స్పందించారు. పొరుగు దేశాల నుంచి లైసెన్స్ లేని గన్‌లు సరఫరా అవుతున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.

క్రిమినల్ అభ్యర్థులకు ఈసీ షాక్

సమాచారాన్ని మూడుసార్లు బహిర్గతపర్చాలని ఆదేశం

న్యూఢిల్లీ : రాజస్థాన్‌లో రాబోయే అసెంబ్లీ ఎన్నికలకు గానూ ఎన్నికల సంఘం కఠిన నిబంధనలు, మర్గదర్శకాలను పాటిస్తున్నది. పోటీ చేయబోయే నేర చరిత కలిగి ఉన్న అభ్యర్థులు తమకు సంబంధించిన సమాచారాన్ని మూడు సార్లు బహిర్గతంగా ప్రచురించాలని ఈసీ ఆదేశించింది. రోజుకు 75వేల కాపీల ప్రచురణను కలిగి ఉన్న జాతీయ స్థాయి వార్తపత్రికలు, 25 వేల కాపీల ప్రచురణను కలిగి ఉన్న స్థానిక వార్తపత్రికల్లో సీ1, సీ2 ఫార్మాట్లను ప్రచురించాలనీ, పలు టీవీ ఛానెళ్లలోనూ వచ్చే విధంగా యంత్రాంగం తప్పకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. నేరచరిత కలిగి ఉన్న అభ్యర్థుల కోసం కొత్త మార్గదర్శకాలను జారీ చేసింది. సమాచారాన్ని వార్తపత్రికలు, టీవీ ఛానెళ్లలో వివిధ సమయాల్లో మూడు సార్లు సమాచారాన్ని ప్రచురణ, ప్రసారం చేయాలని స్పష్టం చేసింది. ఎన్నికల్లో నేర చరిత కలిగి ఉన్న అభ్యర్థుల సంఖ్య నానాటికీ పెరిగిపోవటంతో ఎన్నికల సంఘం ఇలాంటి నిర్ణయాలతో ముందుకు రావటం ఆహ్వానించదగిన పరిణామమని సామాజికవేత్తలు అంటున్నారు.

ధనవంతులు పేదలను దోచుకోవడాన్ని వ్యాపారమంటారు. పేదలు తిరగబడితే దానిని హింస అంటారు. - మార్క్‌ట్వైన్

సంపాదకీయం

మౌనం వెనుక మతలబేంటి !?

మౌనం అర్థాంగీకారం అంటారు. కాళేశ్వరం ప్రాజెక్టు లక్ష్మీ బ్యారేజీ పిల్లర్ల పగుళ్లు అవినీతికి ఆనవాళ్లనే విమర్శలు వెల్లువెత్తున్న నేపథ్యంలో బీఆర్ఎస్ సర్కారు స్పందించకపోవడాన్ని ఎలా అర్థం చేసుకోవాలి? ప్రపంచంలోనే అతిపెద్ద ఎత్తిపోతల పథకానికి బీటలు వారడం ఆందోళన కలిగిస్తున్నది. సర్కారు మాత్రం అంతర్గత చదరంగం ఆడుతుండటాన్ని ఏమనుకోవాలి? కాళేశ్వరం జలాల్లో అవినీతి ప్రవాహం జోరుగా సాగిందనీ, అక్రమాల నెగడు లేచిందని ఎప్పటినుంచో ఆరోపణలు, విమర్శలు కోకొల్లలు. రూ.80వేల కోట్ల ప్రాజెక్టుకు ఏకంగా ముఖ్యమంత్రే ఇంజినీర్‌గా పరకాయ ప్రవేశం చేశారని చెప్పుకున్న గొప్పలు అన్నీ, ఇన్నీ కావు. ఈ ప్రాజెక్టుపై ప్రశంసలు ఎంతవరకు వెళ్లాయంటే ప్రపంచంలోని ఏడు వింతలకు తోడు ఎనిమిదో వింత అన్నంతగా. ప్రాజెక్టు నిర్మాణ ప్రతిభ అంతా సీఎంగారిదే అంటూ ప్రస్తుతించిన సందర్భాలూ అనేకం. మరిప్పుడు బ్యారేజీ పగుళ్లకు ఆయనదే కదా బాధ్యత. కేవలం రెండేండ్లలోనే ప్రాజెక్టును పూర్తిచే

> చిన్న అవకాశం, ఆధారం దొరికినా విపక్షాలపై గయ్యిన లేచే గులాబీ పార్టీ ముఖ్యులు, తమకేమీ పట్టనట్టుగా ఎన్నికల ప్రచారంలో నిమగ్నమయ్యారు. వారిగొంతు పెగలక పోవడానికి కారణమేంటి? పెకిలించక పోవడంలోని మర్మమేంటి? సాక్ష్యాత్తు ప్రధాని మోడీ రాష్ట్రం గుజరాత్‌లో అనేక సాగునీటి, రవాణా ప్రాజెక్టులు కుప్పకూలు తుంటే ఇదెంత అనుకుంటున్నారా ? ఇప్పుడు బ్యారేజీ దుర్ఘటనకు ఆయన బాధ్యత తీసుకుంటారా? వివరణ ఇస్తారా ? ప్రజలకు సమాధానం చెబుతారా? అనేది నేడు మిలియన్ డాలర్ల ప్రశ్న.

శామనీ జబ్బులు చరచుకున్న నేతలంతా, ఇప్పుడు మౌనం వహిస్తున్నారేందుకు ? ఎవరి ఆదేశాల మేరకు నోరు విప్పడం లేదు. అధికారుల నెత్తికి అన్నీ అంటిం చిన తర్వాత మట్టి అంటించుకోవడం ఎందుకని అనుకుంటున్నారు కాబోలు. చేసుకున్న వారికి చేసుకున్నంత అన్నట్టు, తప్పు చేసిన వారేవరైనా పట్టు బడాల్సిందే. కాస్త వెనకా, ముందు అంతే! కేంద్ర డ్యామ్ సేఫ్టీ అధికార బృందం రాష్ట్రంలో రెండు రోజులుగా పర్యటిస్తున్నది. బ్యారేజీ ఫౌండేషన్ కింద ఇసుక కదలిక వల్లే సమస్య ఎదురైనట్టు భావిస్తున్నామని సాగునీటి శాఖ ఇంజినీర్లు సెలవియ్యడం గమనార్హం.. కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ, సీడబ్ల్యూసీకి నివేదిక సమర్పించనుంది. ఆ మేరకు అసలు కారణాలు బయటకు రావచ్చు. రాకపోనూ వచ్చు.



ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తిచేయాల్సిందే. ఎవరూ కాదనరు. దీంతో కాలం, డబ్బు కలిసి వస్తాయి. ఆమేరకు ప్రజలకూ ప్రయోజనాలు అందుతాయి. అయితే ఆ ప్రాజెక్టు ఉనికినే దెబ్బతీసేంత వేగం అవసరమా? తొందరగా నిర్మించే పేర ప్రజలు, వారి ప్రాణాలు, ఆస్తులను ప్రశ్నార్థకం చేసే అధికారం , హక్కు వ్యక్తులకుగానీ, ప్రభుత్వానికి గానీ లేదు. బీఆర్ఎస్ పరిపాలనలో సాగునీటి ప్రాజెక్టులకు ప్రాధాన్యతను ఇచ్చిన మాట వాస్తవం. అయితే ఏమేరకు ఫలితాలు వస్తాయనే సంగతి భవిష్యత్‌లో తేలాల్సిందే. నాగార్జున సాగర్, శ్రీశైలం, ఇలా చాలా ప్రాజెక్టులను గతంలోనే కట్టారు. వాటిలో ఇన్ని నిర్మాణ సమస్యలొచ్చాయా ?భారీ నిర్మాణాల్లో సమస్యలు తలెత్తడం కొత్తేమి కాకపోయినా, అసలుకే ఎసరు వచ్చే పరిస్థితి ఎప్పుడూ లేదు. నిర్మాణ లోపాలకు కారణాలు కాస్త ఆలస్యమైనా బయటకు రాకతప్పదు. మొన్న పూర్తికాకుండానే పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు పచ్చజెండా ఊపారు. రూ. 40 వేల కోట్లతో చేపట్టిన ఈ ప్రాజెక్టుకు తొమ్మిది మోటార్లకుగాను ఒక్కటే ప్రారంభించారు. ప్రాజెక్టు పూర్తయ్యేవరకు ఆగక పోవడం ఎన్నికల్లో లబ్ధికోసం కాదా? జరగరానిది జరిగి ప్రాణ, ఆర్థిక నష్టాలు చోటుచేసుకుంటే బీఆర్ఎస్ సర్కారు బాధ్యత వహిస్తుందా? కొంపలు మునిగినట్టు ఆగమేఘాల మీద పాలమూరును జాతికి అంకితం చేశారు. ఒక్క మోటరు జలాలతో లబ్ధి ఎవరికి ? ఈ రోజు రూ.240 కోట్లతో మానేరుడ్యామ్‌పై నిర్మించిన కేబుల్ బ్రిడ్జి రోడ్డుకు అప్పుడే పగుళ్లు రావడం దేనికి సంకేతం ? వీటిపై ఎన్నో అనుమానాలు, ప్రశ్నలు ప్రజల మెదళ్లను తొలుస్తున్నాయి,

చిన్న అవకాశం, ఆధారం దొరికినా విపక్షాలపై గయ్యినలేచే గులాబీ పార్టీ ముఖ్యులు, తమకేమీ పట్టనట్టుగా ఎన్నికల ప్రచారంలో నిమగ్నమయ్యారు. వారి గొంతు పెగలకపోవడానికి కారణమేంటి? పెకిలించక పోవడంలోని మర్మమేంటి? సాక్ష్యాత్తు ప్రధాని మోడీ రాష్ట్రం గుజరాత్‌లో అనేక సాగునీటి, రవాణా ప్రాజెక్టులు కుప్పకూలుతుంటే ఇదెంత అనుకుంటున్నారా? ఇప్పుడు బ్యారేజీ దుర్ఘటనకు ఆయన బాధ్యత తీసుకుంటారా? వివరణ ఇస్తారా ? ప్రజలకు సమాధానం చెబుతారా? అనేది నేడు మిలియన్ డాలర్ల ప్రశ్న. ఇదే లక్ష్మీ బ్యారేజీలో వర్షాల నేపథ్యంలో వచ్చిన భారీ వరదలకు మోటార్లు మునిగిప్పుడు 'క్లౌడ్‌బరస్ట్' అని తప్పించుకున్నారు. ఇప్పుడేమో విద్రోహ చర్యగా చిత్రీకరిస్తున్నారు. అందుకు అవసరమైన కేసులు పెట్టి ముందస్తు ఎలిబీని సృష్టించుకుంటున్నారు. ఇందుకు సాక్ష్యం అధికారులు మీడియాకు విడుదల చేసిన పత్రికా ప్రకటనలు. నిరంతర నిఘాతో కనీసం మీడియాను సైతం చూడటానికి అనుమతించనంత కఠినంగా ఉన్న ప్రభుత్వం, ఇప్పుడు సంఘ విద్రోహశక్తుల కుట్ర అనడం హాస్యాస్పదమే. ఈ ఘటనలు సర్కారును బ్యాక్‌ఫైర్ చేస్తున్నాయి. ప్రశ్నిస్తున్నాయి. బాధ్యులపై చర్యలను కోరుతున్నాయి. సమగ్ర విచారణకు డిమాండ్ చేస్తున్నాయి. ■

గాజాలో జాతి నిర్మూలన



ప్రభాత్ పట్నాయక్

హమాస్‌ను సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడుతున్న ఒక సంస్థగా కంటే ఒక ఉగ్రవాద సంస్థగా పరిగణిం చడం పాలస్తీనా ప్రజానీకాన్ని లొంగ దీసుకో డానికి ఇజ్రాయిల్ చేస్తున్న దుర్మార్గాలనూ విస్మరించడమే. అది అన్యా యమే కాదు, అనైతికం కూడా. దీనర్థం మనం హమాస్ చేస్తున్నదంతా సక్రమమేనని సమర్థిస్తు న్నట్టు ఎంతమాత్రమూ కాదు. ఇజ్రాయిల్ ప్రభు త్వం, దాని కొమ్ముకాస్తున్న పశ్చిమ సామ్రాజ్యవాద దేశాలు ఒక జాతికి చెందిన ప్రజలను పాదాక్రాంతం చేసుకోడానికి, వారికి చెందిన భూభాగాన్ని ఆక్రమించుకోడానికి సాగిస్తున్న బల ప్రయోగాన్ని చాలా న్యాయమైనదిగా చెప్పుకోవడం ఎంత మాత్రమూ చెల్లదు అని స్పష్టం చేయాలి.

ఇప్పుడు ఇజ్రాయిల్‌కు, హమాస్‌కు నడుమ సాగుతున్న యుద్ధానికి వెంటనే ముగింపు పలకాల్సిన సమయం వచ్చింది. సంప్రదింపుల ద్వారా పాలస్తీనా సమస్యకు ఒక శాశ్వత పరిష్కారాన్ని సాధించాలి. ప్రస్తుతం పాలస్తీనాలో జరుగుతున్న జాతి నిర్మూలనను ఆపాలి. ఆ ప్రజలపై ఇజ్రాయిల్ విధించిన దిగ్బంధనాన్ని ఎత్తివేయాలి. గాజా భూ భాగాన్ని ఆక్రమించుకునే ప్రయత్నాన్ని ఇజ్రాయిల్ విడనాడాలి. సమస్యను పరిష్కరించవలసిన ఐరాస ఇప్పుడు చేష్టలుడిగి నిస్సహాయంగా ఉండిపోయింది. భద్రతామండలిని పనిచేయనివ్వకుండా సామ్రాజ్యవాదులు అడ్డుకోవడమే దానికి కారణం. ఈ పరిస్థితుల్లో ప్రపంచ ప్రజలందరినీ కదిలించడమే ఏకైక మార్గం.

హమాస్ అక్టోబర్ 7న చేసిన దాడికి ప్రతిస్పందించే పేరు తో గాజా భూభాగం మొత్తాన్ని ఇజ్రాయిల్ భారీ బాంబుల వర్షం తో ముంచెత్తింది. ఆ దాడిలో కనీసం 2000 మంది పాలస్తీనా ప్రజలు మరణించారు. మరో 7000 మందికి పైగా గాయాలపాలయ్యారు. అంతటితో ఆగకుండా గాజాకు ఆహారం, విద్యుత్తు, గ్యాస్, మంచినీరు అందకుండా కట్టడి చేశారు. గత శుక్రవారం గాజా ప్రాంతంలో నివసిస్తున్న 22 లక్షల మంది ప్రజా నీకానికి (వీరంతా కేవలం 365 చదరపు కిలోమీటర్ల పరిధిలోనే జీవిస్తున్నారు) 24 గంటల్లోగా ఆ ప్రాంతాన్ని ఖాళీ చేసిపోవాలని హెచ్చరికలు జారీ చేశారు. ఆ ప్రాంతాన్ని ఇజ్రాయిల్ ఆక్రమిం చుకోడానికి సన్నాహాలు చేస్తోంది. ఐతే గాజా నుండి ఇజ్రాయిల్ పోవడానికి ఉన్న దారులన్నింటినీ మూసివేశారు. గాజా నుండి ఈజిప్ట్ పోవడానికి ఉన్న ఒకే ఒక్క దారినీ బాంబుదాడితో ధ్వంసం చేశారు. దాంతో ఆ దారిని ఉపయోగించడానికి వీలు లేకుండా పోయింది. పైగా తన దేశంలోకి పాలస్తీనా శరణార్థుల్ని అనుమతించబోనని ఈజిప్ట్ ప్రకటించింది. అంటే ఇజ్రాయిల్ ఆదేశించినట్టు గాజా భూభాగాన్ని ఖాళీ చేయడం అసాధ్యం అయింది.

> "మొత్తంగా గాని, పాక్షికంగా గాని ఒక జాతి, లేదా తెగ లేదా మత సమూహాన్ని నిర్మూలించడానికి చేపట్టే చర్యలను జాతి నిర్మూలనగా పరిగణించాలి" అని 1948 జెనీవా సదస్సులో ఐరాస తీర్మానించింది. ప్రస్తుతం గాజాలో సాగుతున్నది ఆ ఐరాస తీర్మానానికి సరిగ్గా సరిపోతుంది. ఐతే ఈ దారుణాన్ని సామ్రాజ్యవాద శక్తులు సమర్థిస్తున్నాయి. హమాస్ అనేది ఒక ఉగ్రవాద సంస్థ అని, అది ఇజ్రాయిల్ మీద దుర్మార్గంగా దాడికి తెగబడిందని, భవిష్యత్తులో కూడా హమాస్ నుండి దాడుల ముప్పు ఇజ్రాయిల్‌కు ఉందని, ఉగ్రవాద దాడుల నుండి ఆత్మరక్షణ చేసుకునే హక్కు ఇజ్రాయిల్‌కు ఉందని, హమాస్ దళాలు గాజా ప్రజానీకం వెనుక దాక్కుని ఉన్నందున హమాస్‌ను లొంగదీయాలంటే గాజా మీద దాడులు అనివార్యం అని ఇజ్రాయిల్ దాడులను సామ్రాజ్య వాదులు సమర్థిస్తున్నారు.

ఒకవేళ గాజా నుండి బైటకు రావడానికి దారి తెరచి అనుమతించినా, 10 లక్షలమంది ప్రజానీకాన్ని, అందునా, వృద్ధుల్ని, రోగుల్ని, స్త్రీలను, చిన్నపిల్లల్ని, కేవలం 24 గంటల వ్యవధి లో ఖాళీ చేయించడం సాధ్యమేనా? గంటకు 42,000 మందిని ఖాళీ చేయించాలి. అంటే ఒక్క సెకనులో 12 మందిని ఖాళీ చేయించాలి. ఇది భౌతికంగా అసాధ్యం. ఇటు వంటి గడువు విధించడం అంటే గాజా నివాసులను తమ భూభాగపు దాడుల ద్వారా అంతమొందించడాన్ని సమర్థించుకోడానికి ఇజ్రాయిల్‌కు ఒక సాకు మాత్రమే. సైనిక బలగాలు దాడులు చేయకముందే ఖాళీ చేయాలన్న ఉత్తర్వులు కలిగించిన భయోత్పాతంతో దిక్కుతోచని పరిస్థితి ఏర్పడి పెద్ద సంఖ్యలో జనం అన్ని వైపులా పరుగులు తీస్తున్నారు. దానికి తోడు రోడ్ల మీద బాంబు దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. ఫలితంగా మరిన్ని వేల మంది ప్రజల ప్రాణాలు పోతున్నాయి. ఒక్క ముక్కలో చెప్పాలంటే మన కళ్ళ ముందు ఇప్పుడు ఒక జాతిని నిర్మూలిస్తున్నారు.

'మొత్తంగా గాని, పాక్షికంగా గాని ఒక జాతి, లేదా తెగ లేదా మత సమూహాన్ని నిర్మూ లించడానికి చేపట్టే చర్యలను జాతి నిర్మూలనగా పరిగణించాలి" అని 1948 జెనీవా సదస్సులో ఐరాస తీర్మానించింది. ప్రస్తుతం గాజా లో సాగుతున్నది ఆ ఐరాస తీర్మానానికి సరిగ్గా సరిపోతుంది. ఐతే ఈ దారుణాన్ని సామ్రాజ్యవాద శక్తులు సమర్థిస్తున్నాయి. హమాస్ అనేది ఒక ఉగ్రవాద సంస్థ అని, అది ఇజ్రాయిల్ మీద దుర్మార్గంగా దాడికి తెగబడిందని, భవిష్యత్తులో కూడా హమాస్ నుండి దాడుల ముప్పు ఇజ్రా యిల్‌కు ఉందని, ఉగ్రవాదదాడుల నుండి ఆత్మరక్షణ చేసుకునే హక్కు ఇజ్రాయిల్‌కు ఉందని, హమాస్ దళాలు గాజా ప్రజానీకం వెనుక దాక్కుని ఉన్నందున హమాస్‌ను లొంగదీయాలంటే గాజా మీద దాడులు అనివార్యం అని ఇజ్రాయిల్ దాడులను సామ్రాజ్యవాదులు సమర్థిస్తున్నారు.

హమాస్ ఒక ఉగ్రవాద సంస్థ అని సామ్రాజ్యవాదులు అన్న దానిని నరేంద్రమోడీ వెంటనే సమర్థించేశారు. మాట వరసకి హమాస్ ఒక ఉగ్రవాద సంస్థ అని అంగీకరించినా, ఒక దేశంలో ఉగ్రవాదులు దాక్కొని వున్నారు అనే సాకుతో ఆ దేశంలోని ప్రజానీకాన్ని తుదముట్టించే హక్కు ఏ దేశానికైనా ఉందని అంతర్జాతీయంగా ఏ చట్టమూ ఒప్పుకోదు. జెనీవా నాల్గ వ సదస్సు తీర్మానం ప్రకారం ఏ కొద్దిమందో నేరం చేసినం దుకు మొత్తం ప్రజానీకాన్ని, వారు వ్యక్తిగతంగా ఏ నేరమూ చేయకపోయినా, ఉమ్మడిగా శిక్షించడం యుద్ధనేరంగా పరిగణించబడుతుంది. ఇప్పుడు ఇజ్రాయిల్ చేస్తున్నది ఉమ్మడిగా శిక్షించడం మాత్రమే కాదు. మొత్తం ఒక జాతినే నిర్మూలించే దాడి.

ప్రజలకు నీరు, విద్యుత్తు, ఆహారం అందకుండా నిరోధించడమే యుద్ధ నేరంగా పరిగణించబడుతుంది. సాధా రణ పౌరులు జీవించే ప్రాంతాల్లో బాంబుదాడులు చేయడం కూడా యుద్ధ నేరమే ఔతుంది. అటువంట ప్పుడు ఆచ రించడానికి సాధ్యం కాని ఉత్తర్వులు జారీ చేసి ఆ గడువులోపల ఖాళీ చేయాల్సిందేనని ఒత్తిడి చేయడం కూడా యుద్ధ నేరమే ఔతుంది. ఐరాస కూడా ఇజ్రాయిల్ సాగిస్తున్నది యుద్ధ నేరమే నని ప్రకటించింది. ఇది జాతి నిర్మూలన తప్ప వేరొకటి కాదు.

హమాస్ దాడిలో మరణించిన ఇజ్రాయిలీ పౌరుల మర ణాల గురించి వాపోతున్న పశ్చిమ సామ్రాజ్యవాద దేశాలు ఇజ్రా యిల్ సాగిస్తున్న యుద్ధ నేరాల గురించి, అక్కడ ఇజ్రా యిల్ సాగిస్తున్న పాలస్తీనా జాతి నిర్మూలన గురించి ఒక్క ముక్క కూడా మాట్లాడడం లేదు. అంటే వాళ్ళ దృష్టిలో ఇజ్రా యిల్ పౌరుల ప్రాణాలకే విలువ ఉంది తప్ప పాలస్తీనియన్ల ప్రాణాలకు లేదు. ఇజ్రాయిల్ ప్రభుత్వం పాటిస్తున్న జాత్య హంకార ధోరణినే సామ్రాజ్యవాద దేశాలూ ప్రదర్శిస్తున్నాయి. ఆ ప్రభుత్వానికే మద్దతు కొనసాగిస్తున్నాయి. తమ తప్పుడు వైఖరిని సమర్థించు కోడానికి వాళ్ళు బూటకపు కథనాలను సృష్టిస్తున్నారు. వాటిని ఇజ్రాయిల్‌లో ఉన్న మత విద్వేష శక్తులు ప్రచారం చేస్తున్నారు. యూదు బిడ్డల తలల్ని హమాస్ సైనికులు నరికివేశారన్నది అటు వంటి కట్టుకథల్లో ఒకటి. వీటిని ఆసరాగా చేసుకుని గాజా ప్రాంతాన్ని మొత్తంగా తాము ఆక్రమించుకోవడం సరైనదేనన్న వాదనను ఇజ్రాయిల్ రక్షణ మంత్రి యోవ్ గ్యాలంట్ ముందుకు తెచ్చారు. "మేం పశువులతో పోరాడుతున్నాం. పశువులతో ఏ విధంగా వ్యవహరించాలో ఆ విధంగానే వ్యవహరిస్తాం" అని ప్రకటించారు.

కాని హమాస్‌ను ఒక ఉగ్రవాద సంస్థగా అభివర్ణించడం అంటే 75 సంవత్సరాల చరిత్రను చూడకుండా కళ్ళు మూసుకోవడమే. ఈ 75 ఏళ్ళ పాటూ పాలస్తీనా భూభాగాలను ఇజ్రాయిల్ ఆక్రమించుకుంటూనే వుంది. పాలస్తీనా ప్రజల్ని దారుణంగా అణచివేస్తూనే వుంది. చిత్రహింసలపాలు చేస్తూనే వుంది. వారి సంపదలను కొల్లగొట్టి నిరాధారులుగా నిలబెట్టింది. ఇటీవల నేను ఒక అంతర్జాతీయ ట్రిబ్యునల్‌లో న్యాయమూర్తుల బృంద సభ్యుడిగా వ్యవహరించాను. అమెరికన్ సామ్రాజ్యవాదం విధించిన ఆర్థిక ఆంక్షలను ఎదుర్కొంటున్న 15 దేశాల నుండి వచ్చిన ప్రతినిధులు ఆ ట్రిబ్యునల్ ముందు సాక్ష్యం ఇచ్చారు. సుమారు



మూడు నెలల ముందు గాజా నుండి వచ్చిన ప్రతినిధి మా ముందు తన సాక్ష్యం వినిపిస్తున్న సమయంలోనే గాజాలో బాంబుల మోత వినపడుతోంది. అక్కడ సాధారణ పౌరులపై బాంబింగ్ జరిగింది. అంటే అది స్పష్టంగా యుద్ధ నేరం ఔతుం ది. ఈ విధంగా ఒకదాని వెంట మరొకటిగా ఇజ్రాయిల్ సాగిం చిన యుద్ధ నేరాలు గత కాలంలో సామ్రాజ్యవాదులు వలసలను ఆక్రమించుకుని అక్కడి స్థానికులను సామూహికంగా నిర్మూలిం చిన సందర్భాలను గుర్తుకు తెస్తున్నాయి. ఈ దాడులకు పరాకాష్ట అల్-అక్సా మసీదును ధ్వంసం చేయడం. హమాస్ దాడిని పురికొల్పిన వరుస సంఘటనల క్రమం ఇది.

అంతర్జాతీయ న్యాయసూత్రాల ప్రకారం, ఇజ్రాయిల్ బలవంతంగా తమ భూభాగాలను ఆక్రమించుకుంటున్నప్పుడు సాయుధ ప్రతిఘటనతో సహా అన్న రకాలుగా ఎదుర్కొనే హక్కు పాలస్తీనియన్లకు ఉంది. 1983లో ఐరాస సర్వసభ్య సమావేశం తీర్మానం ఈ విషయాన్ని స్పష్టంగా ప్రకటించింది: "తమ స్వాతంత్ర్యాన్ని, సరిహద్దులను, జాతీయ సమైక్యతను కాపాడుకోడానికి, వలసాధిపత్యం నుండి, జాతి వివక్షత నుండి, విదేశీ ఆక్రమణ నుండి విముక్తి సాధించడానికి, సాయుధ పోరాటంతో సహా అన్ని రకాల పోరాటాలనూ చేపట్టే అధికారం పాలస్తీనా ప్రజలకు ఉంది" అని ఆ తీర్మానం స్పష్టం చేసింది. హమాస్‌ను సామ్రా జ్యవాదానికి వ్యతిరేకంగా పోరా డుతున్న ఒక సంస్థగా చూసే బదులు కేవలం ఒక ఉగ్రవాద సంస్థగా పరిగణించడం అంటే పాలస్తీనా ప్రజానీకాన్ని లొంగదీసుకోడానికి ఇజ్రాయిల్ సాగిస్తున్న అన్ని రకాల దుర్మా ర్గాలనూ విస్మరించడమే.

> అంతర్జాతీయ న్యాయసూత్రాల ప్రకారం, ఇజ్రాయిల్ బలవంతంగా తమ భూభాగాలను ఆక్రమించుకుంటున్నప్పుడు సా యుధ ప్రతిఘటనతో సహా అన్న రకాలుగా ఎదుర్కొనే హక్కు పాలస్తీనియన్లకు ఉంది. 1983లో ఐరాస సర్వసభ్య సమావేశం తీర్మానం ఈ విషయాన్ని స్పష్టంగా ప్రకటించింది: "తమ స్వాతంత్ర్యాన్ని, సరిహద్దులను, జాతీయ సమైక్యతను కాపాడుకోడానికి, వలసాధిపత్యం నుండి, జాతి వివక్షత నుండి, విదేశీ ఆక్రమణ నుండి విముక్తి సాధించడానికి, సాయుధ పోరాటంతో సహా అన్ని రకాల పోరాటాలనూ చేపట్టే అధికారం పాలస్తీనా ప్రజలకు ఉంది" అని ఆ తీర్మానం స్పష్టం చేసింది. హమాస్‌ను సామ్రా జ్యవాదానికి వ్యతిరేకంగా పోరా డుతున్న ఒక సంస్థగా చూసే బదులు కేవలం ఒక ఉగ్రవాద సంస్థగా పరిగణించడం అంటే పాలస్తీనా ప్రజానీకాన్ని లొంగదీసుకోడానికి ఇజ్రాయిల్ సాగిస్తున్న అన్ని రకాల దుర్మా ర్గాలనూ విస్మరించడమే.

ఇజ్రాయిల్‌లో సైతం అంతకంతకూ ఎక్కువమంది ప్రజలు తమపాలకులు చేస్తున్న దుర్మార్గాలను వ్యతిరేకిస్తు న్నారు. "సమస్యాత్మకంగా ఉన్న" కొద్దిమంది "ఉగ్రవాదులను" గనుక ఏరి పారేస్తే ఇజ్రాయిల్‌కు శాంతి సుస్థిరంగా ఏర్పడుతుంది అన్న ఒక తప్పుడు అభిప్రాయాన్ని ఇజ్రాయిల్ ప్రభుత్వం ముందుకు తె స్తోంది. గత 75 సంవత్సరాల కాలంలోనూ అటువంటి శాంతిని ఎందుకు ఇజ్రాయిల్ ప్రభుత్వం నెలకొల్పలేక పోయింది? అన్న ప్రశ్నకు దాని వద్ద సమాధానం లేదు. ప్రస్తుతం సాగిస్తున్న జాతి నిర్మూలన కార్యక్రమాల వంటివి పాలస్తీనా ప్రజల తరపున పోరాడే ఏదో ఒక సంస్థ నుండి (అది హమాస్ కావచ్చు, మరే దైనా కావచ్చు) తప్పకుండా ప్రతీకార చర్యలకు దారి తీస్తాయి. మరిన్ని ప్రాణాలుపోతాయి. మరింత హింసాకాండ చెల రేగుతుంది.

చరిత్రలో యూదు జాతీయులు అనుభవించిన కష్టాలను, ముఖ్యంగా యూరప్‌లో నాజీల చేతుల్లో వారనుభవించిన బాధలను ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రజాతంత్ర వాదులంతా సానుభూతితోనే చూశారు. ఐతే ఇప్పుడు ఇజ్రాయిల్ ప్రభుత్వం, దాని కొమ్ముకాస్తున్న సామ్రాజ్యవాదులు గత కాలపు అనుభవాలను ఇప్పుడు ప్రస్తావిస్తూ తాము సాగిస్తున్న దాడులను సమర్థించుకుంటున్నారు. ఆ క్రమంలో ఆ నాటి యూదు జాతీయులపై సాగిన ఊచకోత ప్రాధాన్యతను తగ్గించి వేస్తున్నారు. ఒకప్పుడు యూదులు ఏ విధమైన బాధలను, ఊచకోతను నాజీల నుండి ఎదుర్కొన్నారో, ఇప్పుడు పాలస్తీనా ప్రజల మీద వాటినే ఇజ్రాయిల్ ప్రయోగిస్తోంది. 1943లో వార్సా నిర్బంధ కేంద్రాల నుండి యూదులు నాజీ ల మీద సాగించిన తిరుగు బాట్లకు, ప్రస్తుతం గాజాలో జరు గుతున్న పరిణామాలకు మధ్య సామ్యం చూస్తు న్నారు కొందరు. కాని నెతన్యాహుకి మాత్రం ఇవేమీ పట్టడం లేదు. సామ్రాజ్య వాదుల దన్ను చూసుకుని రెచ్చిపోతూ తన ఫాసిస్టు విద్వేష వైఖ రినే ప్రదర్శిస్తున్నాడు. "యూదు వ్యతిరేకత"ను అదుపుచేసే సాకు తో ఫ్రెంచి ప్రభుత్వం తన దేశంలో పాలస్తీనా ప్రజలకు సంఘీ భావం తెలిపే ప్రదర్శనలను నిషేధించింది. తక్కిన పశ్చిమ సంపన్న దేశాలలో కూడా ఇదే మాదిరి ఆంక్షలు విధించారు.

ఇప్పుడు ఇజ్రాయిల్‌కు, హమాస్‌కు నడుమ సాగుతున్న యుద్ధానికి వెంటనే ముగింపు పలకాల్సిన సమయం వచ్చింది. సంప్రదింపుల ద్వారా పాలస్తీనా సమస్యకు ఒక శాశ్వత పరిష్కారాన్ని సాధించాలి. ప్రస్తుతం పాలస్తీనా లో జరుగుతున్న జాతి నిర్మూలనను ఆపాలి. ఆ ప్రజలపై ఇజ్రాయిల్ విధించిన దిగ్బంధనాన్ని ఎత్తివేయాలి. గాజా భూభాగాన్ని ఆక్రమించుకునే ప్రయత్నాన్ని ఇజ్రాయిల్ విడనాడాలి. సమస్యను పరిష్కరించవలసిన ఐరాస ఇప్పుడు చేష్టలుడిగి నిస్సహాయంగా ఉండిపోయింది. భద్రతామండలిని పని చేయనివ్వకుండా సామ్రాజ్యవాదులు అడ్డుకోవడమే దానికి కారణం. ఈ పరిస్థి తుల్లో ప్రపంచ ప్రజలందరినీ కదిలించడమే ఏకైక మార్గం.

(స్వేచ్ఛానుసరణ) ■

బీభత్స రక్త వాకిలి

అక్కడ...
ఉదయస్తమయాలు లేవిప్పుడు....
ఏ పవిత్ర నెలవంకలు కనిపించవు
ఏ పరిశుద్ధ నక్షత్రాలు పూయవు
నింగి నింగంతా.....
శతఘ్ని గర్జనలు మిగిల్చిన శకలాలు
కారు చీకట్లు తప్ప

అక్కడ....
ఏ అజాల చప్పుడులుండవు
ఏ ప్రార్థనల కోలాహలాలుండవు
నింగినేలల్ని ఏకంచేసే ఆర్తనాదాలు తప్ప

అక్కడ....
ఏ పవిత్ర స్థలము లేదు
నేలనేలంతా మా నెత్తురుకన్నీళ్లు కలిసి పారుతున్న
మృత సముద్రమే(డెడ్ సీ) ఇప్పుడు...

యుద్ధం
విశ్వ వీధిలో
రక్తపు కళ్ళాపి చల్లి
చెదిరిపోయిన ముగ్గులో
చెల్లా చెదురైన చుక్కల్లా
చిద్రమైన దేహాలను మిగులుస్తుంది

యుద్ధం ఎప్పుడూ...
పరిశుద్ధ జాతినో
పవిత్ర స్థలాలనో సృష్టించదు
ఇరువైపులా....
క్షతగాత్రుల సమూహాలను సృష్టిస్తుంది
నిరాశ్రయ శిబిరాలను నెలకొల్పుతుంది
తల్లివేరు నుండి వేరైన కొమ్మలను మిగుల్చుతుంది
తుపాకీ గుళ్లకు రాలిన పువ్వుల్ని చూపిస్తుంది
చరిత్ర ఎప్పటికీ చెరుపుకోలేని
చిద్రమైన బతుకుల
రక్తపు చిత్తరువును చిత్రిస్తుంది
ఇంకిపోని కన్నీటి
జీవనదులను నిత్యం ప్రవహిస్తుంది

అయినవారు ఎక్కడున్నారోనని
వెతుకుతూనే ఉన్న కళ్ళకు
మీ యుద్ధం ఏ సాక్షిగా మిగిలింది?
పాల కోసం గుక్కపట్టి ఏడ్చే పసి ప్రాణం
ఏ పవిత్ర స్థలాన్ని కోరుతుంది?
లోకమైనా చూడకుండానే...
గర్భంలోనే సమాధి అయిన శిశువు
ఏ దేశాన్ని ఆక్రమించిందో
చెబుతారా.....?

చీమల పుట్టల్ని
పాములు ఆక్రమిస్తే వ్యతిరేకిస్తాను
తోడేళ్ళ దాడులను ఖండిస్తాను
తోడేళ్ళపై తిరుగుబాటు పేర
గొర్రెలపై పిచ్చికుక్కల వేటను సమర్థించలేను

నేను మనుషుల్ని ప్రేమిస్తాను మిత్రమా...
మనుషుల్ని ప్రేమించే వాళ్ళు
యుద్ధాన్ని కాంక్షించరు!
యుద్ధాన్ని కాంక్షించే వాళ్ళు
మనుషుల్ని ప్రేమించలేరు!!

పాలస్తీనా - ఇజ్రాయేల్ యుద్ధాన్ని నిరసిస్తూ...

- దిలీప్.వి, 8464030808

కూర్చోవటం వారికి హక్కుగా ఉండాలి

రాష్ట్రంలో పండుగ సీజన్ నడుస్తోంది. అక్టోబర్ నెలలో దసరాతో మొదలయి నవంబర్‌లో దీపావళి, డిశంబర్‌లో క్రిస్మస్, జనవరిలో సంక్రాంతితో ముగుస్తుంది. ఈ నాలుగు నెలలు ఆఫర్లతో, డిస్కౌంట్లతో మోత మోగించేస్తున్నారు. విద్యుల్లతలతో, రంగు రంగుల కాంతులీనుతూ పెద్దపెద్ద భవంతులు వెలిగిపోతూ షాపింగ్ మాల్స్‌లలో వ్యాపారాలు జోరుగా సాగిపోతున్న కాలమిది. ధమాక ఆఫర్లతో, కస్టమర్లకు వంగి, వంగి నమస్కా రాలు చేస్తూ, నవ్వుతూ ఆహ్వానాలు పలికే ఆ చల్లటి ప్రదేశాలలో ఆహ్లాదంగా షాపింగ్ చేసుకుని దర్జాగా కొనుగోలుదారులు వస్తుంటారు.

ఎవరు వీరు?

వీరికున్న కష్టమేమిటి!?

ఆ చమర్చిన కళ్ల ఎవరి కోసం వెతుకు తున్నాయి!!?

తమ కష్టాన్ని తమకున్న ఇబ్బందులను చెప్పుకోవాలని ప్రయత్నించే ఈ మనుషులకు తోడేళ్లలాగా తనిఖీ చేసే సూపర్‌వైజర్లు, యాజమాన్యపు సిబ్బంది నిఘా మధ్య కుక్కిన పేనుల్లా పనులు చేసుకుపోయే శ్రామిక మహిళల్ని షాపింగ్ మాల్స్, బట్టలషాపులు, పెద్ద పెద్ద సూపర్ మార్కెట్లలో చూస్తుంటాము.

మీరు ఎప్పుడైనా గమనించారా?! ఈ మహిళలు ఎప్పుడు మనం షాపింగ్‌కు వెళ్లినా నిలబడే కనిపిస్తారు. పక్కన కనీసం కూర్చోవడానికి స్టూలుకానీ, కుర్చీ కానీ కనపడదు. ఉదయం 9 గంటలకు డ్యూటీకి వచ్చింది మొదలు రాత్రి 9 గంటలకు డ్యూటీ దిగేంతవరకు సుమారు 12 గంటల పాటు కంటిన్యూగా నిలబడే ఉండాల్సిన ఉద్యోగం వారిది.

మహిళలు షాపింగ్‌మాల్స్‌లో కూర్చునే హక్కును దేశంలో మొట్టమొదటిసారిగా కేరళ రాష్ట్ర ప్రభుత్వం చట్టం తెచ్చింది. ఆ తరువాత తమిళనాడు ప్రభుత్వం కూర్చునే హక్కును కల్పిస్తూ చట్టం చేసింది.

మన రెండు తెలుగు రాష్ట్రాలలో ఇది హక్కుగా, చట్టంగా లేకపోవడం విచారకరం. తక్షణం ఈ సమ స్యపై తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలు చట్టం చేయాల్సిన అవశ్యకత ఎంతైనా ఉంది.

మారుతున్న జీవన సరళి, నూతన ఆర్థిక విధానాల ప్రభావం, ప్రజల్లో పెరుగుతున్న వినిమయతత్వం కారణంగా పెద్ద నగరాలకు పరిమితమైన షాపింగ్‌మాల్స్ చిన్న పట్టణా లకు సైతం వ్యాపిస్తున్నాయి.

ఈ రంగంలో చదువుకున్న వారి సంఖ్య ఎక్కువగా ఉన్నది. గ్రామీణ ప్రాంతాల నుంచి వలసవచ్చి ఈ పనులలో అత్యధికులు చేరుతున్నారు.

ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలలో రిలయన్స్, డీ-మార్ట్, సిటీమార్ట్, బిగ్‌బజార్, శుభమస్తు, సౌత్ ఇండియా షాపింగ్ మాల్, ఎంజిఆర్, పసుపర్తి, చందనా బ్రదర్స్, చందన రమేష్, అపూర్వ, కళానికేతన్, కంచి పెరుమాళ్ సిల్క్స్, సిఎంఆర్ వంటి షాపింగ్ మాల్స్‌తో పాటు పలు జ్యూవెలరీ మార్టులున్నాయి. వందల సంఖ్యలో మాల్స్, పెద్ద సంఖ్యలో ఇతర సంస్థలు పోటీలు పడి ముందుకు వస్తున్నాయి.

లక్షల సంఖ్యలో శ్రామికులు వీటిలో ఉపాధికై పని చేస్తున్నారు. వీరికి కార్మిక చట్టాలు అమలు కావడం లేదు. ప్రభుత్వం నిర్ణయించిన వేతనాలు ఇవ్వటం లేదు.

గంటలకొద్దీ నిలబడటం వల్ల ఆరోగ్య సమస్యలు పెరిగి పోతున్నాయి. అత్యధిక చోట్ల మహిళలకు కూర్చునే సౌకర్యం లేదు. కస్టమర్లు లేనప్పుడు కూడా కూర్చునేందుకు కనీసం స్టూళ్ల కూడా లేవు. తిరుపతి నగరంలో సిఐటియు కార్యకర్తల పరిశీలనలో దిగ్భ్రాంతికరమైన వాస్తవాలు వెల్లడయ్యాయి.

ఈ మహిళలకు నిలబడి ఉండటం కారణంగా మూత్రాశయ వ్యాధులు, కాళ్లపై వెరికోస్ వెయిన్స్ (నరాలు ఉబ్బటం) వ్యాధి, వెన్నుపూస, నుడుమునొప్పి వంటి సమస్యలు చిన్న వయసులోనే వస్తున్నాయి.

శుభమస్తు షాపింగ్ మాల్స్‌లో 10 నిమిషాలు మాత్రమే వాష్‌రూమ్‌కు వెళ్లాలనే నిబంధన ఉంది. బాత్‌రూమ్‌కు వెళ్లిన ప్రతిసారి బయోమెట్రిక్‌లో నమోదు చేయాలి.

చందనలో కస్టమర్లు లిఫ్ట్‌లో వస్తారు. కార్మికులు లిఫ్ట్ ఎక్కడానికి వీలు లేదు. ఎన్ని సార్లయినా, ఎన్ని అంతస్తులైనా మెట్లపై నడవాల్సిందే. పీరియడ్స్ సమయంలో మహిళల బాధ వర్ణనాతీతంగా ఉంటుంది.

కార్మికులకు భోజనాలు చేయడానికి సౌకర్యాలు లేవు. టాప్‌ఫ్లోర్‌లో వాష్‌రూముల దగ్గర భోజనాలు చేస్తుంటారు. వంటరి మహిళలు, పెళ్లికానివారు, ఇంటిని పట్టించుకోని భర్తలున్న మహిళలు అనివార్యమై కుటుంబ భారాన్ని మోస్తున్నట్టుగా ఈ సర్వేలో వెల్లడైంది.

పిల్లలరక్షణ, వారి భవిష్యత్తుపై వీరికి తీవ్ర ఆందోళన ఉంది. కుటుంబానికి సమయం ఇవ్వలేక పోతున్నామన్న బాధ



వీరిలో కనిపిస్తుంది. ఇక ఒంటరి మహిళల బాధ వర్ణనాతీతం. పిల్లలు ఎలా పెరుగుతున్నారో పరిశీలన చేసే అవకాశం తమకు లేదని వాపోతున్నారు.

మహిళలకు, పురుషులకు వేతన వ్యత్యాసం ఉంది. ఎన్ని ఏళ్లయినా ఒకే రకమైన పనులు చేయాలి. దీంతో మనుషులు యాంత్రికంగా తయారవుతున్నారు. ప్రమోషన్లు లేవు. వర్కర్లతోపాటు ఈ రంగంలో హెల్పర్లు పని చేస్తున్నారు. వీరికున్న సమస్యలు వర్కర్ల కంటే ఎక్కువగా ఉన్నాయి. పని ఎక్కువ, వేతనం తక్కువ. కొనుగోలుదార్లు చూసిన బట్టలు, వస్తువులను సర్దటమే వీరి ప్రధాన పని.

వేతనాలు రూ.6 వేల నుంచి 14 వేల వరకు చెల్లిస్తున్నారు. పెద్ద మాల్స్‌లో కనీస వేతనం, ఇఎస్ఐ, పిఎఫ్‌లు అమలు చేస్తున్నా పని గంటలు చట్ట ప్రకారం అమలు చేయటం లేదు.

కార్మికులకు ప్రోత్సహకాలు, బోనస్ పేరుతో పోటీ పెంచుతున్నారు. ఒక్కో అంతస్తులో ప్రతిరోజూ 'మంచి ఉద్యోగి' పేరిట ఎంపిక చేస్తారు. ఇందుకొరకు అమ్మకాలు పెంచమని విపరీతమైన టార్చర్ ఉంటుంది.

తెలుగు రాష్ట్రాలలో ఎక్కడా 8 గంటల పనివిధానం అమలు కావటం లేదు. 10 నుంచి 12 గంటలపాటు కనీసంగా వీరు పని చేయాల్సి వస్తున్నది. దూర ప్రాంతాల నుంచి వచ్చే వారు రోజులో రాక పోకలు కలుపుకుంటే 14 నుంచి 16 గంటలు ఈ పనిలో ఉండాల్సి వస్తున్నది.

> కేరళ చట్టంలో ప్రతి కార్మికునికి వారానికి ఒకరోజు సెలవుదినంగా ఇవ్వాలని, మహిళా కార్మికులను రాత్రి 9 నుంచి ఉదయం 6 గంటల మధ్య పని చేయించరాదని చట్టంలో పేర్కొన్నది. తప్పనిసరి పరిస్థితులు ఎదురైనప్పుడు ఐదుగురు కార్మికులు ఓ గ్రూపుగా ఉండాలి. అందులో ఇద్దరు మహిళలు ఉండాలి. వారికి తగిన రక్షణ కల్పించాలి. ఇంటి వరకూ రవాణా సౌకర్యం కల్పించాలని చెప్పబడింది. షాపుల్లో నిలబడి పని చేసే వారికి వారి పని ప్రదేశాలలో కూర్చోవటానికి సౌకర్యం కల్పించాలని స్పష్టంగ చట్టంలో వివరించబడింది.

ప్రభుత్వ నిబంధనల ప్రకారం సెలవులు అమలు కావటం లేదు. ఒక్కరోజు సెలవు తీసుకుంటే రెండు రోజుల వేతనాన్ని కత్తిరిస్తున్నారు.

2018లో కేరళ రాష్ట్ర ప్రభుత్వం షాపింగ్‌మాల్స్‌లో పని చేసే మహిళలకు 'కూర్చోవటాన్ని' ఓ హక్కుగా గుర్తిస్తు కేరళ షాప్స్ & కమర్షియల్ ఎస్టాబ్లిష్‌మెంట్ చట్టం - 2018ని కేరళ అసెంబ్లీ ఆమోదించింది. తరువాతి కాలంలో తమిళనాడు రాష్ట్రం మహిళలకు కూర్చోవటాన్ని ఓ హక్కుగా గుర్తిస్తూ చట్టం చేసింది.

కేరళ చట్టంలో ప్రతి కార్మికునికి వారానికి ఒకరోజు సెలవుదినంగా ఇవ్వాలని, మహిళా కార్మికులను రాత్రి 9 నుంచి ఉదయం 6 గంటల మధ్య పని చేయించరాదని చట్టంలో పేర్కొన్నది.

తప్పనిసరి పరిస్థితులు ఎదురైనప్పుడు ఐదుగురు కార్మికులు ఓ గ్రూపుగా ఉండాలి. అందులో ఇద్దరు మహిళలు ఉండాలి. వారికి తగిన రక్షణ కల్పించాలి. ఇంటి వరకూ రవాణా సౌకర్యం కల్పించాలని చెప్పబడింది. షాపుల్లో నిలబడి పని చేసే వారికి వారి పని ప్రదేశాలలో కూర్చోవటానికి సౌకర్యం కల్పించాలని స్పష్టంగ చట్టంలో వివరించబడింది.

కేరళ, తమిళనాడు తరువాత దేశంలో ఎక్కడా ఇది చట్టంగా రూపు దాల్చలేదు. మహిళోద్ధారకులుగా తమను తాము కీర్తించుకునే జగన్, కేసిఆర్‌లకు ఈ సమస్య పట్టడంలేదు.

పని ప్రదేశంలో లైంగిక వేధింపుల సమస్య కూడా తీవ్రమైన అంశంగా ఉంది. 2013 లైంగిక వేధింపుల నిరోధక చట్టం అనుసరించి మాల్స్‌లలో ఎక్కడా అంతర్గత కమిటీలు లేవన్న వాస్తవం ఈ పరిశీలనలో వెల్లడయింది.

తక్షణం ఉభయ రాష్ట్రాల తెలుగు ప్రభుత్వాలు ఎన్నికల తరుణంలోనైనా వీరి సమస్యలకు పరిష్కారాన్ని చూపించాల్సిన బాధ్యత ఉంది. కార్మిక సంఘాలు ఈ డిమాండ్ల సాధనకై, నడుం బిగిస్తాయని ఆశిద్దాం. ■

- కందారపు మురళి, 9490098840

ప్రజా ఆశీర్వాద యాత్ర ఇంటింటి ప్రచారానికి సెగ

- దళితబంధుపై మంత్రి కొప్పులకు నిరసన



నవతెలంగాణ - ఎండపల్లి

సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్‌కు దళితబంధు అర్హుల నిరసన సెగ తగిలింది. ఎన్నికల నేపథ్యంలో ప్రజా ఆశీర్వాదయాత్రను జగిత్యాల జిల్లా ధర్మపురి నియోజ కవర్గంలోని వెల్గటూర్ మండలం లోని జగదేవ్‌పేట్ గ్రామంలో బుధవారం ప్రారం భించారు. వెల్గటూర్ మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో అడుగుపెట్టగానే దళితుల నుంచి తీవ్ర వ్యతిరేకత ఎదురైంది. దళితబంధు ఎంపికలో ఏ ప్రాతిపదికన ఎంపిక చేశారని నిలదీశారు. కటిక దారిద్ర్యంలో ఉన్న తమకు దళితబంధు పథకంలో ఎందుకు ఎంపిక చేయలేదని ప్రశ్నించారు. దీంతో స్థానిక బీఆర్ఎస్ నాయకులు దళితబంధు పథకం నిరంతర ప్రక్రియ అని, రాష్ట్రంలో విడతల వారీగా దళితులందరికీ వర్తింప చేస్తామని వారించే ప్రయత్నం చేశారు. కాగా ప్రథమ ప్రాధాన్యంలో మీరెందుకు దళితబంధు తీసుకున్నారని, కూలిపోయే ఇండ్లలో కాలం గడుపుతున్నామని, కొందరికి ఇండ్లు లేక కిరాయికి ఉంటున్నారని అయినా తమకు దళితబంధు, గృహలక్ష్మి రాదంటూ మహిళలు, దళితులు ఎదురు ప్రశ్నించడంతో స్థానిక నాయకులు అవాక్కయ్యారు. దీంతో చేసేది ఏమీ లేక మంత్రి కొప్పుల ఈశ్వర్ మెయిన్ రోడ్డులో ప్రజా ఆశీర్వాద యాత్రను మొదలుపెట్టి తూతూ మంత్రంగా పూర్తి చేశారు.

మేం ముగ్గురం కాంగ్రెస్‌ను వీడింది అందుకే..

- మాజీ మంత్రి పొన్నాల



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కాంగ్రెస్‌లో బీసీలకు ఏ మాత్రం గౌరవం లేదని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత పొన్నాల లక్ష్మయ్య ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే ఆ పార్టీకి రాష్ట్ర అధ్యక్షులుగా పనిచేసిన తనతోపాటు డీ. శ్రీనివాస్, కే.కేశవరావు బయటికొచ్చామని తెలిపారు. దీన్నిబట్టే కాంగ్రెస్‌లో బీసీల పరిస్థితి ఏంటనేది అర్థం చేసుకోవచ్చున్నారు. బుధవారం హైదరాబాద్‌లో ఆయన మీడియా ప్రతినిధులతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. దేశాన్ని దశాబ్దాలపాటు పాలించిన కాంగ్రెస్... మహిళా బిల్లును ఎందుకు ఆమోదించలేకపోయిందని ప్రశ్నించారు. మోడీ ప్రభుత్వం ఆ బిల్లును ప్రవేశపెట్టిన తర్వాత... ఇప్పుడు అనేక పార్టీలు ఓబీసీ రిజర్వేషన్ల గురించి మాట్లాడుతున్నాయని గుర్తు చేశారు. అంతకంటే ముందే రాష్ట్రంలోని స్థానిక సంస్థల్లో మహిళలకు రిజర్వేషన్లు కల్పించిన ఘనత సీఎం కేసీఆర్‌కు దక్కుతుందని అన్నారు. తాను ఎలాంటి పదవులూ ఆశించి బీఆర్ఎస్‌లోకి రాలేదని ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. తనకు కాంగ్రెస్‌లో గౌరవం దక్కలేదనీ, ఆ గౌరవం కోసమే తాను ఆ పార్టీని వీడానని పొన్నాల ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు.

భద్రతకే తొలి ప్రాధాన్యత

- అధికారులకు ద.మ.రైల్వే జీఎమ్ అరుణ్‌కుమార్ జైన్ ఆదేశాలు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

రైలు కార్యకలాపాల భద్రతకే తొలిప్రాధాన్యత ఇవ్వాలని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ అధికారుల్ని ఆదేశించారు. బుధవారంనాడిక్కడి రైల్‌నిలయంలో అదనపు జనరల్ మేనేజర్ ఆర్ ధనుంజయులుతో కలిసి వివిధ విభాగాలకు చెందిన ప్రధానాధిపతులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. సికింద్రాబాద్, హైదరాబాద్, విజయవాడ, గుంతకల్, గుంటూరు, నాందేడ్ డివిజన్లకు చెందిన డివిజనల్ రైల్వే మేనేజర్లు (డీఆర్ఎంలు) వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఈ సమీక్షా సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జీఎమ్ మాట్లాడుతూ రైల్వే బోర్డు మార్గదర్శకాల ప్రకారం భద్రతా నియమాలను కచ్చితంగా పాటించాలని ఆదేశించారు. రైల్వే ట్రాక్‌లు, వంతెనల నిర్వహణకు ప్రాధాన్యత ఇవ్వాలనీ, లూప్ లైన్లు, పాయింట్లు, టర్న్‌అవుట్‌లపై దృష్టి పెట్టాలని సూచించారు. రైళ్లపై రాళ్లదాడులు, అసాంఘిక కార్యకలాపాల నియంత్రణా చర్యలు తీసుకోవాలని చెప్పారు. రైళ్ల రాకపోకలపై సమయపాలన పాటించాలన్నారు.

చీఫ్ పోస్ట్‌మాస్టర్ జనరల్‌గా పీవీఎస్ రెడ్డి



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

తెలంగాణ సర్కిల్ చీఫ్ పోస్ట్‌మాస్టర్ జనరల్‌గా డాక్టర్ పీవీఎస్ రెడ్డి నియమితులయ్యారు. ఇండియన్ పోస్టల్ సర్వీస్ 1993 బ్యాచ్‌కు చెందిన ఆయన ప్రస్తుతం ఇదే సర్కిల్‌లో పోస్‌మాస్టర్ జనరల్‌గా పనిచేస్తున్నారు. పదోన్నతిపై చీఫ్ పోస్ట్‌మాస్టర్ జనరల్ అయినట్టు ఆ కార్యాలయం అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్ఎస్ఎస్ రామకృష్ణ బుధవారంనాడొక పత్రికా ప్రకటనలో తెలిపారు. డాక్టర్ పీవీఎస్ రెడ్డి దేశంలోని పలు ప్రాంతాల్లో వివిధ హోదాల్లో పనిచేశారనీ, పోస్టల్ శాఖలో అనేక వినూత్న కార్యక్రమాలకు రూపకల్పన చేశారని వివరించారు.

ఏపీఎస్ఆర్టీసీ డోర్ డెలివరీ మాసోత్సవం

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఏపీఎస్ఆర్టీసీ) పార్సిల్, కొరియర్ సేవల్ని 84 నగరాలు, పట్టణాలకు విస్తరించినట్టు ఆ సంస్థ సరకు రవాణా విభాగం అసిస్టెంట్ మేనేజర్ షేక్ అజ్మతుల్లా తెలిపారు. ఈనెల 26 నుంచి నవంబర్ 25వ తేదీ వరకు వేగంగా, విస్తృత డోర్ డెలివరీ సేవల్ని అందించాలనే లక్ష్యంతో మాసోత్సవాలు నిర్వహిస్తున్నామని బుధవారంనాడొక పత్రికా ప్రకటనలో తెలిపారు. ఈ సేవలు హైదరాబాద్ నగరంతో పాటు తమ అధీకృత ఏజెంట్ల ద్వారా బుక్ చేసుకున్న వాటికి వర్తిస్తాయనీ, తక్కువ ధరలకే డోర్ డెలివరీ సేవలు అందిస్తున్నామన్నారు. డోర్ డెలివరీలో ఒక కిలో వరకు పార్సిల్, కొరియర్‌కు రూ.18, ఆరు కిలోల వరకు రూ.30, పది కిలోల వరకు రూ.36, 25 కిలోల వరకు రూ.48, 25 నుంచి 50 కిలోల వరకు రూ.59 చార్జీలు వసూలు చేస్తున్నట్టు తెలిపారు. ప్రజలు ఈ సౌకర్యాలను వినియోగించుకోవాలని కోరారు.

యూపీఏకు ఎక్స్‌ట్రా ప్లేయర్‌గా బీఆర్ఎస్

- కవితను ఎట్టిపరిస్థితుల్లోనూ వదలబోం : జాఫర్ ఇస్లాం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

యూపీఏకు ఎక్స్‌ట్రా ప్లేయర్‌గా బీఆర్ఎస్ ఉందని బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి జాఫర్ ఇస్లాం విమర్శించారు. బుధవారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఎమ్మెల్సీ కవిత అవినీతిపై విచారణ జరుగుతున్నదనీ, విచారణ ఎట్టిపరిస్థితుల్లోనూ ఆగదని చెప్పారు. అవినీతికి పాల్పడిన కవితను ఎట్టి పరిస్థితుల్లో వదిలిపెట్టే ప్రసక్తే లేదన్నారు. కుటుంబ పాలన, అవినీతి గురించే బీఆర్ఎస్, ఎంఐఎం, కాంగ్రెస్ ఆలోచిస్తాయని ఆరోపించారు. బీఆర్ఎస్ అంటే భ్రష్టాచార్ రిస్తేదార్ పార్టీ అని విమర్శించారు. కర్నాటకలో కాంగ్రెస్ నేతలు పెద్ద ఎత్తున డబ్బులు పోగేసి ఎన్నికలు జరుగుతున్న రాష్ట్రాలకు పంపుతున్నారని ఆరోపించారు.

బీఆర్ఎస్, ఎంఐఎం, బీజేపీ ఒకే తాను ముక్కలు

- కాంగ్రెస్‌తో అవగాహనపై కొనసాగుతున్న చర్చలు
- కొత్తగూడెం, చెన్నూరు స్థానాలు ఇస్తామని ప్రతిపాదన : సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

బీఆర్ఎస్, ఎంఐఎం, బీజేపీలు ఒకే తాను ముక్కలని సీపీఐ జాతీయ కార్యదర్శి కె నారాయణ విమర్శించారు. బీజేపీకి వ్యతిరేకంగా బ్రహ్మాండంగా పోరాడతున్నట్టు ఎంఐఎం వ్యవహరిస్తున్నదనీ, కానీ గెలిపించేందుకే శాయశక్తులా కృషి చేస్తున్నదని అన్నారు. బీఆర్ఎస్ కూడా బీజేపీతో లోపాయికారీగా రాజకీయ అవగాహన చేసుకున్నదని చెప్పారు. మద్యం కుంభకోణంలో ఢిల్లీ మాజీ ఉప ముఖ్యమంత్రి సిసోడియాను అరెస్టు చేసి, కవితను అరెస్టు చేయకపోవడమే ఇందుకు నిదర్శనమన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీతో రాజకీయ అవగాహనపై చర్చలు కొనసాగుతున్నాయని అన్నారు. కొత్తగూడెం, చెన్నూరు అసెంబ్లీ స్థానాలు ఇస్తామంటూ కాంగ్రెస్ పార్టీ తమ జాతీయ కమిటీకి చెప్పిందన్నారు. అయితే అధికారికంగా ఇంకా ప్రకటించలేదని చెప్పారు. మునుగోడు నియోజకవర్గానికి సంబంధించి బహిరంగ ప్రకటలు వచ్చాయనీ, ప్రతి పార్టీలోనూ రకరకాల అభిప్రాయాలుంటాయని అన్నారు. అంతిమంగా పార్టీ ఓ నిర్ణయం తీసుకున్నాక అందరూ దానికి కట్టుబడి ఉంటారని భావిస్తున్నట్టు వివరించారు. అంతర్గతంగా ఎన్ని అభిప్రాయాలున్నప్పటికీ కమ్యూనిస్టు పార్టీ విధానాలను, పార్టీని ధిక్కరించి ఎవరు కూడా బయటికి వెళ్తారని తాను అనుకోవడం లేదన్నారు. హైదరాబాద్‌లోని మఖ్దూంభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో ఎలాగైనా గెలిచేందుకు మోడీ వికృత చర్యలకు పాల్పడుతున్నారనీ, అడ్డదారులు తొక్కైనా సరే అధికారాన్ని దక్కించుకోవాలని చూస్తున్నారని చెప్పారు. బీజేపీకి ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరించే పార్టీలను కూడా ఓడించేందుకు తమ పార్టీ కుదిరిన చోట సర్దుబాట్లు, లేని చోట స్వంతంగా పోటీ చేస్తున్నట్టు వివరించారు. రాష్ట్రంలో ప్రస్తుతమున్న ఏడు స్థానాల్లోనూ ఎంఐఎం గెలిచే పరిస్థితి లేదని సీపీఐ జాతీయ కార్యదర్శి అజీజ్‌పాషా అన్నారు.

నేడు మేడిగడ్డకు సీపీఐ బృందం

కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా లక్ష్మి బ్యారేజ్ పిల్లర్ కుంగిపోయిన ప్రాంతాన్ని పరిశీలించేందుకు సీపీఐ బృందం గురువారం మేడిగడ్డకు వెళ్లనుంది. ఆ పార్టీ జాతీయ కార్యదర్శులు కె నారాయణ, సయ్యద్ అజీజ్ పాషా, కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్ రెడ్డి ఈ బృందంలో ఉన్నారు. అలాగే కరీంనగర్‌లో దెబ్బతిన్న మానేరుపై కేబుల్ బ్రిడ్జీని కూడా ఆ బృందం పరిశీలించనుంది. ప్రభుత్వ వైఫల్యం, నిర్మాణ పనుల్లో నాణ్యతా లోపాలు, అధికారుల నిర్లక్ష్యం వల్లే పిల్లర్ కుంగిపోయిందనీ, కేబుల్ బ్రిడ్జీ దెబ్బతిన్నదని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్ రెడ్డి విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టు లక్ష్మి బ్యారేజ్ కుంగిపోవడానికి విద్రోహ చర్యే కారణమని పోలీసులు చెప్పడాన్ని ఆయన తప్పుబట్టారు. నాగార్జున సాగర్, శ్రీశైలం, శ్రీరాంసాగర్ వంటి ప్రాజెక్టుల వద్ద నిరంతర పహారా ఉంటుందనీ, ఒకవేళ కాళేశ్వరం వద్ద అలాంటి పహారా లేకపోతే విద్రోహ చర్యకు పోలీసుల అసమర్థతే కారణమని చెప్పారు. లక్ష్మి బ్యారేజీ కుంగిపోవడానికి కారణం కూడా రాహుల్ గాంధీని చేస్తారేమోనని నారాయణ ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఈటి నరసింహ తదితరులు పాల్గొన్నారు.

పాలస్తీనాపై దాడుల్ని ఇజ్రాయిల్ ఆపాలి

- అక్టోబర్ 28న మానవహారాలు, సంఘీభావ సభలు : సీఐటీయూ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

పాలస్తీనాపై ఇజ్రాయిల్ చేస్తున్న దాడుల్ని వెంటనే ఆపాలనీ, పాలస్తీనాకు సంఘీభావం తెలపాలని కోరుతూ అక్టోబర్ 28న జిల్లా, మండల కేంద్రాల్లో సీఐటీయూ అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో మానవహారాలు, సంఘీభావ సభలు నిర్వహించాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు, ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ పిలుపునిచ్చారు. అమెరికా, బ్రిటన్, జర్మనీ, ఫ్రాన్స్ వంటి పశ్చిమ దేశాల అండతో అక్టోబర్ ఏడు నుంచి ఇజ్రాయిల్ పాలస్తీనాపై సాగిస్తున్న యుద్ధకాండను, అమానుష దాడులను తీవ్రంగా ఖండించారు. "పాలస్తీనాకు సంఘీభావంగా" సామ్రాజ్యవాద యుద్ధోన్మాదానికి వ్యతిరేకంగా మానవహారాలు, సంఘీభావ ప్రదర్శనలు, సభల్లో ఉద్యోగులు, కార్మికులు వేలాదిగా పాల్గొనాలని కోరారు. ఇజ్రాయిల్ అమానుష దాడుల్లో రెండు వేల మందికి పైగా చిన్నారులతో సహా సుమారు ఆరు వేల మంది చనిపోయారనీ, 18 వేల మంది తీవ్రంగా గాయపడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. దాదాపు 10 లక్షల మంది శరణార్థులుగా మారారని వాపోయారు. చిన్నారులు, క్షతగాత్రులకు వైద్యం అందించేందుకు గాజా ఆస్పత్రులకు జనరేటర్లకు కావలసిన ఇంధనాన్ని కూడా సరఫరా కాకుండా అడ్డుకోవడం దుర్మార్గమని పేర్కొన్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్ఓ) సైతం గాజాకు మానవతా సహాయం అత్యవసరంగా పొందాల్సి ఉందనీ, అంతర్జాతీయ సమాజానికి చేసిన విజ్ఞప్తి తీవ్రతను వెల్లడిస్తున్నదని తెలిపారు. గాజాలో కొనసాగుతున్న దాడులు మధ్య ప్రాచ్యానికి వ్యాపించి ప్రాంతీయ ఘర్షణలుగా పెచ్చరిల్లే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇజ్రాయిల్ యుద్ధోన్మాద వైఖరిని ప్రపంచ హ్యూమన్ రైట్స్ వాచ్ సంస్థ కూడా తీవ్రంగా విమర్శించిందని తెలిపారు. ఇప్పటికైనా ప్రపంచ వ్యాప్తంగా శాంతి కాముకులు కోరుతున్న విధంగా పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడులు ఆపకపోతే రాగల పరిణామాలు తీవ్రంగా ఉంటాయని చెబుతున్న విషయాన్ని పేర్కొన్నారు.

నర్సాపూర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా సునీత లక్ష్మారెడ్డి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

నర్సాపూర్ ఎమ్మెల్యే అభ్యర్థిగా సునీత లక్ష్మారెడ్డిని బీఆర్ఎస్ అధినేత సీఎం కేసీఆర్ ప్రకటించారు. ఈ మేరకు బుధవారం ప్రస్తుత నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్ రెడ్డితో కలిసి ఆమెకు బీఫామ్ అందచేశారు. మదన్ రెడ్డికి రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో మెదక్ ఎంపీ అభ్యర్థిగా అవకాశం ఇవ్వాలని పార్టీ నిర్ణయించింది. పార్టీలో అంతర్గత సర్దుబాటు చేస్తూ, అధినేత సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో భేటీ అయిన బీఆర్ఎస్ పార్టీ కోర్ కమిటీ సభ్యులు నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు ఏకగ్రీవంగా బీఆర్ఎస్ పార్టీ కీలక సభ్యులు తీసుకున్న నిర్ణయం పట్ల సిఎం కేసీఆర్ హర్షం వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా సిఎం కేసీఆర్ మాట్లాడుతూ "మదన్ రెడ్డి నాతో పార్టీలో మొదటి నుంచి కొనసాగుతున్న సీనియర్ నాయకుడు. 35 ఏండ్ల నుంచి నాతో సన్నిహితంగా కొనసాగుతున్న నేతగా నాకు అత్యంత ఆప్తుడు. నాకు కుడి భుజం లాంటి వాడు. సోదర సమానుడు. పార్టీ ఆలోచనలను గౌరవించి నర్సాపూర్ ఎన్నికలను తన భుజ స్కంధాల మీద వేసుకుని సునీత లక్ష్మారెడ్డిని ఎమ్మెల్యేగా గెలిపించే బాధ్యత తీసుకున్నందుకు సంతోషంగా వుంది. ప్రస్తుతం కొత్త ప్రభాకర్ రెడ్డి ఎంపీగా కొనసాగుతున్న పార్లమెంటరీ స్థానం నుండి మదన్‌రెడ్డికి అవకాశం ఇవ్వాలని పార్టీ నిర్ణయించింది. ఈ మేరకు పార్టీ కీలక సభ్యులకు, కార్యవర్గానికి అభినందనలు. వారి సీనియారిటీని పార్టీ గుర్తించి గౌరవించినందుకు పార్టీ ముఖ్య కార్యవర్గాన్ని అభినందిస్తున్నాను. మెదక్ జిల్లాలో అత్యంత ప్రజాదరణ కలిగిన నేతగా కేవలం నర్సాపూర్‌లోనే కాకుండా జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో ఆయన పాపులర్ లీడర్. వివాదరహితుడు, సౌమ్యుడు మదన్ రెడ్డి సేవలను పార్టీ మరింత గొప్పగా వినియోగించుకోవాల్సి ఉంది. నాతో పాటు కలిసి సునీతకు నర్సాపూర్ నియోజకవర్గ బీఫామ్ ఇవ్వడం నాకు సంతోషాన్ని కలిగించింది. చిన్న చిన్న సర్దుబాట్లు చేసుకుంటూ కీలక సమయంలో ఐక్యంగా ముందుకు పోవడం ద్వారా మదన్ రెడ్డి పార్టీ ప్రతిష్టను మరింత ఇనుమడింప చేశారు.వారికి నా ధన్యవాదాలు, అభినందనలు " అని బీఆర్ఎస్ అధినేత సిఎం కేసీఆర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రి హరీశ్ రావు తదితరులున్నారు.

వర్కర్స్ మ్యానిఫెస్టో అంశాలను పరిగణనలోకి తీసుకోండి

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేనికి కార్మిక, ఉద్యోగ సంఘాల వినతి


నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తెలంగాణలోని కార్మిక, ఉద్యోగ సంఘాలు సంయుక్తంగా రూపొందించిన వర్కర్స్ మ్యానిఫెస్టోలో అంశాలను పరిగణనలోకి తీసుకోవాలనీ, కార్మికులకు మేలు చేసే అంశాలను మ్యానిఫెస్టోలో పొందుపర్చాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావును కార్మిక, ఉద్యోగ సంఘాల నేతలు కోరారు. ఈ మేరకు బుధవారం హైదరాబాద్‌లో కూనంనేనికి వినతి పత్రాన్ని, వర్కర్స్ మ్యానిఫెస్టోలను అంద జేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాలరాజు, ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్‌డీ.చంద్రశేఖర్, హెచ్ఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రెబ్బా రామా రావు, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సూర్యం, టీఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షులు ఎంకే బోసు, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.శ్రీనివాస్ పాల్గొన్నారు. రాష్ట్రంలో పదేండ్లుగా కార్మికులు, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్క రించాలని సమ్మెలు, ఉద్యమాలు చేపట్టిన సంద ర్భంలో సీపీఐ అండగా నిలిచిందని చెప్పారు. రాష్ట్రంలోని కోటి మందికిపైగా కార్మికులు, ఉద్యోగుల న్యాయమైన సమస్యలను తెలంగాణ రాష్ట్ర ఉద్యోగ, కార్మిక సంఘాలు ఉమ్మడిగా చర్చించి వర్కర్స్ మ్యానిఫెస్టోను రూపొందించాయన్నారు. దీనిని పలు పార్టీల అధ్యక్షులకు అందజే స్తున్నామన్నారు. వర్కర్స్ మ్యానిఫెస్టోలోని అంశాలపై సీపీఐ సానుకూలంగా స్పందించాలని కోరారు. రాష్ట్రంలో కోటి మందికి ప్రయోజనం కల్గించే 73 షెడ్యూల్డ్ ఎంప్లాయిమెంట్ కనీస వేతనాలను సవరించాలనీ, కనీస వేతనం రూ.26 వేలు నిర్ణయించాలని జరుగుతున్న పోరాటా లకు ఎల్లవేళలా అండగా ఉండాలని కోరారు.

లేబర్ కోడ్‌ల రద్దు, కాంట్రాక్టు –ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమ స్యలు, పరిష్కా రాలు, పాత పెన్షన్ పునరు ద్ధరణ, మెడిసిన్‌పై జీఎస్టీ ఎత్తేసి ధరలు తగ్గించడం, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, స్కీమ్ వర్కర్లు, స్థానిక సంస్థల్లో పనిచేసే మున్సిపల్, గ్రామపంచాయతీ సిబ్బంది సమస్యల పరిష్కారం, ప్రభుత్వ రంగ సంస్థలు, కార్పొరేషన్లలో పనిచేసే కార్మికులు, ఉద్యోగులు, అసంఘటిత రంగ కార్మికుల సమస్యలను మ్యానిఫెస్టోలో పొందు పర్చామని తెలిపారు.

మణిపూర్‌లో అలయ్ బలయ్ పెట్టండి

- నరకడాలు..నగ్నంగా ఊరేగించడాలు సంస్కృతా?
- రాయలసీమలోనూ నరుక్కుని చస్తున్నారు..ఆడా పెట్టండి
- బండారు విజయలక్ష్మికి వీహెచ్ సూచన



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

'తలలు నరకేయడాలు..మహిళల్ని నగ్నంగా ఊరేగించడాలేంటి? ఇదేం సంస్కృతి? అక్కడి తెగల్లో చైతన్యం తీసుకొచ్చేందుకు మణిపూర్‌లో అలయ్‌బలయ్ కార్యక్రమం పెట్టండి' అని ఆ కార్యక్రమ నిర్వాహకులు హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ, ఆయన కూతురు విజయలక్ష్మికి కాంగ్రెస్ సీనియర్ నేత వి.హనుమంతరావు సూచించారు. అలయ్-బలయ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం హైదరాబాద్‌లోని ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనికి కేంద్ర మంత్రులు జి.కిషన్‌రెడ్డి, సత్యపాల్ సింగ్ బాగేల్, ఎల్. మురుగన్, మీనాక్షి లేఖి, మురళీధరన్, బీజేపీ జాతీయ నాయకులు ప్రకాశ్ జవదేకర్, మిజోరం గవర్నర్ డాక్టర్ కె.హరిబాబు, గుజరాత్ గవర్నర్ దేవవ్రాత్, జార్ఖండ్ గవర్నర్ రాధాకృష్ణనన్, మహారాష్ట్ర మాజీ గవర్నర్ సీహెచ్.విద్యాసాగర్‌రావు, రాష్ట్ర మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్, బీసీ కమిషన్ చైర్మెన్ వకుళాభరణం కృష్ణమోహన్, బీఆర్ఎస్ పార్లమెంటరీ పక్షనేత కె.కేశవరావు, కాంగ్రెస్ సీనియర్ నేతలు జానారెడ్డి, వీహెచ్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు కాసాని జ్ఞానేశ్వర్, తెలంగాణ జనసమితి అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరామ్, నిమ్స్ డైరెక్టర్ బీరప్ప, ఎమ్మెల్సీ యగ్గె మల్లేశం, ఎమ్మెల్యే ఈటల రాజేందర్, ఎంపీ లక్ష్మణ్, సినీరచయిత, ఎంపీ విజయేంద్ర ప్రసాద్, తుల ఉమ, తదితర నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వీహెచ్ మాట్లాడుతూ..ఏపీలో రాజకీయ హత్యలు పెరిగిపోతుండటంపై ఆందోళన వ్యక్తం చేశారు. ఎవరికోసమే మనం నరుక్కుని చంపుకోవడం సరిగాదన్నారు. రాయలసీమలో కూడా అలయ్‌బలయ్ పెట్టాలని కోరారు. తెలంగాణలో ఆ సంస్కృతి లేదన్నారు. ఎన్నికల వరకే రాజకీయాలు చేసుకుని ఆ తర్వాత అందరూ కలిసి మెలిసి ఉంటారని చెప్పారు. తెలంగాణలో 17 ఏండ్ల నుంచి దత్తాత్రేయ ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారనీ, ఆయన్ను అలయ్‌బలయ్ దత్తన్న అని పిలవాలన్నారు. దత్తాత్రేయ మాట్లాడుతూ..కులమతాలకతీతంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. దసరా సందర్భంగా అందర్నీ ఒకే వేదికపైకి తీసుకురావడం తనకు చాలా సంతోషానిచ్చిందన్నారు. అలయ్‌బలయ్‌కు వచ్చిన అతిథులందరూ మాట్లాడారు. వారిని అలయ్‌బలయ్ ఫౌండేషన్ సభ్యులు సత్కరించారు. వారికి అంబలి పోశారు. ఆయా కళలకు చెందిన కళాకారులు తమ ప్రదర్శనలు చేశారు. దత్తాత్రేయ కూడా కళాకారుల వాయిద్య పరికరాలను తీసుకుని వాయించారు. కళాప్రదర్శనలతో అక్కడ ఉత్తేజపూరిత వాతావరణం నెలకొంది.

సమస్యలను పరిష్కరిస్తా

- లండన్ మేయర్ స్వతంత్ర అభ్యర్థి తరుణ్ గులాటి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

లండన్ నగరం ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడమే తన ముందున్న కర్తవ్యమనీ, వాటి పరిష్కారం కోసం మేయర్ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్నట్టు భారతీయ సంతతికి చెందిన తరుణ్ గులాటి తెలిపారు. బుధవారం హైదరాబాద్‌లోని సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో కన్జర్వేటివ్ పార్టీ మాజీ సభ్యులు గులాటీ మాట్లాడుతూ పార్టీల్లో ఉంటే విధానపరంగా నిర్ణయాలు తీసుకోవడంలో ఆంక్షలుంటాయనీ, అందుకే తాను స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేయాలని నిర్ణయించుకున్నట్టు తెలిపారు. లండన్ నగరం నిరుద్యోగం, తక్కువ ఆదాయం వంటి సమస్యలను ఎదుర్కొంటున్నదని తెలిపారు. వీటితో పాటు విద్యాభ్యాసం కోసం వచ్చే భారతీయ విద్యార్థుల భద్రత కూడా తన ప్రాధాన్యత అని తెలిపారు. లండన్ నగరంలో అన్ని దేశాల ప్రజలున్నారనీ, ఓటర్లలో నాలుగు నుంచి ఐదు శాతం మంది భారతదేశం నుంచి వచ్చిన ఓటర్లున్నారని చెప్పారు. బరిలో నిలుస్తున్న అభ్యర్థులు నచ్చక పోలింగ్ శాతం పడిపోతున్నదనీ, తాను నిలబడటం ద్వారా అది కూడా పెరుగుతుందని తెలిపారు. బీజేపీ మహిళా విధానాలు, పరిశోధనా విభాగం ఇంఛార్జ్ కరుణాగోపాల్ మాట్లాడుతూ సనాతన ధర్మాన్ని నమ్మే భారతీయ సంతతికి చెందిన వాడిగా గులాటీకి ప్రతి ఒక్కరు మద్దతివ్వాలని కోరారు.

నేటినుంచి బడులు, కాలేజీలు పునఃప్రారంభం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రయివేటు, ఎయిడెడ్ పాఠశాలలు, కాలేజీలు గురువారం నుంచి పునఃప్రారంభం కానున్నాయి. ఈనెల 13 నుంచి 25 వరకు 13 రోజులుపాటు బడులకు సెలవులు ప్రకటించిన విషయం తెలిసిందే. జూనియర్ కళాశాలలకు ఈనెల 19 నుంచి 25 వరకు ఏడు రోజులు ప్రభుత్వం సెలవులిచ్చింది. దసరా సెలవుల అనంతరం గురువారం నుంచి పాఠశాలలు, కాలేజీల్లో తరగతులు ప్రారంభమవుతాయి.

అల్పాహారం అమలుపై అస్పష్టత

ముఖ్యమంత్రి అల్పాహార పథకాన్ని ఈనెల ఆరో తేదీన మంత్రులు టి హరీశ్‌రావు, పి సబితా ఇంద్రారెడ్డి రంగారెడ్డి జిల్లా రావిర్యాల జెడ్పీహెచ్ఎస్‌లో ప్రారంభించారు. దసరా తర్వాత అన్ని పాఠశాలలకూ ఈ పథకాన్ని విస్తరిస్తామని ప్రకటించారు. గురువారం నుంచి బడులు పునఃప్రారంభమవుతున్నాయి. అయితే అన్ని పాఠశాలల్లో ఈ పథకం అమలుపై అస్పష్టత నెలకొంది. గురువారం నుంచి అన్ని బడుల్లో ముఖ్యమంత్రి అల్పాహార పథకం అమలుపై ఎలాంటి ఉత్తర్వులు విడుదల కాకపోవడమే ఇందుకు నిదర్శనం. దీంతో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారు. సెలవులు కావడంతో పాఠశాలల్లో అల్పాహారం వండే వంట కార్మికులను కూడా నియమించలేదు. విద్యాశాఖ అధికారులు బుధవారం రాత్రి నాటికి స్పష్టమైన ఆదేశాలు జారీ చేయకపోవడం గమనార్హం.

సలీమాకు పీహెచ్‌డీ ప్రదానం



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఆచార్య నాగార్జున యూనివర్సిటీ పొలిటికల్ సైన్స్ విభాగంలో భారత స్వాతంత్రోద్యమంలో మహిళల పాత్ర అనే అంశంపై పరిశోధన చేసి గ్రంథం సమర్పించినందుకుగాను షేక్ సలీమాకు పీహెచ్‌డీ ప్రధానం చేసినట్లు రీసెర్చ్ సెల్ కోఆర్డినేటర్ డాక్టర్ పి.కిరణ్మయి తెలిపారు. రీసెర్చ్ డైరెక్టర్‌గా ఎం.రవిశేఖర్ వ్యవహరించారు. సలీమా పీజీ చేసే సమయంలో విద్యార్థి ఉద్యమంలో పని చేస్తూ అధ్యయనం. పోరాటం నినాదాన్ని పుణికి పుచ్చుకుని పోరాటాలతో పాటు అధ్యయనంలోనూ ముందు పీఠీన ఉండేవారు. వర్సిటీలో పీజీ స్థాయిలో నాలుగు గోల్డ్ మెడల్స్ ను సాధించి అందరికీ ఆదర్శంగా నిలిచారు. సలీమాకు డాక్టరేట్ రావడం పట్ల పలువురు శుభాకాంక్షలు తెలియజేశారు. ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ చల్లపల్లి స్వరూప రాణి చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు.

కాంగ్రెస్‌కు గుణపాఠం చెబుదాం

- దాసోజు శ్రవణ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పేదలు, రైతులను పట్టించుకోని కాంగ్రెస్ పార్టీకి గుణపాఠం చెప్పాలని బీఆర్ఎస్ సీనియర్ నాయకులు దాసోజు శ్రవణ్ ప్రజలను కోరారు. ఈ మేరకు బుధవారం ఆయన ట్వీట్ చేశారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్ ఛార్జీ మాణిక్ రావు ఠాక్రే రాసిన లేఖతో కాంగ్రెస్ పార్టీ పెట్టుబడీదారీ మనస్తత్వం బయటపడిందని తెలిపారు. తక్షణం ఆ లేఖను ఉపసహరించుకోవాలని ఆయన కోరారు. సీఎం కేసీఆర్‌కు రైతులు బడుగు, బలహీనుల శ్రేయస్సే అత్యంత ప్రాధాన్యత అని స్పష్టం చేశారు.

నవతెలంగాణ మారో తీన్‌మార్



ప్రపంచకప్‌లో నేడు
ఇంగ్లండ్ x శ్రీలంక
వేదిక : బెంగళూరు
సమయం : మ॥ 2.00
స్టార్‌స్పోర్ట్స్‌లో ప్రసారం..

ఐసిసి వన్డే ప్రపంచకప్‌లో మ్యాక్స్‌వెల్ విధ్వంసం సృష్టించాడు. కేవలం 27బంతుల్లోనే అర్ధసెంచరీని పూర్తి చేసిన మ్యాక్స్‌వెల్.. ఆ తర్వాత 13బంతుల్లో మరో 50పరుగులు కొట్టి కేవలం 40బంతుల్లోనే సెంచరీని పూర్తిచేసిన తొలి బ్యాటర్‌గా రికార్డు నెలకొల్పాడు. ఈ క్రమంలో దక్షిణాఫ్రికా బ్యాటర్ మార్క్‌క్రమ్ (47బంతుల్లో సెంచరీ) పేరిట ఉన్న రికార్డును తుడిచేశాడు.

మ్యాక్స్‌వెల్ విధ్వంసం

40బంతుల్లోనే సెంచరీతో రికార్డు


నెదర్లాండ్స్‌పై 309పరుగుల తేడాతో ఆస్ట్రేలియా గెలుపు



న్యూఢిల్లీ: ఇక టాస్ గెలిచి తొలిగా బ్యాటింగ్‌కు దిగిన ఆస్ట్రేలియా జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 399 పరుగులు భారీస్కోర్ నమోదు చేసింది. ఆస్ట్రేలియాకు వన్డే ప్రపంచకప్‌లో ఇది రెండో అత్యుత్తమ స్కోర్. డేవిడ్ వార్నర్ (104; 93బంతుల్లో 11ఫోర్లు, 3సిక్సర్లు) వరుసగా రెండో శతకం బాదాడు. స్టీవ్ స్మిత్ (71; 68బంతుల్లో 9ఫోర్లు, సిక్సర్), మార్నస్ లబుషేన్ (62; 47బంతుల్లో 7ఫోర్లు, 2సిక్సర్లు) అర్ధ శతకాలతో మెరిసారు. చివర్లో మ్యాక్స్‌వెల్ ఆకాశమే హద్దుగా చెలరేగి కేవలం 44బంతుల్లో 9ఫోర్లు, 8సిక్సర్లతో ఏకంగా 106పరుగులు చేశాడు.

అంతకుముందు ఓపెనర్ మిచెల్ మార్ష్(9)ను వాన్ బీక్ త్వరగా వెనక్కి పంపినా.. మరో ఎండ్‌లో ఉన్న వార్నర్ ఆరంభం నుంచీ నిలకడగా ఆడాడు. ఆర్యన్‌దత్ వేసిన మూడో ఓవర్‌లో డేవిడ్ వార్నర్ వరుసగా నాలుగు ఫోర్లు బాది భారీస్కోర్‌కు పునాది వేశాడు. మార్ష్.. అకెర్మాన్‌కు క్యాచ్ ఇచ్చి పెవీలియన్‌కు చేరగా.. తర్వాత క్రీజులోకి వచ్చిన స్మిత్.. తొలుత నెమ్మదిగా ఆడినా.. ఆ తర్వాత దూకుడు పెంచాడు. పాల్ వాన్ మీకెరెన్ బౌలింగ్‌లో రెండు బౌండరీలు రాబట్టిన అతడు.. వాన్ బీక్ వేసిన 10ఓవర్లో హ్యాట్రిక్ ఫోర్లు బాదాడు. తర్వాత వార్నర్ కూడా దూకుడు పెంచాడు. అకెర్మాన్ బౌలింగ్‌లో సిక్స్ బాదగా.. విక్రమ్‌జిత్ వేసిన 18 ఓవర్‌లో వరుసగా సిక్స్, ఫోర్ కొట్టి అర్ధ శతకం (40బంతుల్లో) అందుకున్నాడు. ఆర్యన్‌దత్ వేసిన 24 ఓవర్‌లో స్మిత్.. వాన్ డెర్ మెర్వే చేతికి చిక్కి ఔటయ్యాడు. ఆ తర్వాత లబుషేన్ ఆరంభంలో నెమ్మదిగా ఆడి.. మెర్వే వేసిన 34ఓవర్‌లో ఓ సిక్స్, రెండు ఫోర్లు బాదాడు. బాస్ డి లీడే వేసిన తర్వాతి ఓవర్‌లో అర్ధ శతకం అందుకున్నాడు. ఆర్యన్‌దత్ వేసిన 36 ఓవర్‌లో వరుసగా ఓ సిక్స్, ఫోర్ బాది కొద్దిసేపటికే వెనుదిరిగాడు. మరోవైపు.. 60 బంతుల్లో 78 పరుగులు చేసిన వార్నర్.. లబుషేన్ వచ్చిన తర్వాత నెమ్మదిగా ఆడి బాస్ డి లీడే బౌలింగ్‌లో ఫోర్ బాది సెంచరీ పూర్తి చేసుకున్నాడు. ఇదే ఓవర్లో ఇంగ్లిస్(14) సిబ్రాండ్‌కు చేతిలో ఔటయ్యాడు. నెదర్లాండ్స్ బౌలర్లలో వాన్ బీక్‌కు నాలుగు, డి లీడేకు రెండు, ఆర్యన్‌దత్ ఒక వికెట్ దక్కాయి.

400 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన నెదర్లాండ్స్ జట్టు 15 ఓవర్ల లోపే ఐదు కీలక వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. హెజిల్‌వుడ్ వేసిన రెండో ఓవర్లో మ్యాక్స్ ఓడౌడ్(6) ఓ ఫోర్ కొట్టగా విక్రమ్‌జిత్ సింగ్ కూడా రెండు బౌండరీలు బాదాడు. స్టార్క్ వేసిన 3వ ఓవర్లో విక్రమ్‌జిత్.. మరో రెండు ఫోర్లు కొట్టాడు. కానీ మిచెల్ స్టార్క్ డచ్ జట్టుకు తొలి షాకిచ్చాడు. అతడు వేసిన ఐదో ఓవర్లో ఐదో బంతికి ఓడౌడ్ క్లీన్ బౌల్డ్ అయ్యాడు. మరుసటి ఓవర్లో విక్రమ్‌జిత్ సింగ్ (25 బంతుల్లో 25, 6 ఫోర్లు) రనౌట్ అయ్యాడు. మ్యాక్స్‌వెల్ సూపర్ త్రో తో విక్రమ్ ఔటయ్యాడు. 11 బంతుల్లో 10 పరుగులు చేసిన కొలిన్ అకెర్మన్‌ను హెజిల్‌వుడ్ పదో ఓవర్లో రెండో బంతికి ఎల్బీగా ఔట్ చేశాడు. దీంతో నెదర్లాండ్స్ 14 ఓవర్లు ముగిసేసరికి 5 వికెట్ల నష్టానికి 68 పరుగులు చేసింది. లోయర్ ఆర్డర్ బ్యాటర్స్ ఒక్కరూ క్రీజ్‌లో నిలదొక్కుకొనే అవకాశం ఆసీస్ బౌలర్లు ఇవ్వలేదు. దీంతో నెదర్లాండ్స్ జట్టు 21 ఓవర్లలో 90పరుగులకే కుప్పకూలింది. జంపాకు నాలుగు, మార్ష్‌కు రెండు, స్టార్క్, హేజిల్‌వుడ్, కమిన్స్‌కు ఒక్కో వికెట్ దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ మ్యాక్స్‌వెల్‌కు దక్కింది.



స్కోర్‌బోర్డు..

ఆస్ట్రేలియా ఇన్నింగ్స్: మార్ష్ (సి)అకెర్మన్ (బి)వాన్ బీక్ 9, వార్నర్ (సి)ఆర్యన్ దత్ (బి)బీక్ 104, స్మిత్ (సి)మెర్వ్ (బి)ఆర్యన్ దత్ 71, లబుషేన్ (సి)ఆర్యన్ దత్ (బి)లీడే 62, ఇంగ్లిస్ (సి)సైబ్యాండ్ (బి)లీడే 14, మ్యాక్స్‌వెల్ (సి)సైబ్రాండ్ (బి)బీక్ 106, గ్రీన్ (రనౌట్) సైబ్రాండ్ 8, కమిన్స్ (నాటౌట్) 12, స్టార్క్ (సి)అకెర్మన్ (బి)బీక్ 0, జంపా (నాటౌట్) 1, అదనం 12. (50 ఓవర్లలో 8వికెట్ల నష్టానికి) 399పరుగులు.

వికెట్ల పతనం: 1/28, 2/160, 3/244, 4/266, 5/267, 6/290, 7/393, 8/393

బౌలింగ్: ఆర్యన్ దత్ 7-0-59-1, అకెర్మన్ 4-0-14-0, బీక్ 10-0-74-4, మీకెరన్ 10-0-64-0, విక్రమ్‌జీత్ సింగ్ 4-0-27-0, మెర్వ్ 5-0-41-0, బీక్ 10-0-115-2.

నెదర్లాండ్స్ ఇన్నింగ్స్: విక్రమ్‌జిత్ సింగ్ (రనౌట్) మ్యాక్స్‌వెల్ 25, మ్యాక్స్‌ఒవాడ్ (బి)స్టార్క్ 6, అకెర్మన్ (ఎల్‌బి)హేజిల్‌వుడ్ 10, సైబ్రాండ్ (సి)వార్నర్ (బి)మార్ష్ 11, లీడే (ఎల్‌బి)కమిన్స్ 4, ఎడ్వర్డ్స్ (నాటౌట్) 12, తేజ నిడమానూరు (సి)ఇంగ్లిస్ (బి)మార్ష్ 14, వాన్ బీక్ (సి)ఇంగ్లిస్ (బి)జంపా 0, మెర్వ్ (ఎల్‌బి)జంపా 0, ఆర్యన్ దత్ (ఎల్‌బి)జంపా 1, మీకెర్మన్ (స్టంప్)ఇంగ్లిస్ (బి)జంపా 0, అదనం 7. (21 ఓవర్లలో) 90పరుగులకు ఆలౌట్.

వికెట్ల పతనం: 1/28, 2/37, 3/47, 4/53, 5/42, 6/84, 7/86, 8/86, 9/90, 10/90



బౌలింగ్: స్టార్క్ 4-0-22-1, హేజిల్‌వుడ్ 6-0-27-1, కమిన్స్ 4-0-14-1, మార్ష్ 4-0-19-2, జంపా 2-0-8-4.

వన్డేల్లో చెత్త బౌలింగ్ (టాప్-5)...

2/115(10)	: బెస్ డి లీడే(నెదర్లాండ్స్)..	: ఆస్ట్రేలియాపై(2023)
0/113(10)	: మెక్ లూవీస్(ఆస్ట్రేలియా)	: దక్షిణాఫ్రికాపై(2006)
0/113(10)	: ఆడం జంపా(ఆస్ట్రేలియా)	: దక్షిణాఫ్రికాపై(2023)
0/110(10)	: వాహబ్ రియాజ్(పాకిస్తాన్)	: ఇంగ్లండ్‌పై(2016)
0/110(9)	: రషీద్‌ఖాన్(ఆఫ్ఘనిస్తాన్)	: ఇంగ్లండ్‌పై(2019)

వన్డే ప్రపంచకప్‌లో ఆస్ట్రేలియా అత్యధిక స్కోర్లు..

417/6	: ఆఫ్ఘనిస్తాన్‌పై(పెర్త్-2015)
399/8	: నెదర్లాండ్స్‌పై(ఢిల్లీ-2023)
381/5	: బంగ్లాదేశ్‌పై(నాటింగ్‌హామ్-2019)
377/8	: దక్షిణాఫ్రికాపై(బెస్సెటెర్రీ-2007)
376/9	: శ్రీలంకపై(సిడ్నీ-2015)

వన్డేల్లో అత్యధిక పరుగుల తేడాతో గెలుపు..

317	: భారత్ (శ్రీలంకపై, త్రివేండ్రం 2023)
309	: ఆస్ట్రేలియా (నెదర్లాండ్స్‌పై, ఢిల్లీ 2023)
304	: జింబాబ్వే (యుఏఇపై, హరారే 2023)
290	: న్యూజిలాండ్ (ఐర్లాండ్‌పై, అబెర్డీన్ 2008)
275	: ఆస్ట్రేలియా (ఆఫ్ఘనిస్తాన్‌పై, పెర్త్ 2015)

లక్ష్యసేన్, శ్రీకాంత్‌కు నిరాశ


- తొలిరౌండ్‌లోనే పరాజయం
- ఫ్రెంచ్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీ



పారిస్: ఫ్రెంచ్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీ సూపర్-750లో పురుషుల సింగిల్స్‌లో భారత షట్లర్ల పోరాటం ముగిసింది. బుధవారం జరిగిన తొలిరౌండ్ పోటీలో కిదాంబి శ్రీకాంత్, లక్ష్యసేన్ ప్రత్యర్థుల చేతిలో వరుససెట్లలో ఓటమిపాలయ్యారు. కిదాంబి శ్రీకాంత్ 17-21, 18-21తో జూనియర్ పొపొవ్(ఫ్రాన్స్) చేతిలో, లక్ష్యసేన్ 15-21, 18-21తో ఆర్నౌడ్ మెర్కెలే(ఫ్రాన్స్) చేతిలో ఓడారు. ఈ టోర్నీకి భారత స్టార్ షట్లర్ హెచ్ఎస్ ప్రణయ్ రాయ్ గాయం కారణంగా దూరంగా ఉన్న సంగతి తెలిసిందే.

2వ ర్యాంక్ ఎగబాకిన శుభ్‌మన్

ఐసిసి వన్డే ర్యాంకింగ్స్ విడుదల



దుబాయ్: అంతర్జాతీయ క్రికెట్ మండలి(ఐసిసి) ప్రకటించిన తాజా వన్డే ర్యాంకింగ్స్‌లో శుభ్‌మన్ గిల్ సత్తా చాటాడు. ఐసిసి బుధవారం విడుదల చేసిన వన్డే బ్యాటర్స్ జాబితాలో శుభ్‌మన్ గిల్ 823 రేటింగ్ పాయింట్లతో టాప్ ర్యాంక్‌లో ఉన్న బాబర్ అజామ్(పాకిస్తాన్) కంటే 6పాయింట్లు వెనుకంజలో ఉన్నాడు. 24ఏళ్ల శుభ్‌మన్ వన్డేల్లో వేగంగా 2వేల పరుగులను పూర్తి చేసుకొని ర్యాంకింగ్స్‌లోనూ ఎగబాకుతున్నాడు. ఇక వన్డే ప్రపంచకప్‌లో భాగంగా న్యూజిలాండ్‌తో ఆదివారం జరిగిన మ్యాచ్‌లో శుభ్‌మన్ 2వేల పరుగుల మార్క్‌ను అందుకున్నాడు. శుభ్‌మన్ తొలి రెండు వన్డేలకు దూరమైనా.. మిగిలిన మూడు మ్యాచుల్లో 95పరుగులు మాత్రమే చేశాడు. ఇందులో పూణే వేదికగా బంగ్లాదేశ్‌తో జరిగిన వన్డేలో గిల్ 53పరుగుల అత్యధిక స్కోర్‌ను నమోదు చేశాడు. ఇక బాబర్ అజమ్ 829రేటింగ్ పాయింట్లతో అగ్రస్థానంలో ఉన్నా.. వన్డే ప్రపంచకప్‌లో 5 ఇన్నింగ్స్‌లో కేవలం 157పరుగులే చేశాడు. అలాగే చెన్నై వేదికగా ఆఫ్ఘనిస్తాన్‌తో జరిగిన వన్డే ప్రపంచకప్ మ్యాచ్‌లో బాబర్ అజమ్ అత్యధికంగా 74పరుగులతో రాణించినా.. పాకిస్తాన్ జట్టు 8వికెట్ల తేడాతో ఓటమి సెమీస్ ఆశలను సంక్లిష్టం చేసుకున్న సంగతి తెలిసిందే. ఇక దక్షిణాఫ్రికా ఓపెనర్, వికెట్ కీపర్ క్వింటర్ డికాక్ 3వ ర్యాంక్, హెన్రిక్ క్లాసెన్ 4వ ర్యాంక్‌లకు ఎగబాకారు. వన్డే ప్రపంచకప్‌లో డికాక్ 5ఇన్నింగ్స్‌లో ఏకంగా మూడు సెంచరీలతో కదం తొక్కాడు. వీరిద్దరికీ కెరీర్‌లో బెస్ట్ ర్యాంక్‌లో ఇదే.



అమితాబ్ బచ్చన్, రజనీకాంత్

మరోసారి ఆప్త మిత్రుడితో..

దాదాపు మూడు దశాబ్దాల తర్వాత తన ఆప్తమిత్రుడు బిగ్ బి అమితాబ్ బచ్చన్‌తో పని చేయడంపై సూపర్‌స్టార్ రజనీకాంత్ అమితానందంలో ఉన్నారు. ఈ విషయాన్ని సోషల్ మీడియా వేదికగా షేర్ చేస్తూ రజనీ తన ట్వీట్‌లో ఇలా స్పందించారు.

'33 ఏళ్ళ తర్వాత నా మార్గదర్శి. అద్భుతమైన వ్యక్తి అమితాబ్ బచ్చన్‌తో కలసి వర్క్ చేస్తున్నా. లైకా ప్రొడక్షన్స్ పతాకంపై టి.జె.జ్ఞానవేల్ దర్శకత్వంలో నేను నటిస్తున్న చిత్రంలో ఆయనతో స్క్రీన్ షేర్ చేసుకోవడం ఆనందంగా ఉంది. అమితానందంతో నా మనసు నిండింది' అని రజనీ పేర్కొన్నారు. అంతేకాదు అమితాబ్‌తో దిగిన ఓ ఫొటోని అభిమానులతో షేర్ చేసుకున్నారు. 'జైలర్' తర్వాత రజనీకాంత్ నటిస్తున్న చిత్రమిది. దర్శకుడు టి.జె.జ్ఞానవేల్ పవర్‌ఫుల్ కథాంశంతో ఈ సినిమాని తెరకెక్కిస్తున్నారని సమాచారం. అమితాబ్‌తోపాటు రానా, ఫహద్ ఫాజిల్ కీలక పాత్రల్లో కనిపించనున్నారు. 1991లో విడుదలైన 'హమ్' తర్వాత అమితాబ్, రజనీ కలిసి నటిస్తున్న సినిమా ఇదే కావడం విశేషం.

థ్రిల్ చేసే ఊహించని మలుపులు



సుడిగాలి సుధీర్, డాలీషా

సుడిగాలి సుధీర్ కథానాయకుడిగా నటించిన తాజా చిత్రం 'కాలింగ్ సహస్ర'. షాడో మీడియా ప్రొడక్షన్స్, రాధా ఆర్ట్స్ పతాకాలపై అరుణ్ విక్కిరాలా దర్శకత్వంలో విజేష్ తయాల్, చిరంజీవి పమిడి, వెంకటేశ్వర్లు కాటూరి ఈ సినిమాను నిర్మిస్తున్నారు. సుధీర్ సరసన డాలీషా హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ సినిమా పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలను పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా నిర్మాత వెంకటేశ్వర్లు కాటూరి మాట్లాడుతూ, 'నిర్మాతలుగా ఈ సినిమా మా తొలి అడుగు. మాకు ఇదొక స్వీట్ మెమొరీ. డైరెక్టర్ అరుణ్, హీరో సుధీర్, హీరోయిన్ డాలీషా సపోర్ట్‌తో సినిమాను పూర్తి చేశాం. ఔట్ పుట్ సూపర్‌గా వచ్చింది. సరికొత్త సుధీర్‌ను చూస్తారని నమ్మకంగా చెబుతున్నాను. ఇందులో సుధీర్ పాత్రను వెండి తెరపై చూసిన ఆడియెన్స్ వావ్మో సుధీర్ ఇలాంటి పాత్రలో కూడా నటిస్తారా అనేంత వైల్డ్‌గా థ్రిల్లింగ్ ఎలిమెంట్స్‌తో, మాసీగా ఉంటుంది. ప్రేక్షకులు ఊహించని మలుపులతో సీట్ ఎడ్జ్ థ్రిల్లర్‌గా ఆకట్టుకోనుంది. నవంబర్‌లో సినిమాని విడుదల చేస్తున్నాం' అని అన్నారు.

నవచిత్రం

యూనిక్ పవర్‌ఫుల్ స్టోరీ



మలినేని గోపీచంద్, రవితేజ, వై.రవిశంకర్, నవీన్ యెర్నేని

'డాన్ శీను, బలుపు, క్రాక్' చిత్రాలతో మూడు బ్లాక్‌బస్టర్‌లను అందించిన రవితేజ, గోపీచంద్ మలినేని ద్వయం మరోసారి జతకట్టారు. ఈ కాంబో- ఆర్‌టి4జీఎమ్ కోసం 4వ సారి కలిసి పని చేయనున్నారు. మైత్రీ మూవీస్ మేకర్స్ భారీ బడ్జెట్‌తో ఈ ప్రాజెక్ట్‌ను నిర్మించనుంది. వాస్తవ సంఘటనల ఆధారంగా యూనిక్, పవర్ ఫుల్ కథతో ఈ సినిమా రూపొందనుంది. కొన్ని నెలల క్రితం పవర్‌ఫుల్ పోస్టర్ ద్వారా సినిమాని అనౌన్స్ చేయగా, ఆ పోస్టర్‌కి టెర్రిఫిక్ రెస్పాన్స్ వచ్చింది. తాజాగా మేకర్స్ 'బ్లాస్టింగ్ అప్‌డేట్‌ల కోసం సిద్ధంగా ఉండండి' అని అనౌన్స్ చేశారు. ఈరోజు, రేపు ఎగ్జైటింగ్ అప్‌డేట్‌లు వస్తాయి. అలాగే ఈ చిత్రంలో సెల్వరాఘవన్ కీలక పాత్ర పోషిస్తున్నట్లు మేకర్స్ తెలిపారు. అనౌన్స్ మెంట్ పోస్టర్‌లో ఇంటెన్స్ లుక్‌లో కనిపించారు సెల్వరాఘవన్. నవీన్ యెర్నేని, వై రవిశంకర్ ఈ చిత్రాన్ని భారీ స్థాయిలో నిర్మించనున్నారు. తమన్ సంగీతం అందిస్తున్నారు. డీవోపీగా జీకే విష్ణు ఈ చిత్రంతో మరోసారి రవితేజ, గోపీచంద్ మలినేనితో కలిసి పని చేయనున్నారు. అలాగే ఈ చిత్రంలో సర్‌ప్రైజ్ చేసే స్టార్ కాస్ట్‌తోపాటు అత్యద్భుత సాంకేతిక నిపుణులు పని చేయనున్నారు. వీరి వివరాలు త్వరలోనే మేకర్స్ ప్రకటించనున్నారు.

అన్నదమ్ముల అనుబంధం



సంపూర్ణేష్‌బాబు, సంజోష్

సంపూర్ణేష్ బాబు, సంజోష్ ముఖ్యపాత్రల్లో రూపొందుతున్న చిత్రం 'సోదరా..'. అన్నదమ్ముల బంధం ఎంత గొప్పదో మనందరికీ తెలుసు అలాంటి అన్నదమ్ముల బంధాన్ని వెండితెరపై మనకు ఆవిష్కరించబోతున్న చిత్రమే ఇది. ఈ చిత్ర ఫస్ట్ లుక్ ఈనెల 29న రిలీజ్ కానుంది. ఈ నేపథ్యంలో నిర్మాత చంద్ర చగంలా మాట్లాడుతూ,'ఈ సోదరా సినిమా సోదరులందరికీ బంధాన్ని చూపించే విధంగా నిర్మించాం. గతంలో 'అన్నయ్య, సీతారామరాజు, తమ్ముడు' వంటి ఎన్నో సినిమాలు అన్నదమ్ముల బంధాన్ని ఆ బంధంలోని విశిష్టతను తెలియజేసేలా వచ్చాయి. ఆ కోవలోకే మా సినిమా కూడా వస్తుంది' అని చెప్పారు. ప్రాచీబంసాల్, ఆరతి గుప్తా, బాబా భాస్కర్, బాబు మోహన్, గెటప్ శీను తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కథ, దర్శకత్వం: మన్ మోహన్ మేనంపల్లి, సంగీతం: సునీల్ కశ్యప్, డిఓపి: జాన్, ఎడిటర్: లిరిక్స్: సుద్దాల అశోక్ తేజ, పూర్ణ చారి.

లీలమ్మో.. పక్కా మాస్ సాంగ్

మాస్ ప్రేక్షకులకు, అభిమానులకు సరికొత్త ట్రీట్ ఇవ్వడానికి ప్రముఖ నటీనటుల పేర్లను పాటల సాహిత్యంలో ఉపయోగించడం చూస్తుంటాం. ఇప్పుడు 'ఆదికేశవ' చిత్ర బృందం కూడా అదే ట్రెండ్‌ని ఫాలో అవుతూ మాస్ మెచ్చే 'లీలమ్మో' అంటూ సాగే మూడో పాటను విడుదల చేసింది. గీత రచయిత కాసర్ల శ్యామ్ తన మాస్ పదాలతో పాటను తప్పక వినేలా చేశారు. నకాష్ అజీజ్, ఇంద్రావతి చౌహాన్ అద్భుతమైన గాత్రంతో మాస్ లిరిక్స్‌కు ఎనర్జీని ఇచ్చారు. మాస్, ఎనర్జీ కలిసి ఈ పాటను మాస్ బ్లాస్ట్‌గా మలిచాయి. ఈ పాట విడుదల వేడుక పార్క్ హయత్‌లో బుధవారం సాయంత్రం అభిమానులు, మీడియా సమక్షంలో ఘనంగా జరిగింది.

ఈ సందర్భంగా కథానాయకుడు పంజా వైష్ణవ్ తేజ్ మాట్లాడుతూ, 'ప్రతిరోజూ సెట్ కళకళలాడుతూ ఉండేది. శ్రీలీల, సుదర్శన్ సెట్‌కి వస్తే ఇంకా ఎక్కువ కళకళలాడేది. షూటింగ్ అంతా ఎంతో సరదాగా జరిగింది' అని అన్నారు. 'ఇప్పుడే అమ్మవారి దసరా అయింది. నవంబర్ 10న శివుడి పేరుతో మా 'ఆదికేశవ' వస్తుంది. 'లీలమ్మో' నాకు ఎంతో ఇష్టమైన పాట. పైగా నా పేరుతో ఉన్న మొదటి పాట. అందుకే ఇది నాకు మరింత ప్రత్యేకమైన పాట. ఈ సాంగ్‌ని మీ అందరూ ఎంజాయ్ చేస్తారు. వైష్ణవ్ అద్భుతంగా డ్యాన్స్ చేశారు. శేఖర్ మాస్టర్ కొరియోగ్రఫీ చాలా బాగుంది. ఇది పర్ఫెక్ట్ మాస్ సాంగ్. పాట వినగానే నాకు స్నేక్ డ్యాన్స్ చేయాలనిపించింది. అంతా బాగుంటుంది ఈ పాట' అని కథానాయిక శ్రీలీల చెప్పారు.

దర్శకుడు శ్రీకాంత్ ఎన్ రెడ్డి మాట్లాడుతూ, 'ప్రథమార్థం అంతా వైష్ణవ్, శ్రీలీల, సుదర్శన్‌తో ఎంతో సరదాగా సాగి



వైష్ణవ్ తేజ్, శ్రీలీల

పోతుంది. సెకండాఫ్‌లో యాక్షన్ ఉంటుంది. ప్రేక్షకులను ఈ సినిమా ఖచ్చితంగా అలరిస్తుంది' అని తెలిపారు. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్‌ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య భారీస్థాయిలో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్రం నవంబర్ 10న ప్రపంచ వ్యాప్తంగా భారీస్థాయిలో థియేటర్లలో విడుదల కానుంది.



కార్తి, అను ఇమ్మాన్యుయేల్

టచ్చింగ్ టచ్చింగ్.. సందడి షురూ

హీరో కార్తి నటిస్తున్న తన 25వ చిత్రం 'జపాన్'. 'జోకర్' ఫేమ్ రాజు మురుగన్ దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని డ్రీమ్ వారియర్ పిక్చర్స్ పతాకంపై ఎస్ ఆర్ ప్రకాష్ బాబు, ఎస్ ఆర్ ప్రభు నిర్మించారు. అన్నపూర్ణ స్టూడియోస్ ఈ సినిమాని తెలుగు రాష్ట్రాలలో గ్రాండ్‌గా విడుదల చేయనుంది. ఇటీవలే విడుదలైన టీజర్‌కి ట్రెమెండస్ రెస్పాన్స్ వచ్చింది. తాజాగా మేకర్స్ ఈ చిత్ర మ్యూజికల్ జర్నీని స్టార్ట్ చేశారు. ఈ క్రమంలో ఫస్ట్ సింగిల్ 'టచ్చింగ్ టచ్చింగ్..' పాటని రిలీజ్ చేశారు. జీవీ ప్రకాష్ కుమార్ ఈ పాటని పెప్పీ అండ్ మాసీ నెంబర్‌గా కంపోజ్ చేశారు. సింగర్ ఇంద్రావతి చౌహాన్‌తో కలసి హీరో కార్తి స్వయంగా ఈ పాటని ఎనర్జిటిక్‌గా ఆలపించారు.

భాస్కరభట్ల అందించిన లిరిక్స్ మరో ఆకర్షణగా నిలిచింది. పాటలో కార్తి, అను ఇమ్మాన్యుయేల్ కెమిస్ట్రీ కలర్‌ఫుల్‌గా ఉంది. ఈ సినిమాలో సునీల్ కీలక పాత్రలో కనిపిస్తున్నారు. సినిమాటోగ్రాఫర్ విజయ్ మిల్టన్ తొలిసారి నటుడిగా పరిచయం అవుతున్నారు. సినిమా దీపావళికి గ్రాండ్‌గా థియేటర్స్‌లో విడుదల కానుంది.

ఓ కొత్త సినిమాటిక్ అనుభూతినిస్తుంది



చరణ్ రాజ్

రక్షిత్ అట్లూరి హీరోగా నటించిన సినిమా 'నరకాసుర'. అపర్ణ జనార్ధన్, సంకీర్తన విపిన్ హీరోయిన్స్‌గా నటించిన ఈ సినిమాను సుముఖ క్రియేషన్స్, ఐడియల్ ఫిలిం మేకర్స్ బ్యానర్స్‌లో డాక్టర్ అజ్జా శ్రీనివాస్ నిర్మించారు. సెబాస్టియన్ నోవా అకోస్టా జూనియర్ దర్శకత్వం వహించారు.

నవంబర్ 3న తెలుగుతో పాటు హిందీ, తమిళం, మలయాళం, కన్నడ భాషల్లో ఈ మూవీ రిలీజ్ కాబోతోంది. ఈ సినిమాలో ఓ కీలక పాత్రలో నటించిన చరణ్ రాజ్ మీడియాతో మాట్లాడుతూ, "ప్రతిఘటన, జెంటిల్ మేన్' సినిమాలు నన్ను నటుడిగా తెలుగు ప్రేక్షకులు ఎప్పటికీ గుర్తుంచుకునేలా చేశాయి. వివిధ భాషల్లో దాదాపు 600 చిత్రాల్లో నటించాను. ఈ సుదీర్ఘమైన కెరీర్‌లో అనేక రకాల క్యారెక్టర్స్ చేశాను. ఈ కథను డైరెక్టర్ చెప్పినప్పుడు ఈ కథ, కథనాల్లోని కొత్తదనం బాగా ఆకట్టుకున్నాయి. డైరెక్టర్ ఈ సినిమాను ఒక న్యూ అప్రోచ్‌తో తెరకెక్కించారు. ఆడియెన్స్‌కు కొత్త సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్ ఇచ్చే మూవీ అవుతుంది. ఈ సినిమాలో నేను ఒక పాము లాంటి స్వభావమున్న క్యారెక్టర్ చేశాను. అంటే మంచి వాళ్లతో మంచిగా, చెడ్డ వాళ్లతో చెడుగా ఉంటాడు. నా కెరీర్‌లో నేను చేసిన ఒక యూనిక్ క్యారెక్టర్ ఇది. నాతో పాటు మా అబ్బాయి కూడా ఈ సినిమాలో నటించాడు. ఇందులో హీరో రక్షిత్ చాలా బాగా నటించారు. అతనికి ఈ సినిమాతో మంచి యాక్షన్ హీరోగా పేరొస్తుంది' అని తెలిపారు.

చలికి వేడి వేడిగా...

శీతాకాలం ప్రారంభమైంది. పగలు విపరీతమైన ఎండ ఉంటున్నా... ఉదయం, సాయంత్రం మాత్రం చలి బాగా ఉంటుంది. ఈ చలిగాలికి గొంతులోకి కాస్త వేడి వేడిగా టీనో, కాఫీనో... తాగితే బాగుండు అనిపిస్తుంటుంది. కానీ ఎప్పుడూ అవేనా.. సూప్లు ఉన్నాయి కదా.. చలి నుంచి తట్టుకునేందుకు కాస్త వేడివేడిగా తీసుకుంటే భలే ఉంటుంది. ఆరోగ్యానికి కూడా చాలా మంచిది. ఉప్పు, కారం, ఒకటి రెండు కూరగాయలు కలిపి మరిగించి స్పూన్తో నోటికి అందిస్తే ఆకలి కూడా పుడుతుంది. బద్దకం పారిపోతుంది. మూడ్ హుషారవుతుంది. కూరగాయలతో పాటు మాంసాహారంతో తయారు చేసే సూప్లు కూడా చాలా రుచిగా ఉంటాయి. కమ్మనైన రుచి, గుభాళించే సువాసనతో ఉండే ఈ సూప్లు రోజులో ఎప్పుడైనా తాగవచ్చు. తయారు చేయడం కూడా తేలిక. మరి అవేంటో ఈ వారం చూద్దాం...



ఓట్స్ సూప్

కావాల్సిన పదార్థాలు : ఓట్స్ - రెండు చెంచాలు, సన్నగా తరిగిన ఉల్లిపాయ- పావు కప్పు, వెల్లుల్లి రెబ్బలు - రెండు (సన్నగా తరిగి పెట్టుకోవాలి), ఉప్పు - రుచికి సరిపడా, మిరియాల - కొద్దిగా, నూనె - కొద్దిగా, కొత్తిమీర తరుగు కొద్దిగా.

తయారు చేసే విధానం : పాన్‌లో కొద్దిగా నూనె వేసి వేడి చేయాలి. వేడయ్యాక అందులో ఉల్లిపాయ ముక్కలు, వెల్లుల్లి ముక్కలు వేసి బ్రౌన్ కలర్ వచ్చే వరకూ వేగించుకోవాలి. ఈలోపు వేరుగా ఒక గిన్నెలో నీళ్ళు పోసి అందులో రెండు చెంచాల ఓట్స్ వేసి ఉడికించుకోవాలి. చిక్కగా ఉడికిన తర్వాత అందులో పాలు మిక్స్ చేయాలి. ఐదు నిముషాలు ఉడికించాలి. ఇప్పుడు అందులో వేగించి పెట్టుకున్న ఉల్లిగడ్డ ముక్కలు, వెల్లుల్లి ముక్కలు, ఉప్పు, మిరియాల పొడి వేసి బాగా మిక్స్ చేయాలి. చివరగా కొత్తిమీర తరుగుతో ఓట్స్ సూప్‌ను గార్నిష్ చేయాలి. అంతే ఓట్స్ సూప్ రెడీ. ఈ స్పైసీ ఓట్స్ సూప్‌ను వేడి వేడిగా సర్వ్ చేస్తే చాలా రుచికరంగా ఉంటుంది. స్పైసీగా ఉండాలంటో ఒకటి రెండు పచ్చిమిర్చిని జోడిచవచ్చు.

చికెన్ స్వీట్ కార్న్ సూప్

కావాల్సిన పదార్థాలు : చికెన్ - వంద గ్రాములు, క్యారెట్ ముక్కలు - అర కప్పు, క్యాబేజీ - అర కప్పు, స్వీట్ కార్న్ - రెండు కప్పులు, మిరియాల పొడి - చెంచా, కారప్పొడి - అర చెంచా, కార్న్ ఫ్లోర్ - చెంచా, ఉప్పు - రుచికి సరిపడా, నూనె - తగినంత.



తయారు చేసే విధానం : ముందుగా ఒక పాన్ తీసుకొని అందులో కొద్దిగా నీరు పోయాలి. తర్వాత అందులో శుభ్రం చేసి పెట్టుకొన్న చికెన్ వేసి చిటికెడు పసుపు, కొద్దిగా ఉప్పు వేయాలి. ఒక నిముషం తర్వాత నీరు వంపేసి పక్కన పెట్టుకోవాలి. ఇప్పుడు పాన్ తీసుకొని అందులో కొద్దిగా నూనె వేయాలి. వేడి అయిన తర్వాత అందులో స్వీట్ కార్న్, సన్నగా తరిగిన క్యాబేజీ, క్యారెట్ ముక్కలు వేయాలి. తర్వాత రెండు లీటర్ల నీళ్ళు పోసి మొత్తం మిశ్రమాన్ని మిక్స్ చేయాలి. ఇప్పుడు వాటికి మిరియాల పొడి, కారప్పొడి వేసి మిక్స్ చేయాలి. తర్వాత అందులోనే చికెన్ కూడా వేసి మిక్స్ చేయాలి. ఇప్పుడు ఒక చిన్న బౌల్ తీసుకొని అందులో నీరు, కార్న్ ఫ్లోర్ వేసి బాగా మిక్స్ చేయాలి. ఉండలు లేకుండా మొత్తం మిశ్రమాన్ని కలగలుపుకోవాలి. ఈ మిశ్రమాన్ని పాన్‌లో వేసి, రుచికి సరిపడా ఉప్పు వేసి కలగలుపుకోవాలి. ఈ మొత్తం మిశ్రమం అంతా 10-15 నిమిషాలు మెత్తగా ఉడకనివ్వాలి. అంతే హాట్ అండ్ స్పైసీ చికెన్ స్వీట్ కార్న్ సూప్ రెడీ.

క్యాబేజ్ పెప్పర్ సూప్

కావాల్సిన పదార్థాలు : క్యాబేజ్ - ఒకటి (సన్నగా తరిగిపెట్టుకోవాలి), క్యారెట్ - రెండు (పొట్టు తీసి సన్నగా తరిగిపెట్టుకోవాలి), ఉల్లిగడ్డ - రెండు (సన్నగా తరిగి పెట్టుకోవాలి), కార్న్ ఫ్లోర్ - అర చెంచా, మిరియాలు - చెంచా (పొడి చేసుకోవాలి), ఉప్పు - రుచికి సరిపడా, బట్టర్ - చెంచా.

తయారు చేసే విధానం : ముందుగా కూరగాయల ముక్కలన్నీ నీటిలో వేసి శుభ్రంగా కడిగి పక్కన పెట్టుకోవాలి. తర్వాత ప్రెషర్ కుక్కర్ స్టౌ మీద పెట్టి నీళ్ళు పోసి మరిగించాలి. తర్వాత అందులో సన్నగా తరిగి పెట్టుకొన్న క్యాబేజీ, క్యారెట్, ఉల్లిగడ్డ ముక్కలు వేయాలి. అన్ని బాగా మిక్స్ చేసి, మూత పెట్టి రెండు లేదా మూడు విజిల్స్ వచ్చే వరకు ఉడికించి పెట్టుకోవాలి. ఆవిరి మొత్తం తగ్గిన తర్వాత మూత తీయాలి. ఇప్పుడు ఓ పాన్‌లో బటర్ వేసి అందులో కూరగాయ ముక్కలతో సహా సూప్ (కూరలు ఉడికిన నీరు) కూడా అందులో పోయాలి. ఇప్పుడు అందులో మిరియాల పొడి, ఉప్పు కూడా వేసి బాగా మిక్స్ చేయాలి. సూప్ చిక్కగా రావాలంటే కొద్దిగా కార్న్ ఫ్లోర్ కలిపి ఉండలు కట్టకుండా మిక్స్ చేయాలి. అంతే పెప్పర్, క్యాబేజ్ సూప్ రెడీ. వేడి వేడిగా సర్వ్ చేయాలి. ఇది దగ్గు జలుబును నివారిస్తుంది. అలాగే శరీరంలో వేడి పుట్టించి కొవ్వును కరిగిస్తుంది.





చికెన్ మష్రూమ్ సూప్

కావాల్సిన పదార్థాలు : బోన్ లెస్ చికెన్ - పావు కిలో, చికెన్ - నాలుగు కప్పులు, మష్రూమ్ - పది (రెండుగా కట్ చేయాలి) ఉల్లిపాయ - నాలుగు (పొడవుగా కట్ చేయాలి), పచ్చిమిర్చి - రెండు (కట్ చేసినవి), మిరియాలు - పది (పొడి చేసుకోవాలి), కొత్తిమీర - ఒక కట్ట (సన్నగా కట్ చేసుకోవాలి), బట్టర్ - చెంచా, ఉప్పు - రుచికి సరిపడా.

తయారు చేసే విధానం : ముందుగా కుక్కర్‌లో చికెన్ వేసి, అందులో నీళ్ళు పోసి రెండు విజిల్స్ వచ్చే వరకూ ఉడికించుకోవాలి. తర్వాత స్టౌ ఆఫ్ చేసి కుక్కర్‌లో చికెన్ ముక్కలను వేరుగా తీసుకోవాలి. చికెన్ ఉడికించిన నీళ్ళు పక్కన పెట్టుకోవాలి. తర్వాత పాన్‌లో కొద్దిగా బట్టర్ వేసి కరిగిన తర్వాత మిరియాల పొడి వేసి ఒక సెకన్ వేగిన తర్వాత ఉల్లిగడ్డ ముక్కలు వేసి ఐదు నిముషాలు వేయించాలి. తర్వాత అందులో మష్రూమ్ ముక్కలు కూడా వేసి వేగించాలి. తర్వాత అందులో పచ్చిమిర్చి, అల్లం, ఉల్లి కాడలు, పక్కన పెట్టుకొన్న సన్నని చికెన్ పీసులు వేసి బాగా మిక్స్ చేసి రెండు నిముషాలు వేగించుకోవాలి. వేగిన తర్వాత అందులో నీళ్ళు నాలుగు కప్పులు పోసి రెండు నిముషాలు ఉడికించుకోవాలి. ఇప్పుడు అందులో ఉప్పు వేసి బాగా మిక్స్ చేసి కొత్తిమీర తరుగు కూడా వేసి 10 నిముషాలు తక్కువ మంట మీద ఉడికించుకోవాలి. అంతే చికెన్ మష్రూమ్ సూప్ రెడీ.

ఈ అలవాట్లతో విజయం మీదే..

ఆరోగ్యకరమైన జీవన విధానం అంటే మంచి విషయాలని మంచి అలవాట్లుగా మార్చుకోవడం. అంటే సరైన సమయానికి సరైన ఆహారం తీసుకోవడం, రెగ్యులర్‌గా వ్యాయామం చేయడం, కొత్త విషయాలు నేర్చుకోవడం వంటివి అలవాటుగా మారి పోవాలి. అవి ఆటోమాటిక్‌గా రోజులో వాటికి కేటాయించిన సమయంలో జరిగిపోవాలి. తల్లిదండ్రులు, పెద్ద వాళ్ళు, టీచర్లు, మెడికల్ ప్రొఫెషనల్స్, పర్సనాలిటీ డెవలప్‌మెంట్ కోచెస్... అందరూ మంచి అలవాట్లు చేసుకోవడం గురించి చెప్తూనే ఉంటారు. కానీ.. అవి ఎందుకు చేసుకోవాలో మీరెప్పుడైనా ఆలోచించారా? ఆ విషయాలు ఇప్పుడు తెలుసుకుందాం...



అలవాటు అంటే ప్రత్యేకంగా ఆలోచించకుండా రోజూ చేసేది. అందరికీ కొన్ని అలవాట్లు ఉంటాయి. ఒక టైమ్‌కి నిద్ర లేవడం, ఒక పద్ధతిలో బ్రష్ చేసుకోవడం, ఒక టైమ్‌లో ఫ్రెండ్స్ తో మాట్లాడడం వంటివి. అలవాట్లు మన లైఫ్‌లో ఎంతగా భాగం అయిపోతాయంటే అవే మనం అనిపించేంత. మీరు మారాలి అనుకుంటే మీరు ముందు చేయాల్సిన పని మీ అలవాట్లని మార్చుకోవడం.

అసాధ్యం కాదు : అలవాటులో ఉండే మంచి లక్షణమేంటంటే మీరు దాన్ని మార్చుకోవచ్చు. చాలా కాలం నుండీ ఉన్న అలవాట్లని మార్చుకోవడం కొద్దిగా కష్టమవుతుంది. చెడు అలవాట్లని మార్చుకోవడం ఇంకా కష్టమవుతుంది. కానీ, మార్చుకోవడం అసాధ్యమేమీ కాదు. ఉదాహరణకి మంచి ఆహారం తీసుకునే అలవాటు పెంచుకోవాలనుకుంటే రోజుని గోరు వెచ్చని నీటితో, లేదా గోరు వెచ్చని నీటిలో తేనె, నిమ్మరసం వేసుకునో తాగడం మొదలు పెట్టండి. అప్పుడు పొద్దున్నే కాఫీ, టీ లాంటివి తాగే అలవాటు మారుతుంది.

లక్ష్యానికి చేరువ : ఒక మారథాన్ రన్నర్ అవుదామని అనుకుంటే.. మీ సిటీలో జరిగే ఫస్ట్ మారథాన్‌లో పరిగెత్తడం మొదటి స్టెప్ కాదు.. మారథాన్ రేస్‌లో పాల్గొనాలంటే కావాల్సిన ఫిట్నెస్‌కి సంవత్సరాల తరబడి ట్రెనింగ్ అయి ఉండాలి. గోల్ రీచ్ అవ్వాలంటే చేయాల్సిన మొదటి పని దానికి కావాల్సిన అలవాటుని చేసుకోవడం.

జీవితాంతం : మిమ్మల్ని డిఫైన్ చేసేది మీ అలవాట్ల వల్లే కాబట్టి, అలవాట్లు మీతో జీవితాంతం ఉంటాయి. మీరు అవతలి వారిని ఆనందంగా పలకరిస్తే మీరు సంతోషాన్ని పంచే వ్యక్తి అవుతారు. ప్రతి భోజనంలోనూ సలాడ్ తినే అలవాటుంటే మీరు ఆరోగ్యకరమైన వ్యక్తి అవుతారు.

డోంట్ వేస్ట్ టైమ్ : మనందరం ఎంతో టైమ్ వేస్ట్ చేస్తూ ఉంటాం. కానీ, మంచి అలవాట్లని పెంపొందించుకోవటం వల్ల ఈ టైమ్ వేస్ట్ తగ్గుతుంది. పని కూడా స్పీడ్‌గా అయిపోతుంది. అందరికీ ఒక్కోరోజు అసలు ఏ పనీ చేయాలనిపించదు, ఎక్సర్సైజ్ చేయా లనిపించదు, వండుకుని తినాలనిపించదు. కానీ, ఈ అలవాట్లు మనకి ఇలాంటప్పుడు ఎంతో సాయం చేస్తాయి. ఉదాహరణకి మనకి లేవగానే బ్రష్ చేసుకోవడం అలవాటు. బ్రష్ చేసుకోవాలి అని అనిపించక పోవడం ఎప్పుడూ జరగదు కదా. లేవడం, బ్రష్ చేసుకోవడం.. ఈ రెండూ ఒక దాని తర్వాత ఒకటి ఆటోమేటిక్‌గా అయి పోతాయి. మంచి ఆహారం తీసుకోవడం అల వాటు చేసుకు న్నప్పుడు ఎప్పుడైనా జంక్ ఫుడ్ తిన్నా, మళ్ళీ మన అలవాట్లలోకి మనం వచ్చేస్తాం.

అయితే, ఇలా మంచి అలవాట్లు చేసుకోవడానికి కూడా కొన్ని తేలిక పద్ధతులున్నాయి. అవేమిటో కూడా చూద్దాం...

- ఒక పెద్ద గోల్ రీచ్ అవ్వడానికి చిన్న చిన్న స్టెప్స్ అవసరమే అని చెప్తున్నారు పరిశోధకులు. చిన్న చిన్న స్టెప్స్‌ని మనం మన అలవాట్లుగా మార్చేసుకుంటే గోల్ రీచ్ అవుతుంది.
- "నేనివాళ్టి నుంచి ఎక్సర్సైజ్ చేస్తాను" అనుకోవడం కంటే, "నేనివాళ అర గంటైనా ఎక్సర్ సైజ్ చేయాలి అని రెడీ అవ్వడం చేస్తుంటే అదే ఓ అల వాటుగా మారుతుంది. ఇలా అనుకుని, ఆరంభించడం వల్ల అలవాట్లు తొందరగా ఫార్మ్ అవుతాయని నిపుణులు అంటున్నారు.
- ఒక కొత్త అలవాటు చేసుకుందామని ట్రై చేస్తున్నప్పుడు కొన్ని విషయాలు మనని వెనక్కి లాగుతాయి. ఉదాహరణకి జంక్ ఫుడ్ మానేద్దాం అనుకుంటున్నప్పుడు కంటికి కనిపించే ఇన్‌స్టెంట్ ఫుడ్ వెనక్కి లాగుతుంది. అలాంటివి రిమూవ్ చేయడం ద్వారా మన గోల్‌ని రీచ్ అవ్వడం తేలిక అవుతుంది.
- మంచి అలవాట్ల వల్ల లైఫ్ బావుంటుంది. ఇదేమీ అసాధ్యమైన పనేమీ కాదు. కొంత విల్ పవర్, కొన్ని ట్రిక్స్ కలిస్తే కావాల్సిన హ్యాబిట్ ఏర్పరుచుకోవచ్చు.

ఎన్నికల ప్రలోభాలపై ఐటీ కన్ను

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో అక్రమంగా తరలించే నగదు, బంగారం, వజ్రాలు తదితరాలపై ఆదాయపన్ను శాఖ (ఐటీ) ప్రత్యేక దృష్టి సారిస్తుందని హైదరాబాద్ శాఖ డైరెక్టర్ జనరల్ సంజయ్ బహదూర్ తెలిపారు. దీనికోసం 250 మంది సిబ్బందితో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామన్నారు. తనిఖీల్లో రూ.10 లక్షల కంటే ఎక్కువ మొత్తంలో పట్టుబడితేనే ఆదాయపన్ను శాఖ పరిధిలోకి వస్తుందనీ, అంతకంటే తక్కువ సొమ్ము అయితే జిల్లా ఎన్నికల అధికారి పరిధిలో ఉంటుందని వివరణ ఇచ్చారు. బ్యాంకుల్లో ఏకమొత్తంలో డిపాజిట్లు, విత్‌డ్రాలపై తమ శాఖ ఇంటలిజెన్స్ విభాగం నిఘా ఉంటుందని తెలిపారు. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో రూ.20 కోట్లు స్వాధీనం చేసుకున్నామనీ, ఆయా కేసులు ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయని బుధవారంనాడిక్కడ జరిగిన విలేకరుల సమావేశంలో చెప్పారు. కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకటించినప్పటి నుంచి ఇప్పటి వరకు పోలీసులు, ఎయిర్‌పోర్ట్ అథారిటీతో పాటు వివిధ శాఖలు అందించిన సమాచారంతో రూ.53.93 కోట్లు సీజ్ చేశామనీ, దానిలో 10.99 కోట్లు సరైన కారణాలు చూపడంతో రిలీజ్ చేశామని చెప్పారు. ఎన్నికల అఫిడవిట్లలో అభ్యర్థుల ఐటీ రిటర్న్‌తో పాటు ఎన్నికలు ముగిసాక ఆరు నెలల లోపు సమర్పించే ఖర్చుల వివరాలను సైతం తమ శాఖ మదింపు చేస్తుందని తెలిపారు. తమ శాఖ స్వయంగా నిర్వహించిన తనిఖీల్లో ఇప్పటి వరకు 1.76 కోట్లు సీజ్ చేశామన్నారు. ఎన్నికల్లో నగదు రవాణా, బదిలీని నివారించేందుకు, సాంకేతికతను అందిపుచ్చుకుంటూ ప్రత్యేక యాప్ ద్వారా సమాచారం అందిన వెంటనే సంఘటనా స్థలికి చేరేందుకు క్విక్ రెస్పాన్స్ టీంలను ఏర్పాటు చేశామని తెలిపారు. ఎయిర్‌పోర్టు తనిఖీల్లో భాగంగా ఎయిర్ ఇంటలిజెన్స్ యూనిట్స్ (ఏఐయూ) ఏర్పాటు చేశామన్నారు. హైదరాబాద్‌లోని అయ్యకార్ భవన్ ఆదాయపన్ను శాఖ కార్యాలయం మొదటి అంతస్తులో 24/7 పనిచేసే ప్రత్యేక కంట్రోల్ రూం ఏర్పాటు చేశామనీ, ఎన్నికల్లో డబ్బు, ఆభరణాలు, బంగారం, వెండి, వజ్రాల వినియోగం గురించి సమాచారం ఉంటే ప్రజలు ఇక్కడ ఫిర్యాదు చేయవచ్చని వివరించారు. దానితోపాటు టోల్ ఫ్రీ నెంబర్ 1800-425-1788 లేదా ల్యాండ్‌లైన్ నెంబర్లు 040-23426201/23426202కు ఫోన్ చేసి సమాచారం తెలుపవచ్చన్నారు. అలాగే వీడియోలు ఇతర సమాచారం ఉంటే 7013711399 నెంబర్‌కు వాట్సప్ చేయాలనీ, ఇతర ఫిర్యాదులను cleantelanganaelections@incometax.gov.in కు మెయిల్ చేయొచ్చని చెప్పారు. సమావేశంలో ఆదాయపన్ను శాఖ హైదరాబాద్ విభాగం అడిషనల్ డైరెక్టర్ (ఇన్వెస్టిగేషన్), ఎన్నికల నోడల్ ఆఫీసర్ ఎమ్ కార్తిక్ మాణిక్యం, అడిషనల్ డైరెక్టర్ (హెడ్‌క్వార్టర్స్) జీ రాఘవేంద్రరావు, పీఐబీ అడిషనల్ డైరెక్టర్ జనరల్ శృతిపాటిల్ పాల్గొన్నారు.

అధిష్టానం ఎక్కడ పోటీ చేయమంటే... అక్కడే పోటీ : ఎంపీ కోమటిరెడ్డి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

అధిష్టానం ఎక్కడ పోటీ చేయమంటే అక్కడ చేస్తానని ఎంపీ కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి చెప్పారు. రాష్ట్రంలో ప్రజలు మార్పు కోరుకుంటున్నారన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలకు చెందిన నేతలు కాంగ్రెస్‌లో చాలా మంది చేరుతున్నారని గుర్తు చేశారు. తన సోదరుడు రాజగోపాల్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరిక విషయం తనతో మాట్లాడలేదన్నారు. బుధవారం హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి విలేకర్లతో మాట్లాడారు. కాంగ్రెస్ రెండో జాబితా పూర్తయిందనీ, గురువారం విడుదల అవుతుందన్నారు. ఆరు స్థానాల్లో మాత్రమే ఇబ్బందులు ఉన్నాయని తెలిపారు. అక్కడ ఇద్దరు ముగ్గురు పోటీ పడుతున్నారని చెప్పారు. కాంగ్రెస్ ఎలక్షన్ కమిటీ (సీఈసీ) ఫైనల్ అయ్యేవరకు బయట మాట్లాడకూడదన్నారు. కర్నాటకలో హామీ ఇచ్చిన పథకాలు అమలు అవుతున్నాయని పేర్కొన్నారు. గతంలోనే కాళేశ్వరంపై విచారణ జరపాలని ప్రధానికి లేఖ రాసినట్టు తెలిపారు. వామపక్షాలకు నాలుగు సీట్లు అంటే తక్కువ కాదనీ, మిర్యాలగూడలో కూడా అడిగారని, అక్కడ ఓటు ఎంత వరకు బదిలీ అవుతుందనేది చూడాలన్నారు. కాంగ్రెస్ పార్టీకి 70 నుంచి 80 సీట్లు వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. పొత్తులపై బుధవారం సాయంత్రం క్లారిటీ వస్తుందన్నారు. రాహుల్ గాంధీ పేరు పలికే అర్హత కేటీఆర్‌కు లేదని చెప్పారు. రాహుల్ గాంధీ కుటుంబానికి ఇల్లు కూడా లేదన్నారు. ఇప్పుడు మీ ఆస్తులెంత కేటీఆర్ అంటూ కోమటిరెడ్డి ప్రశ్నించారు.

నో ఇన్‌కమింగ్ ఓన్లీ ఔట్ గోయింగే

(మొదటిపేజి తరువాయి)

బలంగా వెళ్లడంతో ఐదారు నెలల కింద తారాజువ్వల్లా ఎగిసి పడిన నేతలు ఇప్పుడు తుస్సు బాంబుల్లా మారారు. ఘోరంగా ఓడిపోతే ఉన్న పరువు కాస్తా ఎక్కడ పోతుందో అనే భయంతో అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయడానికే జంకుతున్నారు. ఈ జాబితాలో డీకే అరుణ, వివేక్, విజయశాంతి, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, జితేందర్‌రెడ్డి, తదితర కీలక నేతలంతా ఉన్నారు. మరి కొందరు కీలక నేతలు పార్టీని కూడా వీడబోతున్నట్టు జోరుగా ప్రచారం జరుగుతున్నది.

అధిష్టానం కోర్టులో వేములవాడ పంచాయితీ

వేములవాడ నియోజవర్గంలో అభ్యర్థిత్వాన్ని ఖరారు చేయడం బీజేపీ రాష్ట్ర నాయకత్వానికి తలకు మించిన భారంగా మారింది. మొదట ఈ సీటుపై బండి సంజయ్ ఆసక్తి చూపినప్పటికీ ఆ తర్వాత వెనక్కి తగ్గారు. మహారాష్ట్ర మాజీ గవర్నర్ చెన్నమనేని విద్యాసాగర్‌రావు తనయుడు వికాస్‌రావు ప్రతిమ ఫౌండేషన్ ద్వారా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ బీజేపీ నుంచి సీటును ఆశిస్తున్నారు. అదే నియోజకవర్గం నుంచి తనను అభ్యర్థిగా ప్రకటించాలని కరీంనగర్ జడ్పీ మాజీ చైర్‌పర్సన్ తుల ఉమ పట్టుబడుతున్నారు. ఆ పార్టీ రాజన్నసిరిసిల్ల జిల్లా అధ్యక్షులు ప్రతాప రామకృష్ణ కూడా టికెట్ ఆశిస్తున్నారు. ఆయనది స్వతహాగా వేములవాడ నియోజకవర్గమే. బీజేపీ రాష్ట్ర నాయకులు ఎర్రం మహేశ్ కూడా సీటు ఆశించినప్పటికీ ఆయన బలంగా రేసులో లేరు. ఈటల రాజేందర్‌తో కలిసి తుల ఉమ బీజేపీలో చేరారు. అప్పటి నుంచి వేములవాడ నియోజకవర్గంలో పనిచేసుకుంటున్నారు. తుల ఉమకు ఈటల, వికాస్‌రావుకు విద్యాసాగర్‌రావు అండగా ఉండి టికెట్ కోసం తమ శక్తిమేర ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ సీటు విషయంలో ఎటూ తేల్చలేక రాష్ట్ర నాయకత్వం చేతులెత్తేసింది. ప్రకాశ్ జవదేకర్, సునీల్‌బన్సల్‌తో విద్యాసాగర్‌రావు ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఇదే విషయంపై ఈటల కూడా వారిపై ఒత్తిడి తెస్తున్నారు. దీంతో ఇప్పుడు పరిస్థితి ఈటల వర్సెస్ విద్యాసాగర్‌రావుగా మారింది.



న్యాయం చేయండంటూ ప్రదక్షిణలు

పార్టీ కోసం దశాబ్దాల తరబడి పనిచేస్తున్నా తమకు సీట్లు ఇవ్వకుండా వేరే పార్టీల నుంచి వచ్చిన డబ్బున్నవాళ్లకే సీట్లు కేటాయిస్తుండటంపై ఆ పార్టీ హార్డ్‌కోర్ నాయకులు గుస్సా అవుతున్నారు. తమకు న్యాయం చేయాలంటూ పార్టీ రాష్ట్ర కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. బీఆర్ఎస్‌కు గుడ్‌బై చెప్పి బీజేపీ నుంచి జహీరాబాద్ టికెట్ ఆశిస్తున్న ఢిల్లీ వసంత కుమార్ జాతీయ నాయకుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. షాద్‌నగర్ నేతలు విష్ణువర్దన్‌రెడ్డి తనకు టికెట్ ఇవ్వాలని కోరుతూ బీజేపీ ఆఫీస్ చుట్టూ తిరుగుతున్నారు. అక్కడ నుంచి మాజీ ఎంపీ జితేందర్‌రెడ్డి కుమారుడు మిథున్‌రెడ్డి సీటు ఆశిస్తున్నారు. జనగామలో బలమైన బీసీ సామాజిక తరగతికి చెందిన నేత బి.బీరప్పకు టికెట్ ఇవ్వకుండా దస్మంతరెడ్డికి ఇవ్వడం కొత్త పంచాయితీకి దారితీసింది. ఏండ్లతరబడి పనిచేస్తున్న బీరప్పకు టికెట్ ఇవ్వకపోవడంపై ఆ పార్టీ శ్రేణులు ఆగ్రహంతో ఆందోళనలు చేస్తున్న పరిస్థితి ఉంది.

రవికుమార్ వినూత్న పోరాటం

ధర్మపురిలో ఎంతో కాలంగా బీజేపీలో ఉన్న తనకు కాదని వేరేవారికి టికెట్ ఇవ్వడంపై రాయిల్ల రవికుమార్ రాష్ట్ర నాయకత్వంపై వినూత్న పోరాటం చేస్తున్నారు. తనకు ధర్మపురి అసెంబ్లీ నియోజకవర్గం టికెట్ ఇచ్చి న్యాయం చేయాలని కోరుతూ హైదరాబాద్‌లోని రాష్ట్ర కార్యాలయం వరకు సైకిల్‌పై 'విజ్ఞప్తి యాత్ర' చేపట్టారు. తెలంగాణ ఉద్యమంలో, మోడీ ప్రధాని కావాలని తాను చేపట్టిన సైకిల్ యాత్ర, సంస్థాగతంగా పట్టులేని చోట పార్టీ బలోపేతం కోసం తాను చేసిన కృషిని వివరిస్తూ రాష్ట్ర కార్యాలయం వద్ద నేతలను కలిసి మొరపెట్టుకుంటున్న పరిస్థితి కనిపించింది.

మరో 33 స్థానాలకు అభ్యర్థులు

(మొదటిపేజి తరువాయి)

ఏఐసీసీ ప్రధాన కార్యాలయంలో ఆ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నేతృత్వంలో సీఈసీ భేటీ అయింది. ఈ భేటీలో పార్టీ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, కేసీ వేణుగోపాల్, స్క్రీనింగ్ కమిటీ చైర్మన్ మురళీధరన్, కమిటీ సభ్యులు మాణిక్ రావు ఠాక్రే, రేవంత్ రెడ్డి, భట్టి విక్రమార్క,ఉత్తమ్ కుమార్ రెడ్డి, జిగ్నేశ్ మేవానీ సహా ఇతర స్క్రీనింగ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. మధ్యాహ్నం 12:45 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఈ భేటీ సాగింది. ముఖ్యంగా తెలంగాణకు సంబంధించిన అభ్యర్థుల ఎంపికపై ఈ భేటీలో కీలకంగా చర్చించారు. అయితే ఈ భేటీలో దాదాపు 33 స్థానాలపై స్పష్టత వచ్చింది. కాగా మొత్తం 119 స్థానాలకు గాను ఈనెల 15న 55 స్థానాలకు అభ్యర్థులతో కూడిన మొదటి జాబితా విడుదల చేశారు. ప్రస్తుతం మరో 33 స్థానాలతో, మొత్తం 88 స్థానాలపై స్పష్టత వచ్చినట్లు ఏఐసీసీ వర్గాలు తెలిపాయి. మిగిలిన 31 స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేసేందుకు నేడు (గురువారం) ఉదయం 10 గంటలకు సీఈసీ భేటీ కానుంది. ఇదిలా ఉంటే బుధవారం సాయంత్రం కేసీ వేణుగోపాల్ నివాసంలో స్క్రీనింగ్ కమిటీ భేటి అయింది. ఈ 22 స్థానాలపై నేతలు చర్చించి, తుది జాబితాను తయారు చేసినట్లు సమాచారం.

అబద్ధాలు, దోపిడీ, కమీషన్ తప్ప చేసిందేమీ లేదు...: ఖర్గే

తెలంగాణ మార్పునకు సిద్ధమైందని, ప్రజలు కాంగ్రెస్ ను ఎన్నుకునేందుకు సిద్ధమయ్యారని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అన్నారు. ఈ మేరకు బుధవారం ట్విట్టర్(ఎక్స్)లో సీఈసీ మీటింగ్ వీడియోతో కలిపి ఒక పోస్ట్ పెట్టారు. ఓటమి ఖాయం కావడంతో బీఆర్ఎస్ నేతలు కాంగ్రెస్ పార్టీపై నిరంతరం దాడులు చేస్తూ... తీవ్ర నిరాశను వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు. బీఆర్ఎస్, బీజేపీ, ఎంఐఎం లు నేరాల్లో భాగస్వాములని విమర్శించారు. అబద్ధాలు, దోపిడి, కమీషన్లు తప్ప తెలంగాణ ప్రజలకు ఆ పార్టీలు చేసింది ఏమీ లేదన్నారు. కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలు తెలంగాణలో న్యాయం, సంక్షేమం, పురోగతికి బాటలు వేస్తాయన్నారు. సీఈసీ మీటింగ్ లో తెలంగాణకు సంబంధించిన కీలక చర్చ జరిగిందని వెల్లడించారు.

24 గంటల్లో రూ.4.44 కోట్ల సొత్తు స్వాధీనం

(మొదటిపేజి తరువాయి)

స్వాధీనం చేసుకున్నారు. రూ.6.78 లక్షలు విలువైన బంగారు, వెండి ఆభరణాలు, రూ.30.32 లక్షలు విలువైన ల్యాప్‌ట్యాప్‌లు, క్రీడా పరికరాలు, చీరలు, బియ్యం వగైరాలు స్వాధీనం చేసుకున్నారు.



దీనితో ఎన్నికల షెడ్యూల్ ప్రకటన వెలువడిన అక్టోబరు 9 నుంచి 25వ తేదీ వరకు స్వాధీనం చేసుకున్న రూ.119.44 కోట్ల నగదుతో సహాచ మొత్తం స్వాధీనాల విలువ రూ.340 కోట్లను దాటినట్టు ఎన్నికల సంఘం అధికారులు తెలిపారు.

నిరుద్యోగ భారత్

(మొదటిపేజి తరువాయి)

పొరుగు దేశాలతో పోలిస్తే గత సంవత్సరంలో మన దేశంలోనే నిరుద్యోగ రేటు అధికంగా ఉన్నదని ప్రపంచబ్యాంక్ తెలిపింది. నిరుద్యోగ రేటు మన పొరుగున ఉన్న పాకిస్తాన్‌లో 11.3 శాతం, బంగ్లాదేశ్‌లో 12.9 శాతం, భూటాన్‌లో 14.4 శాతం ఉండగా మన దేశంలో 23.22 శాతంగా ఉంది. ప్రపంచబ్యాంక్ తాజాగా విడుదల చేసిన నివేదిక ప్రకారం చైనాలో 13.2 శాతం, సిరియాలో 22.1శాతం, ఇండోనేషియాలో 13 శాతం, మలేసియాలో 11.7 శాతం, వియత్నాంలో 7.4 శాతం, దక్షిణ కొరియాలో 6.4 శాతం, సింగపూర్‌లో 6.1 శాతంగా నిరుద్యోగ రేటు నమోదైంది. అంతర్జాతీయ కార్మిక సంఘం విడుదల చేసిన సమాచారం ఆధారంగా ప్రపంచబ్యాంక్ ఈ వివరాలు వెల్లడించింది. చేసేందుకు పనిలేక, ఉద్యోగం కోసం వెతుకుతున్న 15-24 సంవత్సరాల మధ్య వయసున్న యువతను పరిగణనలోకి తీసుకొని యువతలో నిరుద్యోగ రేటును అంచనా వేస్తారు. దేశంలో నిరుద్యోగమే అతి పెద్ద సమస్య అని 15-34 సంవత్సరాల మధ్య వయసున్న వారిలో 36 శాతం మంది అభిప్రాయపడుతున్నారని లోక్‌నీతి-సీఎస్‌డీఎస్ సర్వే తెలిపింది.

దర్యాప్తు కొనసా..గుతోంది..

(మొదటిపేజి తరువాయి)

ఎల్‌అండ్‌టీ ప్రతినిధులు సమావేశంలో పాల్గొన్నారు. మేడిగడ్డ ఆనకట్ట కుంగిన అంశంపై కేంద్రబృందం ఇంజినీర్లతో పూర్తిస్థాయిలో చర్చించింది. ఆనకట్టకు చెందిన సాంకేతిక అంశాలపై కూడా సుదీర్ఘంగా మంతనాలు జరిపింది. ప్రాజెక్టుకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని కేంద్ర బృందం సేకరించింది. అదనంగా మరికొంత సమాచారాన్ని ఇవ్వాలని కోరింది. త్వరలో కేంద్రం బృందం అడిగిన ఇతర వివరాలు పంపిస్తామని తెలంగాణ సాగునీటి శాఖ తెలియజేసింది. భేటి అనంతరం తెలంగాణ ఇంజినీర్ ఇన్ చీఫ్ మురళీధర్ మీడియా మాట్లాడుతూ "మేడిగడ్డ ఆనకట్ట నిర్మాణంలో ఎలాంటి లోపాలు లేవు..ఏడో బ్లాక్‌లో సమస్య మూలంగా సెంటర్ పియర్ కుంగింది. ఎక్కడో చిన్న పొరపాటు జరిగింది. ఇసుక కారణంగా సమస్య వచ్చిందని భావిస్తున్నాం. బ్యారేజీకి సంబంధించి ఇసుక నాణ్యత, నిర్మాణ నాణ్యత అనుమతులు వచ్చాయి. కాఫర్ డ్యామ్‌కు వరద తగ్గాక నవంబర్ చివరలో సమగ్ర పరిశీలన చేస్తాం' అని అన్నారు. డిజైన్‌లోగానీ లోపాలు ఏమైనా ఉన్నాయా అని మీడియా అడిగిన ప్రశ్నకు మురళీధర్ సమాధానమిస్తూ డిజైన్‌లో తప్పులుంటే గత మూడు సీజన్లను బ్యారేజీ ఎలా తట్టుకుందనీ ఎదురు ప్రశ్నించారు. పిల్లర్ కుంగుబాటుతో కాళేశ్వరం ఆయకట్టుకు ఎలాంటి ఢోకా లేదన్నారు. యథావిధిగా సాగునీటిని అందించే అవకాశం ఉన్నదని సాగునీటి శాఖ ఉన్నతాధికారులు చెబుతున్న విషయం విదితమే.

ఇండియా కాదు...భారత్

(మొదటిపేజి తరువాయి)

ఇండియా బదులు భారత్ అనే పదాన్నే బోధించాలని కమిటీ ప్రత్యేకంగా సిఫారసు చేసిందని ఇస్సాక్ తెలిపారు. 'భారత్ అనే పేరును విష్ణు పురాణంలో ప్రస్తావించారు. కాళిదాసు కూడా భారత్ అనే మాటను ఉపయోగించారు. అది పురాతన పేరు. తుర్కులు, ఆఫ్ఘన్లు, గ్రీకుల దాడి తర్వాత ఇండియా అనే పేరు వాడారు. సింధు నది ఆధారంగా వారు భారత్‌ను గుర్తించారు. ఆ పదం అనువుగా ఉంటుందని ఆక్రమణదారులు భావించారు. 12వ తరగతి వరకూ మాత్రమే పాఠ్య పుస్తకాల్లో భారత్ అనే పేరును ఉపయోగించాలని నేను గట్టిగా చెప్పాను. ఇతర సభ్యులు దీనికి అంగీకరించారు. ఇది కమిటీ ఏకగ్రీవ అభిప్రాయం' అని వివరించారు.

యుద్ధాలలో హిందూ ఓటములపై ప్రస్తుత పాఠ్య ప్రణాళిక మరీ ఎక్కువ దృష్టి పెట్టిందని కమిటీ అభిప్రాయపడిందని ఇస్సాక్ చెప్పారు. 'దీనికి భిన్నంగా హిందూ విజయాలను ప్రస్తావించలేదు. మన దేశాన్ని దోచుకున్న తర్వాత మహమ్మద్ ఘోరీ స్వదేశానికి వెళుతుండగా ఆయన్ని గిరిజనులు హతమార్చారు. ఈ విషయాన్ని మన పాఠ్య పుస్తకాలు విద్యార్థులకు ఎందుకు బోధించవు? ట్రావెన్‌కోర్ రాజ్యం, ఈస్ట్ ఇండియా కంపెనీ మధ్య జరిగిన కోలాచల్ యుద్ధం గురించి మన పాఠ్య పుస్తకాల్లో ఎందుకు లేదు? అత్యవసర పరిస్థితి కాలాన్ని గురించి వివరంగా ఎందుకు బోధించరు?' అని ఆయన ప్రశ్నించారు. దేశ చరిత్రను పురాతన, మధ్య, ఆధునిక కాలాలుగా వర్గీకరించడాన్ని తొలగించాలని కూడా కమిటీ సిఫారసు చేసింది.





పోరాటాల పురిటిగడ్డపై హోరాహోరీ

గతంలో కమ్యూనిస్టు, కాంగ్రెస్‌ల కంచుకోట

- పూర్వ వైభవం కోసం వ్యూహాలు
- అసంతృప్తులతో గులాబీలో గుబులు
- ఎన్నికల్లో నువ్వా.. నేనా.. అనేలా ప్రచారం

పోరాటాల పురిటిగడ్డగా పేరొందిన ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఎన్నికల హోరు నువ్వా.. నేనా అన్నట్టు ఉంది. ఆనాటి పోరాట పటిమ స్ఫూర్తిగానే వామపక్ష రాజకీయాలకు ఈ జిల్లా పెట్టని కోటగా నిలిచింది. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత మొదటిసారి 1952లో జరిగిన ఎన్నికల్లో అన్ని స్థానాల్లో ఎర్ర జెండాకే ప్రజలు పట్టం కట్టారు. ఆ తర్వాత వామపక్ష- టీడీపీ కూటమికి, ఆ తర్వాత కాంగ్రెస్‌కు అధిక స్థానాలు ఇచ్చి అండగా నిలవగా.. తెలంగాణ రాష్ట్రంలో అధిక స్థానాలు కట్టబెట్టి బీఆర్ఎస్‌ను ఆదరించారు. కాలానుగుణంగా ఎప్పటికప్పుడూ ఓటర్లు విలక్షణ తీర్పు ఇస్తున్నారు.



నవతెలంగాణ-మిర్యాలగూడ

ఉమ్మడి జిల్లా ఆనాడు కమ్యూనిస్టులకు కంచుకోటగా నిలిచింది. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం తర్వాత ఈ గడ్డపై కమ్యూనిస్టు పార్టీలు బలంగా ఉన్నాయి. తదనంతరం కాంగ్రెస్ కూడా పుంజుకుంది. 1952లో జరిగిన తొలి సార్వత్రిక సంగ్రామంలో ఉమ్మడి జిల్లాలోని 12 స్థానాలను కమ్యూనిస్టు పార్టీ (పీడీఎఫ్) కైవసంచేసుకుంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తం గా ఎర్రజెండా రెపరెపలాడింది. ఆ తర్వాత జరిగిన అనేక ఎన్నికల్లో కాంగ్రెస్, కమ్యూనిస్టుల మధ్య హోరాహోరీగా పోరు నడిచింది. రెండు పార్టీల మధ్యనే సై అంటే సై అనేలా సాగింది. టీడీపీ ఏర్పడిన తర్వాత వామపక్షాలు ఆ పార్టీతో జత కలిసి జిల్లాలో తమ సత్తాను చాటాయి. జిల్లాలో సగానికి పైగా స్థానాలు ఈ రెండు పార్టీలు కైవసం చేసుకున్నాయి. 1994లో టీడీపీ పొత్తులో భాగంగా వామపక్షాలు ఐదు స్థానాలు కైవసం చేసుకున్నాయి. 2004లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్‌తో కలిసి సీపీఐ(ఎం), సీపీఐ చెరో రెండు స్థానాలు గెలుచుకున్నాయి. 2009లో మిర్యాలగూడ నుంచి సీపీఐ(ఎం), దేవరకొండ నుంచి సీపీఐ గెలుపొందింది. 2014లో దేవర కొండ నుంచి సీపీఐ అభ్యర్థి ఒక్కరే గెలుపొందారు.

విలక్షణ తీర్పు

రాష్ట్రవ్యాప్తంగా మారుతున్న రాజకీయ సమీకరణలకు అనుగుణంగా ఉమ్మడి జిల్లాలో కూడా రాజకీయ మార్పులు చోటు చేసుకుంటున్నాయి. మొదటగా ఎర్ర జెండాకు కంచుకోటగా ఉన్న ఈ ప్రాంతం కాంగ్రెస్‌కు కూడా అంతే ప్రాతనిధ్యం ఇచ్చింది. ఆ తర్వాత టీడీపీకి అవకాశం కల్పించింది. మళ్లీ కాంగ్రెస్‌కు అవకాశం ఇవ్వగా, తెలంగాణ ఏర్పడ్డాక కాంగ్రెస్, గులాబీల హవా నడిచింది. గత ఎన్నికల్లో 9 స్థానాల్లో గులాబీ జెండా ఎగరగా, మూడు స్థానాల్లో కాంగ్రెస్ నిలిచింది. అందులో ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఎంపీగా గెలవడంతో ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేశారు.

ఉప ఎన్నికల్లో ఆ స్థానం టీఆర్ఎస్ ఖాతాలో పడింది. నకిరేకల్ నుంచి కాంగ్రెస్ తరపున గెలిచిన చిరుమర్తి లింగయ్య బీఆర్ఎస్‌లో చేరారు. మునుగోడులో కాంగ్రెస్ ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి పదవికి రాజీనామా చేయగా.. జరిగిన ఉప ఎన్నికల్లో బీజేపీ తరపున పోటీ చేసి ఓడిపోయారు. అక్కడ వామపక్షాల మద్దతుతో బీఆర్ఎస్ గెలిచింది. దాంతో ఉమ్మడి జిల్లాలోని 12 స్థానాలు గులాబీ వశం అయ్యాయి.

పూర్వ వైభవం కోసం కాంగ్రెస్

గతంలో అత్యధిక స్థానాల్లో గెలుపొంది సత్తా చాటిన కాంగ్రెస్ గత ఎన్నికల్లో చతికిలపడింది. 1999 ఎన్నికల్లో రాష్ట్రంలో టీడీపీ అధికారంలోకి వచ్చినప్పటికీ ఉమ్మడి జిల్లాలో అత్యధిక స్థానాలు కాంగ్రెస్ గెలిచింది. వామపక్షాల పొత్తుతో 2004 ఎన్నికల్లో కాంగ్రెస్, సీపీఐ(ఎం) అత్యధిక స్థానాలు గెలుపొందాయి. భారీ మెజారిటీతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. 2009 ఎన్నికలో అత్యధిక స్థానాలను గెలిచి మళ్లీ అధికారం చేపట్టింది. 2014లో ప్రత్యేక రాష్టంలో జరిగిన ఎన్నికలో సైతం కాంగ్రెస్ 5 స్థానాలు గెలిచింది. 2018 ఎన్నికలో 3 స్థానాల్లో గెలువగా ఇద్దరు పార్టీ మారడం, ఒకరు రాజీనామా చేయడంతో జిల్లాలో కాంగ్రెస్‌కు ఎమ్మెల్యేలు లేకుండా పోయారు. ఇప్పుడు పూర్వ వైభవం కోసం విశ్వప్రయత్నాలు చేస్తున్నారు.



పట్టు కోసం వ్యూహాలు

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 12 స్థానాల్లో ఉన్న బీఆర్ఎస్ ఈ ఎన్నికల్లోనూ సత్తా చాటేందుకు వ్యూహాలు రచిస్తోంది. కానీ అభ్యర్థుల పట్ల స్థానికంగా వ్యతిరేకత వ్యక్త మవుతుండ టంతో ఆ పార్టీ నాయకత్వానికి తలనొప్పిగా మారింది. తిరిగి ఆ స్థానాలను నిలబెట్టుకునేందుకు నానా తంటాలు పడుతున్నారు. ప్రధానంగా నల్లగొండ, నాగార్జునసాగర్, దేవరకొండ, నకిరేకల్, కోదాడ నియోజకవర్గాల్లో అధికార పార్టీకి అసంతృప్తుల వ్యవహారం తలనొప్పిగా మారింది. దాంతో ఈ ఎన్నికల్లో గులాబీ పార్టీకి సీట్లు తగ్గే అవకాశం ఉందని విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నారు.



సంగారెడ్డిలో బీఆర్ఎస్ జెండా ఎగరవేస్తాం : మంత్రి హరీశ్‌రావు

- బీఆర్ఎస్‌లో చేరిన మన బిన్ ఫౌండేషన్ అధినేత, ప్రముఖ న్యాయవాది ఎంఏ ముఖీమ్



నవతెలంగాణ- సదాశివపేట

ఈసారి ఎన్నికల్లో సంగారెడ్డిలో బీఆర్ఎస్ జెండా ఎగరేస్తామని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. సంగారెడ్డి జిల్లా సదాశివపేటలో బుధవారం మన బిన్ ఫౌండేషన్ అధినేత, సుప్రీంకోర్టు అడ్వకేట్ ముఖీమ్ మంత్రి హరీశ్‌రావు సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. సదాశివపేట పట్టణంలోని ముర్షత్ దర్గా వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో న్యాయవాది ముఖీమ్ సాబ్, కౌన్సిలర్ ఇలియాస్ షరీఫ్, టీజేఏసీ జిల్లా అధ్యక్షులు సత్తయ్య యాదవ్, అనుచరులు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. జగ్గారెడ్డి ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత ఎన్నో హామీలు ఇచ్చి ఐదేండ్ల నుంచి ప్రజల కంటికి కూడా కనపడకుండా పోయారన్నారు. హైదరాబాద్‌లో ఉంటూ నియోజకవర్గాన్ని పట్టించుకోకుండా, ఇపుడొచ్చి నాకు ఓటేస్తే వచ్చే పదేండ్లలో సీఎం అవుతానని ప్రజలను మభ్య పెట్టడం సరికాదన్నారు. బీజేపీ, కాంగ్రెస్ రెండూ ఒకటేనని విమర్శించారు. ఆరోగ్యం బాలేకున్నా ప్రజల మధ్యలో ఉన్న నాయకుడు చింతా ప్రభాకర్ అన్నారు. చింత ప్రభాకర్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో హ్యాండ్లూమ్ కార్పొరేషన్ చైర్మెన్ చింతా ప్రభాకర్, రాష్ట్ర వైద్య సేవలు, మౌలిక సదుపాయాల సంస్థ చైర్మెన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్ రెడ్డి, ఎమ్మెల్సీ భూపాల్‌రెడ్డి, టీఎన్జీవో రాష్ట్ర మాజీ అధ్యక్షులు మామిళ్ల రాజేందర్, సీడీసీ చైర్మెన్ బుచ్చిరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ చింత గోపాల్, మున్సిపల్ కౌన్సిలర్లు, మండల సర్పంచులు, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ ఎన్నికల్లో పోటీకి సిద్ధం

- ఈ వయసులో పార్టీ మారాల్సిన అవసరం లేదు : విలేకరుల సమావేశంలో గుత్తా సుఖేందర్ రెడ్డి



నవతెలంగాణ-నల్లగొండ కలెక్టరేట్

"పార్టీ ఆదేశిస్తే వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో పోటీకి సిద్ధంగా ఉన్నాను. ఎంపీ ఎన్నికల్లో నేను లేదా నా కొడుకు పోటీలో ఉంటాం. ఏ పార్టీలో ఉన్నా నేను ఆ పార్టీ నిర్ణయానికి కట్టుబడి పనిచేస్తా.. అప్పుడప్పుడు సాంకేతిక సమస్యలు వస్తాయి.. అంత మాత్రాన ఈ వయసులో పార్టీలు మారాల్సిన అవసరం నాకు లేదు. అవసరమైతే ఈ పార్టీ నుంచి ఇప్పుడే పోటీ చేసేవాడిని. పక్క పార్టీలోకి వెళ్లి పోటీ చేయాల్సిన అవసరం లేదు" అని శాసన మండలి చైర్మెన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని తన క్యాంప్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు.

తెలంగాణ బాగుండాలంటే కేసీఆర్ మళ్లీ ఘన విజయం సాధించాలన్నారు. కాళేశ్వరం, మేడిగడ్డ ప్రాజెక్టుల విషయంలో రాజకీయం చేయడం మంచిది కాదన్నారు. ఎవరు ఎన్ని కుట్రలు పన్నినా ప్రజలు కేసీఆర్‌నే నమ్ముతారని అన్నారు. మూడోసారి ముఖ్యమంత్రి అవ్వడం ఖాయమన్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 12 స్థానాలు బీఆర్ఎస్సే గెలుస్తుందని దీమా వ్యక్తం చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో నాపై కూడా కొన్ని అసత్యాలు ప్రచారం చేస్తున్నారన్నారు. అవేవీ ప్రజలు నమ్మొద్దన్నారు. కొన్ని కారణాల వల్ల కొంత మంది ఎమ్మెల్యేలు నాతో విడిపోవచ్చు.. అయినా వారి విజయాన్నే నేను కోరుకుంటున్నా అన్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో అన్ని నియోజకవర్గాల్లోనూ తనకు అభిమానులు, ఆత్మీయులు, శ్రేయోభిలాషులు, మిత్రులు ఉన్నారన్నారు.

ఓటరు కార్డులో తప్పులున్నా... ఆమోదించొచ్చు

స్పష్టత ఇచ్చిన సీఈసీ

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

శాసనసభ ఎన్నికలు స్వేచ్ఛగా, సక్రమంగా జరపడానికి ఓటర్లకు కేంద్ర ఎన్నికల సంఘం (సీఈసీ) మార్గదర్శకాలు జారీ చేసింది. అదేసమయంలో క్షేత్రస్థాయి పోలింగ్ అధికారుల సందేహాలకూ స్పష్టత ఇచ్చింది. పోలింగ్ సమయంలో ఒకరికి బదులు మరొకరు ఓటు వేయకుండా నిరోధిస్తూ, అసలైన ఓటర్లను గుర్తించాలని పేర్కొంది. ఓటు వేసే ముందు ఓటరు పోలింగ్‌స్టేషన్లోని అధికారులకు ఫొటోతో ఉన్న ఓటరు గుర్తింపు కార్డును చూపాలి. ఓటరు గుర్తింపు కార్డు లేకుంటే ఫొటోతో ఉన్న ఈ క్రింది ధ్రువీకరణ పత్రాలను చూపించొచ్చు. 1. ఆధార్ కార్డ్ 2. మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం జాబ్ కార్డ్ 3. ఫోటోతో ఉన్న బ్యాంక్/పోస్ట్ ఆఫీస్ పాస్‌బుక్‌లు 4. కార్మిక మంత్రిత్వ శాఖ జారీ చేసిన ఆరోగ్య బీమా స్మార్ట్ కార్డ్ 5. డ్రైవింగ్ లైసెన్స్ 6. పాన్ కార్డు 7. జాతీయ జనాభా రిజిస్టరు జారీ చేసిన స్మార్ట్ కార్డ్, 8. భారత పాస్‌పోర్ట్, 9. ఫోటోతో ఉన్న పింఛను పత్రం, 10. ఉద్యోగులకు కేంద్ర/రాష్ట్ర ప్రభుత్వాలు / ప్రభుత్వ సంస్థలు / పబ్లిక్ లిమిటెడ్ కంపెనీలు జారీ చేసిన ఫోటో గుర్తింపు కార్డులు 11. చట్ట సభల సభ్యత్వాన్ని చూపే అధికారిక గుర్తింపు కార్డులు 12. దివ్యాంగుల గుర్తింపు కార్డులు చూపించొచ్చు. ఓటరు గుర్తింపు నిర్ధారణ సమయంలో క్లరికల్ తప్పులు, స్పెల్లింగ్ తప్పులవంటి వాటిని పోలింగ్ అధికారులు విస్మరించాలని సీఈసీ స్పష్టత ఇచ్చింది. మరొక అసెంబ్లీ నియోజకవర్గం రిజిస్ట్రేషన్ అధికారి జారీ చేసిన గుర్తింపు కార్డును ఓటరు చూపితే, ఆ ఓటరు పేరు పోలింగ్ స్టేషన్‌కు సంబంధించిన ఓటర్ల జాబితాలో ఉంటే, దాన్ని గుర్తింపుకోసం అనుమతించవచ్చని తెలిపింది. భారత పాస్‌పోర్ట్‌లోని వివరాల ఆధారంగా ఓటర్ల జాబితాలో నమోదైన ప్రవాస ఓటర్లను పోలింగ్ స్టేషన్‌లో, వారి అసలు పాస్‌పోర్ట్ ఆధారంగా మాత్రమే గుర్తించాల్సి ఉంటుందనీ, దీనికి ఇతర ఏ గుర్తింపు పత్రం పరిశీలించకూడదని స్పష్టత ఇచ్చింది. ఓటరు తన పోలింగ్ స్టేషన్, ఓటర్ల జాబితాలోని క్రమ సంఖ్యను, పోలింగ్ తేదీ, సమయంవంటి వివరాలు తెలుసుకోవడానికి వీలుగా 'ఓటర్ ఇన్ఫర్మేషన్ స్లిప్' జారీ చేయాలని ఎన్నికల సంఘం నిర్ణయించింది. జాబితాలో ఉన్న ఓటర్లు అందరికీ పోలింగ్ తేదీకి కనీసం ఐదు రోజుల ముందు ఓటరు సమాచార స్లిప్ అందించాలని పేర్కొంది. ఓటర్ల గుర్తింపును నిర్ధారించడానికి ఓటర్ స్లిప్పులను అంగీకరించబోరని తెలిపింది.

'బీజేపీ-బీఆర్ఎస్' లగ్గం పిలుపు



- పెండ్లి కార్డు విడుదల చేసిన కాంగ్రెస్
- కేటీఆర్ ట్వీట్‌కు కాంగ్రెస్ వినూత్న కౌంటర్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

కారు, హస్తం మధ్య ఎన్నికల వేడి రాజుకుంటోంది. ఆ రెండు పార్టీల మధ్య సోషల్ మీడియా వార్ నడుస్తున్నది. ట్విట్టర్ వేదికగా మంత్రి కేటీఆర్, టీపీసీసీ అధ్యక్షులు ఎనుముల రేవంత్‌రెడ్డి విమర్శలు, ప్రతి విమర్శలు కాకపుట్టి స్తున్నాయి. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో కరెంట్ ఇవ్వడం లేదంటూ కొంత మంది రైతులు మొసలిని తీసుకొచ్చి 'కరెంట్ ఇస్తారా.. లేదంటే సబ్‌స్టేషన్‌లో వదలాలా?" అన్న వైరల్ వీడియోను మంత్రి కేటీఆర్ ట్వీట్ చేసిన సంగతి తెలిసిందే. దీనిపై కాంగ్రెస్ వినూత్నంగా స్పందించింది. ఈ క్రమంలో బీజేపీ-బీఆర్ఎస్ పార్టీలు రెండూ ఒక్కటే అనే విషయాన్ని జనాల్లోకి తీసుకెళ్లడానికి కాంగ్రెస్ గట్టి కౌంటర్ ఇచ్చింది. 'బీజేపీ- బీఆర్ఎస్‌ల లగ్గం పిలుపు' పేరుతో పెండ్లి కార్డును విడుదల చేసింది. తెలంగాణ అమరవీరుల ఆత్మఘోశ అంటూ కార్డులో పేర్కొంది.

ఇప్పటికే ఆ కార్డు సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్నది. వేదిక దగ్గర నుంచి ముహూర్తం వరకు ప్రస్తావించి సెటైర్ వేసింది.


రన్నింగ్ కామెంట్రీ



పోలీసుల తనిఖీల్లో
దొరుకుతున్నధనం మూటలు
నీతీ నిజాయితీలు
ఎన్నికల్లో వట్టి మాటలు
మందు పోసి, దబ్బు పంచి
ఓటర్ల ను కొంటారు
ఆనక ఇక ఐదేళ్లూ
అబ్బనంగ తింటారు

- ఎస్.ఎస్.బి. గేరా

గుర్తు పెట్టుకోండి



నా జాతి ప్రజలకు
కత్తిని చేతికివ్వలేదు.
ఓటు హక్కును
ఆయుధంగా ఇచ్చాను.
పోరాడి రాజులవుతారో...
అమ్ముకొని, ఓడిపోయి
బానిసలవుతారో..
నిర్ణయం మీచేతుల్లో ఉంది.

- బీఆర్ అంబేద్కర్


మన్యం వీరులు

కడవరకు నమ్మిన సిద్ధాంతానికే కట్టుబాటు

మచ్చలేని నిస్వార్థ ప్రజా సేవకులు కుంజా బొజ్జి, సున్నం రాజయ్య

ఆణిముత్యాలు

ఒక్కసారి ఎమ్మెల్యేగా అవకాశం వస్తేనే వందల కోట్లు సంపాదించి ప్రజా క్షేమం కంటే వ్యక్తిగత స్వార్థానికే మొదటి ప్రాధాన్యత ఇచ్చే రాజకీయ నాయకులు ఉన్న ఈ రోజుల్లో.. కడవరకు ప్రజల పక్షాన నిలబడి ప్రజా పోరాటాలే ఆయుధంగా మలిచి ప్రజాసేవకే తమ జీవితాలను అంకితం చేసిన నాయకులు చాలా అరుదు. అలాంటి వారిలో కుంజా బొజ్జి, సున్నం రాజయ్య మొదటి వరుసలో ఉంటారు. వారు జీవితాంతం జనం కోసమే పాటుపడ్డారు. ఎర్రజెండానే ప్రజలకు ఒక ఆయుధం అని చూపారు.


కుంజా బొజ్జి



సున్నం రాజయ్య

నవతెలంగాణ- భద్రాచల రూరల్

కుంజా బొజ్జి పోరాట వారసుడిగా ఉద్యమంలోకొచ్చిన సున్నం రాజయ్య సైతం మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచి ఏ అవినీతి మచ్చ లేకుండా చివరి వరకు తన జీవితం ప్రజాసేవకే అంకితం చేశారు. అధికారం ఉన్నా.. లేకున్నా.. నిత్యం ప్రజల్లోనే ఉన్నారు. నిరాడంబరతకు నిలువుటద్దం ఆయన. ప్రతిపక్ష నేతలు సైతం ఆయన వ్యక్తిత్వాన్ని మెచ్చుకోవడం తప్ప వేలెత్తి చూపే పరిస్థితి లేకుండా నాయకునిగా జీవించారు. పాలకపక్ష నేతలకు ఆదర్శంగా నిలిచిన ప్రజా నాయకుడు. 1999, 2004, 2014 ఎన్నికల్లో మూడుసార్లు ఆయన భద్రాచలం ఎమ్మెల్యేగా పనిచేశారు. 2009లో స్వల్ప తేడాతో ఓడిపోయారు. 2014లో తెలంగాణ తొలి అసెంబ్లీకి భద్రాచలం నుంచి శాసనసభ్యులుగా ప్రాతినిధ్యం వహించిన సమయంలో.. ఎమ్మెల్యేల వేతనాలు పెంచాలని చర్చిస్తూ అసెంబ్లీలో పెట్టిన తీర్మానాన్ని నిరసించారు. కార్మికుల వేతనాలు పెంచిన తర్వాతే ఎమ్మెల్యేల వేతనాల గురించి ఆలోచించాలని అసెంబ్లీ సమావేశాలను బైకాట్ చేశారు. తన వ్యక్తిగత గౌరవ వేతనం కంటే కార్మికుల జీవన ఉపాధి ముఖ్యమని చాటి చెప్పారు. జిల్లాల ఏర్పాటులోనూ బీఆర్ఎస్ ప్రభుత్వ వివక్షను వ్యతిరేకిస్తూ ఆయన నిరాహార దీక్ష చేశారు. భద్రాచలం అభివృద్ధి కోసం సీఎం ప్రకటించిన రూ.100 కోట్లు విడుదల చేయాలని పదేపదే అసెంబ్లీలో గళమెత్తారు. రామాలయంతోపాటు భద్రాచలం నియోజకవర్గ అభివృద్ధికి రూ.500 కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యేల పనితీరుపై కేసీఆర్ చేయించిన సర్వేలో ఎక్కువ మార్కులు సాధించింది సున్నం రాజయ్యే. స్వయంగా కేసీఆర్ ఈ విషయం సభలో చెప్పారు. ఏనాడూ ఆయన ప్రలోభాలకు లోనుకాలేదు. ఏజెన్సీ వాసులు ఆయన్ని 'మా గిరిజన ముద్దుబిడ్డ' అని గర్వంగా చెప్పుకుంటారు. తన సొంత ఊరు వీఆర్ పురం మండలం సున్నంవారిగూడెంలో ప్రభుత్వ ఆశ్రమ పాఠశాల, ఊరి చెరువుతోపాటు నివాస గృహాలు నిర్మించేందుకు తన 10 ఎకరాల భూమిని ప్రభుత్వానికి ఉచితంగా ఇచ్చేశారు. అధికారం, పదవి ఉంటే వందల ఎకరాలు కబ్జా చేయొచ్చు అన్న రాజకీయ నాయకుల ఆలోచనలకు భిన్నంగా సున్నం రాజయ్య తన సొంత భూమిని ప్రజల కోసం దానంగా ఇచ్చి వారి గుండెలో చిరస్థాయిగా నిలిచారు. రాష్ట్ర విభజన సమయంలో భద్రాచలం నియోజవర్గానికి జరుగుతున్న అన్యాయాన్ని నిరసిస్తూ నిరవధిక నిరాహార దీక్ష చేశారు. ప్రాణాన్ని సైతం లెక్క చేయలేదు. భద్రాచలం నియోజకవర్గంలో విద్య, వైద్యంతో పాటు తాగు, సాగు నీరును అందించడం కోసం కుంజా బొజ్జి, సున్నం రాజయ్య చేసిన పోరాటం ఈ ప్రాంత ప్రజల మదిలో ఎప్పటికీ నిలిచి ఉంటుంది. ఆడంబరాలకు పోకుండా సాధారణ జీవితాన్ని గడుపుతూ అనునిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ ఎమ్మెల్యే అంటే ఒక ప్రజా సేవకుడుగానే గుర్తింపు పొందిన సున్నం రాజయ్య కరోనాకాలంలో సైతం ప్రజల మధ్యనే ఉన్నారు. తన ప్రాణాల కన్నా ప్రజా శ్రేయస్సు ముఖ్యమని భావించి కరోనా కాటుకు బలయ్యారు. ఓట్లు వేసి గెలిపించిన ప్రజల అభివృద్ధే తమ అభివృద్ధని పరితపించి.. భద్రాచలం నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి చివరి వరకు పోరాడారు. సుదీర్ఘకాలం ఎమ్మెల్యేలుగా ఉన్నా కడదాకా సాధారణ జీవితాన్ని గడిపిన సున్నం రాజయ్య, కుంజా బొజ్జి వంటి నిస్వార్థ రాజకీయ నాయకులు ఇప్పుడు ఎంతైనా అవసరం ఉంది. ప్రజల కోసం నిత్యం పని చేస్తున్న నాయకులనే ఓటర్లు అసెంబ్లీకి పంపించాలి.


కుంజా బొజ్జి ఇల్లు

వరుసగా మూడుసార్లు ఎమ్మెల్యే...



1985 నుంచి 1994 వరకు వరుసగా మూడుసార్లు భద్రాచలం నియోజకవర్గం ఎమ్మెల్యేగా కుంజా బొజ్జి ఉన్నారు. శ్వాస విడిచే వరకు నమ్ముకున్న సిద్ధాంతానికే కట్టుబడి ఆదర్శవంతమైన రాజకీయ నేతగా నిలిచారు. 1982 ఆగస్టు 26న చింతూరు మండలం కొల్లూరు గ్రామంలో కాంగ్రెస్ నాయకుల కుట్రతో జరిగిన ఘర్షణతో మొదటిసారిగా నెల రోజులపాటు జైలుకెళ్లారు. గిరిజనులకు భూమి కోసం, భుక్తి కోసం చేసిన పోరాటాల్లో ఆయనపై దాదాపు 73 కేసులు నమోదుకాగా చాలాసార్లు జైలుకెళ్లారు. 1984 డిసెంబర్ 12న పుచ్చలపల్లి సుందరయ్య స్వయంగా బొజ్జిని భద్రాచలం ఎమ్మెల్యే స్థానానికి నిలబెట్టాలని ప్రతిపాదన చేశారు. మొదటిసారి 1985లో ఎమ్మెల్యేగా గెలిచిన ఆయన తదుపరి వరుసగా.. 1989, 1995లో కూడా గెలిచారు. కుంజా బొజ్జి నిజాయితీకి మారుపేరుగా నియోజకవర్గ ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేశారు. నందమూరి తారక రామారావు ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని శాసన సభ్యులందరికీ హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లో ఇండ్ల స్థలాలు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఆ సమయంలో భద్రాచలం నియోజకవర్గం ఎమ్మెల్యేగా ఉన్న కుంజా బొజ్జి ప్రజల ఓట్లతో గెలిచిన తాను ఆ ప్రజల్లోనే ఉండాలి తప్ప హైదరాబాదులో ఇల్లు నాకెందుకు అని సున్నితంగా తిరస్కరించారు. ఆ రోజుల్లోనే లక్షలు విలువ చేసే ఇంటి స్థలాన్ని తిరస్కరించి చివరి రోజుల్లో సొంత ఇల్లు కూడా లేకుండా కూతురి ఇంటి వద్దే చనిపోయిన నిస్వార్థ ప్రజా సేవకుడు కుంజా బొజ్జి.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

నవతెలంగాణపై స్పందన
ఫోన్ చేయాల్సిన నంబరు : 9490099016

పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. నవతెలంగాణలో మీకు నచ్చిన, నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తెస్తే.. పత్రికకు మరింత పదును పెట్టే వీలుంటుంది. ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటలవరకూ పత్రికపై మీ అభిప్రాయాలను 9490099016కు తెలియచేయవచ్చు. మీరు చెప్పేది స్పష్టంగా, సూటిగా, క్లుప్తంగా ఉండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే మా అడ్రస్ : స్పందన, నవతెలంగాణ తెలుగు డైలీ, ఎం.హెచ్ భవన్, ప్లాట్ నెం.21/1, అజామాబాద్, ఆర్టీసీ కళ్యాణ మండపం దగ్గర, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్ - 20.



హైదరాబాద్‌లో.. బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

24 క్యారెట్లు	61,800	▲	110
22 క్యారెట్లు	56,650	▲	100
కిలో వెండి	77,500	▼	500



చికెన్ ధరలు
హైదరాబాద్
బ్రాయిలర్ చికెన్

ఫారం రేటు	రూ. 114
రిటైల్ (లైవ్)	రూ. 136
స్కిన్‌తో	రూ. 197
స్కిన్‌లెస్	రూ. 224

ఐదు రాష్ట్రాల్లో అధికారం మాదే

- కాంగ్రెస్ చీఫ్ ఖర్గే



కలబుర్గీ (కర్నాటక) : వచ్చే నెలలో శాసనసభ ఎన్నికలు జరిగే ఐదు రాష్ట్రాల్లోనూ కాంగ్రెస్ పార్టీయే అధికారంలోకి వస్తుందని ఆ పార్టీ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే ధీమా వ్యక్తం చేశారు. బీజేపీ పాలనలో ఉన్న మధ్యప్రదేశ్‌లో ప్రభుత్వ వ్యతిరేక పవనాలు వీస్తున్నాయని ఆయన చెప్పారు. కర్నాటకలోని కలబర్గీలో ఖర్గే బుధవారం ఏఎన్ఐ వార్తా సంస్థతో మాట్లాడుతూ ఛత్తీస్‌ఘర్, రాజస్థాన్‌లోని కాంగ్రెస్ ప్రభుత్వాలు తమ పని తాము సజావుగానే చేసుకుంటున్నాయని, ఆయా రాష్ట్రాల్లో ప్రజలకు ఎలాంటి సమస్యలు లేవని అన్నారు. ఎన్నికలకు పార్టీ సిద్ధంగా ఉన్నదని, అన్ని రాష్ట్రాల్లోనూ విజయం తమకే లభిస్తుందన్న విశ్వాసంతో ఉన్నామని తెలిపారు. ద్రవ్యోల్బణం, నిరుద్యోగం వంటి సమస్యల కారణంగా బీజేపీ ప్రజల నుండి వ్యతిరేకతను ఎదుర్కొంటోందని చెప్పారు.కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేకపోయిందని ఖర్గే ఆరోపించారు. 'బీజేపీ ప్రభుత్వం ఎన్ని హామీలు ఇచ్చినప్పటికీ ఒక్క దానిని కూడా నెరవేర్చలేదు. అది నిరుద్యోగ సమస్యను పరిష్కరించడం కానివ్వండి. రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయడం కానివ్వం డి. పెట్టుబడులు కానివ్వండి' అని అన్నారు. కర్నాటకను కేంద్రం నిర్లక్ష్యం చేసిందని మండిపడ్డారు. రాష్ట్రానికి కేంద్ర ప్రాజెక్టులేవీ రాలేదని ఖర్గే గుర్తు చేశారు.

రాజస్థాన్‌లోనూ గృహాలక్ష్మీ

- ఇంటి పెద్దకు ప్రతీఏటా రూ. 10 వేల నగదు : అశోక్ గెహ్లాట్ హామీ

జైపూర్ : రాజస్థాన్‌లో కాంగ్రెస్ మళ్లీ అధికారంలోకి వస్తే 'గృహ లక్ష్మీ గ్యారంటీ'ను అమలు చేస్తామని, కుటుంబంలోని మహిళా పెద్దకు ప్రతీ ఏటా రూ. 10 వేల నగదు అందిస్తామని ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాట్ బుధవారం హామీ ఇచ్చారు. అలాగే రాష్ట్రంలోని 1.05 కోట్ల కుటుంబాలకు వంట గ్యాస్ సిలెండరును రూ.500కు ఇస్తామని అశోక్ గెహ్లాట్ వాగ్దానం చేశారు. రాష్ట్రంలోని జుంజును వద్ద బుధవారం నిర్వహించిన కాంగ్రెస్ ఎన్నికల ప్రచార ర్యాలీలో ముఖ్యమంత్రి ఈ హామీలు ఇచ్చారు. 200 మంది ఎమ్మెల్యేలు ఉన్న రాజస్థాన్‌లో నవంబర్ 25న ఒకే దశలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. డిసెంబరు 3న ఫలితాలు వెల్లడించనున్నారు.

కర్నాటకలో పులిగోర్ల కలకలం

- ఇప్పటికే బిగ్‌బాస్ ఫేం అరెస్టు
- బీజేపీ ఎంపీ జగ్గేశ్, నటుడు దర్శన్‌పైనా దర్యాప్తు

బెంగళూరు : కర్నాటకలో పులిగోర్ల కలకలం రేగుతోంది. పులి గోరు ధరించినందుకు కన్నడ రియాలిటీ షో కంటెస్ట్ వర్తుర్ సంతోష్‌ను ఆదివారం సెట్‌లో నుంచే అరెస్టు చేయడం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. సంతోష్‌కు 14 రోజుల జ్యుడిషియల్ కస్టడీ విధించారు. అయితే ఈ అరెస్టు తరువాత రాష్ట్రంలో అనేక మంది ప్రముఖల దగ్గర ఇలాంటి పులిగోర్లు ఉన్నాయని ప్రభుత్వానికి ఫిర్యాదులు వస్తున్నాయి. బీజేపీ ఎంపీ (రాజ్యసభ) జగ్గేశ్, కన్నడ సినీ నటులు దర్శన్, జేడీఎస్ నాయకులు, నటులు, మాజీ ముఖ్యమంత్రి కుమారస్వామి కుమారుడు నిఖిల్ కుమారస్వామి, ప్రముఖ నిర్మాత రాక్‌లైన్ వెంకటేష్, కుణిగల్‌లోని వెంకటేశ్వర స్వామి, చిక్కమగళూరులోని వినయ్ గురూజీ వంటి వారి దగ్గర పులిగోర్లు ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది. వీరు పులిగోర్లు ధరించిన చిత్రాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. అయితే తాను ధరించిన పులిగోరు నకిలీదని నిఖిల్ కుమార్ తెలిపారు. కాగా, ఈ ఆరోపణలపై కర్నాటక అటవీ శాఖకు చెందిన ఉన్నతస్థాయి అధికారుల బృందం వివిధ ప్రాంతాల్లో విచారణ నిర్వహిస్తుంది. అలాంటి వస్తువులు ఉన్నట్లు వెల్లడయితే వారిపై వన్యప్రాణి సంరక్షణ చట్టం 1972 ప్రకారం చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. కర్నాటక పర్యావరణ, అటవీ శాఖ మంత్రి ఈశ్వర్ ఖండ్రే మాట్లాడుతూ చట్టం ఎటువంటి వివక్ష లేకుండా అందరికీ వర్తిస్తుందని, ప్రభుత్వం చట్టం ప్రకారం నడుస్తుందని చెప్పారు.

యూపీలో 14 మంది చిన్నారులకు హెచ్ఐవి

న్యూఢిల్లీ: ఉత్తరప్రదేశ్‌లో మరో దారుణం చోటు చేసుకుంది. ప్రభుత్వ ఆసుపత్రిలో రక్తమార్పిడి చేసే సమయంలో నిర్లక్ష్యం 14 మంది చిన్నారుల జీవితాలను ప్రమాదంలో పడేసింది. కలుషిత రక్తం ఎక్కించడం వల్ల చిన్నారులకు హెచ్ఐవి, హెపటైటిస్ బి, సి సోకినట్టు తేలింది. రాష్ట్రంలోని కాన్పూర్‌కు చెందిన లాలా లజపతిరాయ్ ఆసుపత్రిలో ఈ దారుణ ఘటన జరిగింది. 14 మంది బాధిత చిన్నారులు తలసేమియాతో బాధపడుతున్నారు. వీరికి ఎప్పటికప్పుడు రక్తమార్పిడి అవసరం. ఈ క్రమంలో ప్రభుత్వ ఆధ్వర్యంలోని లాలా లజపతిరాయ్ ఆసుపత్రిలో రక్తమార్పిడి చేయించుకున్నారు. అయితే రక్త మార్పిడిలో నిర్లక్ష్యం వలన వీరిలో ఏడుమందికి హెపటైటిస్ బి, ఐదుగురికి హైపటైటిస్ సి, ఇద్దరికి హెచ్ఐవి సోకినట్లు వైద్యులు గుర్తించారు. ఈ పిల్లలంతా ఆరు నుంచి 16 ఏళ్ల మధ్య వయసు వారే. ఇప్పటికే తలసేమియా తో బాధపడుతోన్న వీరిని ఈ వైరస్‌లు మరింత ఇబ్బందిపెడతాయని వైద్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆ పిల్లలంతా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందినవారు.

శిక్షణ ముగించుకున్న యువ ఐపీఎస్‌లు

- నేడు ఎన్‌పీఏలో పాసింగ్ అవుట్ పరేడ్

నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి : 75వ బ్యాచ్‌కు చెందిన 175 మంది యువ ఐపీఎస్ అధికారులు తమ ఏడాది కాల కఠిన శిక్షణను ముగించారని సర్దార్ వల్లభ భాయ్ పటేల్ జాతీయ పోలీసు అకాడమీ డైరెక్టర్ అమిత్ గార్గ్ తెలిపారు. శివరామ్‌పల్లిలోని తమ అకాడమీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతేడాదిలో వీరి శిక్షణ ప్రారంభమైందనీ, శిక్షణ కాలంలో అన్ని రంగాలలో వీరికి ట్రైనింగ్ ఇవ్వటం జరిగిందని ఆయన తెలిపారు. శిక్షణ పూర్తి చేసుకున్నవారిలో 155 మంది భారత ఐపీఎస్‌లు కాగా, 20 మంది విదేశీయులు ఉన్నారనీ, ఈ మొత్తంలో 34 మంది మహిళా అధికారులు ఉన్నారని అమిత్ గార్గ్ వివరించారు.

చిన్నారులకు పోషకాహారం అందేదెన్నడో...!?

ఆహార అలవాట్లపై దుష్ప్రచారాలు...అశాస్త్రీయ వైఖరులు

- శాపంగా మారిన పెడ ధోరణులు
- అధిక పనిభారంతో

కుదేలవుతున్న అంగన్‌వాడీలు



న్యూఢిల్లీ : చిన్నారుల్లో పోషకాహార లోపాన్ని ఎలా నివారించాలన్న విషయంపై కేంద్ర మంత్రి స్మృతి ఇరానీ ఈ నెల 11న నూతన ప్రొటోకాల్ విడుదల చేశారు. ఆరోగ్యం, అభివృద్ధి విషయాలలో పౌష్టికాహారం కీలక పాత్ర పోషిస్తుందని అంగీకరిస్తూనే దేశం ఎదుర్కొంటున్న ముఖ్య మైన సవాళ్లలో ఇది కూడా ఒకటని ప్రొటోకాల్ తెలిపింది. పోషకాహార లోపం కారణంగా తలెత్తే స్వల్పకాలిక, దీర్ఘకాలిక పరిణామాలను సరిచేయడం కష్టమేనని కూడా తేల్చింది. చిన్నారుల్లో పౌష్టికాహార లోపం ఏర్పడడానికి అనేక కారణాలు ఉన్నాయి. ఆదాయాలు తక్కువగా ఉండడం, కుటుంబాలు పెద్దవిగా ఉండడం, లింగ వివక్ష, పంట విధానాలలో మార్పులు, అవగాహనా లోపం, ఆరోగ్యం సరిగా లేకపోవడం వంటి కారణాల వల్ల ఆహార అసమతుల్యత ఏర్పడుతుంది. పిల్లలకు ఆహార లభ్యత తగ్గిపోతుంది. వారు సంప్రదాయక ఆహార అలవాట్లకు దూరమవుతారు. 0-6 సంవత్సరాల మధ్య వయసున్న పిల్లలకు పౌష్టికాహారాన్ని అందించేందుకు కేంద్ర ప్రభుత్వం 2018లో చేపట్టిన పోషణ్ అభియాన్ కార్యక్రమం ఆశించిన స్థాయిలో ఫలితాన్ని ఇవ్వలేకపోయింది. ఈ కార్యక్రమంలో కొన్ని మార్పులు చేరుస్తూ తాజాగా ప్రభుత్వం ప్రొటోకాల్‌ను విడుదల చేసింది.

ప్రొటోకాల్ ఏం చెబుతోంది?

పిల్లలకు అందించే ఆహారంలో విధిగా పాలు, గుడ్లను చేర్చాలని ప్రొటోకాల్ సూచించింది. పోషకాహార లోపంతో బాధపడుతున్న చిన్నారులకు మాత్రమే కాకుండా పిల్లలందరికీ వారంలో అన్ని రోజులూ గుడ్లను ఇవ్వాలి. ఒకవేళ కుల, మత, ఆరోగ్య పరమైన ఆంక్షలు ఉన్నట్లయితే అలాంటి పిల్లలకు అదనంగా మరో గ్లాసు పాలు లేదా ఓ కప్పు పెరుగు ఇవ్వవచ్చు. తీవ్రమైన పోషకాహార లోపంతో బాధపడుతున్న పిల్లలకు అంగన్‌వాడీ కార్యకర్తలు 'ఆకలి' పరీక్ష జరపాలని తాజా ప్రొటోకాల్ సూచించింది. ఇందుకోసం బాగా వేడిచేసిన ఆహారాన్ని ఉపయోగిస్తారు. ఈ పరీక్షలో ఫెయిలయిన చిన్నారులను మాత్రమే పోషకాహార పునరావాస కేంద్రాలకు (ఎన్ఆర్‌సీలు) పంపుతారు. పరీక్షలో ఉత్తీర్ణులైన వారిని అనుబంధ పోషకాహార కార్యక్రమంలో నమోదు చేసి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి వద్దకు పంపుతారు. ఈ పరీక్ష అంత విశ్వసనీయమైనది కాదు.

అడ్డంకులు...అవరోధాలు

సంప్రదాయ ఆహారాన్ని తినాలని పెద్దలు తరచూ చెబుతుంటారు. అయితే ఆర్థిక, రాజ కీయ, సామాజిక కారణాల వల్ల చాలా మందికి అది సాధ్యపడడం లేదు. కొన్ని కులాలు, జాతుల వారు జంతు వనరుల నుండి లభించే ఆహారాన్ని తీసుకుంటారు. అయితే అదేదో పెద్ద నేరమైనట్లు కొందరు దుష్ప్రచారం చేస్తున్నారు. మన దేశంలో ఈ ధోరణి బాగా కన్పిస్తోంది. ఉదాహరణకు అక్షయ పాత్ర వంటి సంస్థలు అనేక రాష్ట్రాల్లో మధ్యాహ్న భోజన కాంట్రాక్టులు తీసుకుంది. అయితే ఈ సంస్థ అశాస్త్రీయమైన సాత్వికాహార వైఖరిని అవలంబిస్తూ పిల్లలకు మాంసం, గుడ్లు ఇవ్వడం లేదు. దీంతో చిన్నారుల్లో పౌష్టికాహార లోపం తలెత్తుతోంది. గోవధ నిషేధం, ముస్లింలను ఆర్థికంగా బహిష్కరించడం, మాంసం దుకాణాలు నిషేధించడం వంటి మతపరమైన చర్యలు, పెడధోరణుల కారణంగా చిన్నారులు పోషకాహారానికి దూరమవుతున్నారు. ఒకవైపు పిల్లలకు పోషకాహారం అందించాలని చెబుతున్న ప్రభుత్వమే మరోవైపు ఇలాంటి చర్యలను ప్రోత్సహిస్తోంది.

అంగన్‌వాడీలపై అదనపు భారం

నూతన ప్రొటోకాల్ ప్రకారం పోషకాహార లోపాన్ని అనేక కేటగిరీలు విభజించారు. పిల్లలు ఏ కేటగిరీకి చెందుతారో అంగన్‌వాడీలే నిర్ణ యించాలి. దీనివల్ల వారిపై మరింత పనిభారం పడుతుంది. అసలు అంగన్‌వాడీ కేంద్రాలలోనే సరైన సౌకర్యాలు లేవు. 21% కేంద్రాలలో మరు గుదొడ్డి లేదు. పిల్లలు ఆరు బయటే కాలకృత్యాలు తీర్చుకోవాల్సి వస్తోంది. కేవలం 87.5% కేంద్రాలకు మాత్రమే తాగునీటి సౌకర్యం ఉంది. మిగిలిన కేంద్రాలలో అపరిశుభ్రమైన నీటితోనే పిల్లలకు వంట చేసి పెడుతున్నారు. మరుగు దొడ్లు, తాగునీరు లేని అంగన్‌వాడీ కేంద్రాలు తల్లులకు, సమాజానికి ఏ విధంగా వాటి ప్రాధాన్యతపై బోధించగలవు? పిల్లలకు చదు వు చెప్పడం, వండి వార్చడం వంటి పనులకే అంగన్ వాడీ కార్యకర్తలు పరిమితం కావడం లేదు. పోషకా హార లోపంతో బాధపడుతున్న పిల్లల ఇళ్లకు వెళ్లి తల్లిదండ్రులకు అవగాహన కల్పించాల్సి ఉంటుంది.

చిరుధాన్యాల వినియోగం మంచిదేనా?

అంగన్‌వాడీ కేంద్రాలలో పిల్లలకు అందిస్తున్న చిరుధాన్యాల ఆహారంలో అమినో యాసిడ్లు పూర్తి స్థాయిలో ఉండవు. పైగా ఆ ఆహారంలో ఉండే అధిక పీచు పదార్థం కారణంగా పిల్లలకు ఉదర సంబంధ సమస్యలు వచ్చే అవకాశం ఉంది. వారానికి ఒక రోజు చిరుధాన్యాలతో చేసిన ఆహారాన్ని అందించాలని ప్రొటోకాల్ చెబుతోంది. అలవాటు లేని ఆహారాన్ని అందించడం వల్ల పిల్లలకు ఆరోగ్య సమస్యలు తలెత్తడం మాత్రం ఖాయం.

పోషకాహారం లోపిస్తే...

పోషకాహారం లోపిస్తే పిల్లల్లో అనేక అనారోగ్య సమస్యలు కన్పిస్తాయి. రక్తహీనత, రేచీకటి, మానసిక వైకల్యం, చర్మ వ్యాధులు, శ్వాసకోశ సమస్యలు, ఉదర సమస్యలు వంటివి చిన్నారుల్ని పట్టి పీడిస్తుంటాయి. పోషణ్ అభియాన్ కార్యక్రమంలో పోషకాహార లోపం కలిగిన చిన్నారులను ఆధార్ ఆధారంగా గుర్తిస్తున్నారు. దీనివల్ల లక్షలాది మంది పిల్లలకు ఈ పథకం అందుబాటులో లేకుండా పోతోంది.

దేశంలో విద్యుత్ వాడకం పెరుగుతోంది

2050 నాటికి ప్రపంచంలోనే అత్యధిక వినియోగం

వరల్డ్ ఎకనమిక్ ఔట్‌లుక్ నివేదిక



న్యూఢిల్లీ : రాబోయే మూడు దశాబ్దాలలో మన దేశం ప్రపంచంలోనే అత్యధికంగా విద్యుత్‌ను వినియోగించే దేశంగా నిలుస్తుందని అంతర్జాతీయ ఇంధన సంస్థ (ఐఈఏ) విడుదల చేసిన వరల్డ్ ఎకనమిక్ ఔట్‌లుక్ నివేదిక తెలిపింది. 2050 నాటికి మొత్తం ఆఫ్రికాలో కంటే మన దేశంలోనే విద్యుత్ వినియోగం ఎక్కువగా ఉంటుందని వివరించింది. నివాస గృహాలలో ఏసీల వినియోగం పెరగడమే దీనికి కారణం. నివేదిక అంచనాల ప్రకారం మన దేశంలో ఇంధన సరఫరా 2022లో 42 ఎక్సాజౌల్స్ (ఈజే)గా ఉండగా అది 2030 నాటికి 53.7 ఈజేగా, 2050 నాటికి 73 ఈజేగా పెరుగుతుంది. మన దేశంలో గత ఐదు దశాబ్దాల కాలంలో 700 వడగాల్పులు వీచాయి. వీటి కారణంగా 17 వేల మంది చనిపోయారు. ఈ నేపథ్యంలో రాబోయే కాలంలో ఏసీల వాడకం గణనీయంగా పెరగబోతోంది. వాస్తవానికి 2010తో పోలిస్తే ఏసీల వాడకం మూడు రెట్లు పెరిగింది. ప్రతి వంద కుటుంబాలలోనూ 24 కుటుంబాలలో ఏసీలు ఉన్నాయి. 'చల్లదనం పొందాలంటే ఏసీలు వాడాలి. అప్పుడు విద్యుత్ వినియోగం పెరుగుతుంది. విద్యుత్ వినియోగం ఉష్ణోగ్రతలపై ఆధారపడి ఉంటుంది. భారత్‌లో ఉష్ణోగ్రతలు 25 డిగ్రీలు దాటాయి. దీంతో విద్యుత్ వినియోగం ఇప్పటికే పెరిగింది' అని ఐఈఏ తెలిపింది. 2050 నాటికి దేశంలో ఏసీల వినియోగం తొమ్మిది రెట్లు పెరుగుతుందని నివేదిక అంచనా వేసింది. టీవీలు, ఫ్రిడ్జ్‌లు, వాషింగ్ మిషన్ల వినియోగం కూడా పెరుగుతోందని తెలిపింది. కాగా చమురుకు డిమాండ్ కూడా పెరుగుతోంది. 2022లో రోజుకు 5.2 మిలియన్ బ్యారల్స్ చమురును వినియోగించగా అది 2030 నాటికి 6.8 మిలియన్ బ్యారల్స్‌కు, 2050 నాటికి 7.8 మిలియన్ బ్యారల్స్‌కు చేరుతుందని నివేదిక అంచనా వేసింది.

తప్పిన హిండెన్‌బర్గ్ అంచనా

అదానీ టోటల్ గ్యాస్‌లోనే షేర్ల ధరలు భారీగా పతనం



న్యూఢిల్లీ : అదానీ గ్రూపులో జరిగిన అక్రమాలు, అవకతవకలపై హిండెన్‌బర్గ్ రిసెర్చ్ సంస్థ నివేదికను బయటపెట్టి తొమ్మిది నెలలు గడిచాయి. తన నివేదిక బహిర్గతమైన తర్వాత అదానీ గ్రూప్ కంపెనీల షేర్ల ధరలు 85% తగ్గుతాయని హిండెన్‌బర్గ్ అంచనా వేసింది. అదానీ గ్రూపునకు చెందిన ఏడు కీలక లిస్టెడ్ కంపెనీలలో వాటాల విలువ పతనమవుతుందని హిండెన్‌బర్గ్ అంచ నా వేయగా ఒకే ఒక కంపెనీ 'అదానీ టోటల్ గ్యాస్'లో మాత్రమే ఆ సంస్థ అంచనాలు నిజమయ్యాయి. మరో రెండు కంపెనీలు... అదానీ పవర్, అదానీ పోర్ట్స్ అండ్ సెజ్‌లో వాటాల విలువ తగ్గకపోగా పెరిగింది. జనవరిలో హిండెన్‌బర్గ్ నివేదిక బయటపడే సమయానికి ఈ రెండు కంపెనీల వాటాల విలువతో పోలిస్తే ప్రస్తుతం వాటి విలువ పెరిగింది.

అదానీ గ్రూపు కార్పొరేట్ అవకతవ కలకు పాల్పడిందని, షేర్ల ధరలను ఎక్కువ చేసి చూపిందని హిండెన్‌బర్గ్ ఆరోపించిన విషయం తెలిసిందే. తన నివేదికను బయటపెట్టిన తర్వాత అదానీ గ్రూపునకు చెందిన అదానీ పవర్, అదానీ గ్రీన్ ఎనర్జీ, అదానీ టోటల్ గ్యాస్, అదానీ ట్రాన్స్‌మిషన్ (ప్రస్తుతం అదానీ ఎనర్జీ సొల్యూషన్స్), అదానీ ఎంటర్‌ప్రైజెస్, అదానీ విల్మర్, అదానీ పోర్ట్స్ అండ్ సెజ్ కంపెనీల వాటాల విలువ పతనమవు తుందని ఆ సంస్థ అంచనా వేసింది. అయితే బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) లో రోజువారీ స్టాక్ వ్యాపారానికి సంబంధించిన సమాచారాన్ని విశ్లేషిస్తే ఒక్క అదానీ టోటల్ గ్యాస్ కంపెనీలోనే షేర్ల ధరలు 85% తగ్గాయని తేలింది. గత సంవత్సరం రెండో త్రైమాసిక కాలంతో పోలిస్తే ఈ ఏడాది జూన్‌తో అంతమైన రెండో త్రైమాసిక కాలంలో అదానీ టోటల్ గ్యాస్ నికర లాభం కేవలం ఏడు శాతం మాత్రమే పెరిగింది. హిండెన్‌బర్గ్ నివేదిక తర్వాత అదానీ ఎనర్జీ సొల్యూషన్స్ వాటాల విలువ 73.3%, అదానీ గ్రీన్ ఎనర్జీ వాటాల విలువ 54%, అదానీ విల్మర్ వాటాల విలువ 43%, అదానీ ఎంటర్‌ప్రైజెస్ వాటాల విలువ 33% తగ్గింది. అయితే హిండెన్‌బర్గ్ అంచనా వేసినట్లు 85% తగ్గలేదు. అదే సమయంలో అదానీ పవర్ వాటాల విలువ 15%, అదానీ పోర్ట్స్ అండ్ సెజ్ వాటాల విలువ 1% పెరిగింది.

ఎరువులపై సబ్సిడీకి రూ.22,303 కోట్లు విడుదల

- కేంద్ర మంత్రివర్గ నిర్ణయం

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

రబీ పంట సీజన్‌లో (2023 అక్టోబర్ 1 నుంచి 2024 మార్చి 31) నత్రజని, భాస్వరం, పొటాష్, సల్ఫర్ వంటి వివిధ పోషకాల కోసం పోషక ఆధారిత సబ్సిడీ రేట్లను (ఎన్బీఎస్) కేంద్ర మంత్రివర్గం ఆమోదించింది. బుధవారం నాడిక్కడ ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ అధ్యక్షతన కేంద్రమంత్రి వర్గం జరిగింది. ఎరువులపై సబ్సిడీ కోసం రూ.22,303 కోట్ల విడుదలకు కేబినెట్ ఆమోద ముద్ర వేసింది. అయితే ప్రపంచవ్యాప్తంగా ఎరువుల ధరలు పెరిగినా.. రైతులు మాత్రం డీఏపీ (డై అమోనియం ఫాస్ఫేట్) ఎరువును బస్తాకు రూ.1,350 మాత్రమే చెల్లించి తీసుకోవచ్చని తెలిపింది. ఈ మేరకు కేంద్ర మంత్రి అనురాగ్ ఠాకూర్ వివరాలు వెల్లడించారు.అలాగే ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ అధ్యక్షతన జరిగిన ఆర్థిక వ్యవహారాల క్యాబినెట్ కమిటీ (సిసిఈఏ), ఉత్తరాఖండ్‌లోని జమ్రానీ డ్యామ్ మల్టీపర్పస్ ప్రాజెక్ట్‌ను ప్రధాన మంత్రి కృషి సించాయీ యోజన-వేగవంతమైన నీటిపారుదల ప్రయోజన కార్యక్రమం (పిఎంకెఎస్ వై-ఎఐబిపి) కింద, జలవనరుల శాఖ కింద చేర్చడానికి ఆమోదించింది. 2028 మార్చి నాటికి రూ.2,584.10 కోట్ల అంచనా వ్యయంతో ప్రాజెక్టును పూర్తి చేసేందుకు ఉత్తరాఖండ్‌కు రూ.1,557.18 కోట్ల కేంద్ర మద్దతును సిసిఈఏ ఆమోదించింది.

అమిత్ షాతో పవన్ కళ్యాణ్ భేటీ

- తెలంగాణలో పొత్తులపై చర్చ

నవతెలంగాణ...న్యూఢిల్లీ బ్యూరో

తెలంగాణలో బీజేపీ-జనసేన పొత్తు, సీట్ల సర్దుబాటు పై కేంద్ర హెూం మంత్రి అమిత్ షాతో జనసేన అధినేత పవన్ కళ్యాణ్ భేటి అయ్యారు. బుధవారం ఢిల్లీలోని కృష్ణ మీనన్ మార్గ్ లో అమిత్ షా నివాసంలో ఈ భేటీ జరిగింది. ఈ సమావేశంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి. కిషన్ రెడ్డి, జనసేన పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ లు పాల్గొన్నారు. దాదాపు 45 నిమిషాల పాటు సాగిన ఈ భేటీలో రెండు పార్టీల మధ్య సీట్ల పంపకాలపై చర్చ జరిగినట్టు తెలిసింది. ఇప్పటికే రాష్ట్రస్థాయిలో కిషన్ రెడ్డి, లక్ష్మణ్ ... పవన్ కళ్యాణ్ ను కలిసి తెలంగాణలో బీజేపి మద్దతు ఇవ్వాలని కోరిన విషయం తెలిసిందే. అయితే ఉమ్మడి వరంగల్, ఖమ్మం, నల్గొండ, హైదరాబాద్, సెటిలర్లు ఎక్కువగా ఉన్న, పాపులారిటీ ఉన్నప్రాంతాల్లో 32 సీట్లు తమకు కేటాయించాలని జనసేన పట్టుబడుతున్నట్లు తెలిసింది. కానీ బీజేపీ నుంచి కేవలం 10 స్థానాలు మాత్రమే బీజేపి కేటాయించే అవకాశం ఉన్నట్టు విశ్వసనీయ సమాచారం. ఇదిలా ఉండగా... జనసేన నుంచే పొత్తుపై విజ్ఞప్తి వచ్చిందని, ఆ దిశలో తెలంగాణలోనూ పవన్ కళ్యాణ్ ను మద్దతు తీసుకునేందుకు సిద్ధంగా ఉన్నట్లు కిషన్ రెడ్డి తెలిపారు. అయితే ఈ పొత్తులపై త్వరలో స్పష్టత రానున్నట్టు నేతలు తెలిపారు.

ఎవరిష్టం వారిది : కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

పార్టీ మారే విషయంలో ఎవరిష్టం వారిదని కేంద్ర మంత్రి, రాష్ట్ర అధ్యక్షులు జి.కిషన్‌రెడ్డి అన్నారు. రాజగోపాల్‌రెడ్డి బీజేపీకి రాజీనామా చేసిన అంశంపై ఆయన బుధవారం హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడారు. బీఆర్ఎస్‌కు ప్రత్యామ్నాయం బీజేపీ కాదని ఆయన చెప్పటం సరిగాదన్నారు. ఆయన కాదంటే కాకుండా పోదన్నారు.

బీజేపీపై నిందలేయడం తగదు : లక్ష్మణ్

పార్టీకి రాజీనామా చేసి పోతూ రాజగోపాల్‌రెడ్డి నిందలేయడం సరిగాదని ఎంపీ, ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షులు డాక్టర్ కె.లక్ష్మణ్ అన్నారు. కార్యకర్తలు శ్రమించడం వల్లనే పార్టీ ఈ స్థాయికి ఎదిగిందన్నారు. జాతీయ నాయకుల సమక్షంలో పార్టీలో చేరి ఇష్టానుసారంగా మాట్లాడటం సరిగాదన్నారు. ఆయనకు బీజేపీ ఎంతో ప్రాధ్యానత్య కల్పించిందన్నారు. ఇలా చేయడం తగదన్నారు.

నేను బీజేపీలోనే ఉంటా : వివేక్

తాను బీజేపీలోనే ఉంటానని బీజేపీ జాతీయ కార్యవర్గసభ్యులు వివేక్ వెంకటస్వామి తెలిపారు. హైదరాబాద్‌లో మీడియాతో ఆయన మాట్లాడారు. తాను పార్టీ మారుతున్నాననే ప్రచారంలో వాస్తవం లేదన్నారు. తాను పెద్దపల్లి పార్లమెంట్ స్థానం నుంచి ఎంపీగా పోటీచేస్తానని చెప్పారు.

రాజగోపాల్‌రెడ్డి మాట మార్చారు : ఈటల

తెలంగాణలో బీఆర్ఎస్‌కు ప్రత్యామ్నాయం బీజేపీనే అని చెప్పిన రాజగోపాల్‌రెడ్డి ఇప్పుడు ఎలా మాటమార్చారని ఎమ్మెల్యే ఈటల రాజేందర్ ప్రశ్నించారు. హుజురాబాద్, గజ్వేల్ నియోజకవర్గాల్లో తానే గెలుస్తానని చెప్పారు. మర్రి శశిధర్‌రెడ్డి మాట్లాడుతూ..రాజగోపాల్‌రెడ్డి పార్టీ మారటం దురదృష్టకరమని చెప్పారు. కాంగ్రెస్సే ప్రత్యామ్నాయం అని భావించి అందరూ ఆ పార్టీ వైపు మళ్లుతున్నారని తెలిపారు. భవిష్యత్‌లో బీజేపీ అధికారంలోకి వస్తుందని చెప్పారు. తాను పార్టీ మారుతున్నానంటూ వస్తున్న వార్తలను ఖండించారు.

శ్రీశైలం గౌడ్‌పై వివేక్ దాడిని ఖండిస్తున్నాం : లక్ష్మణ్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

మాజీ ఎమ్మెల్యే, బీజేపీ కుత్బుల్లాపూర్ అభ్యర్థిగా బరిలో ఉన్న కూన శ్రీశైలం గౌడ్‌పై ఎమ్మెల్యే కేపీ వివేకానంద దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని ఎంపీ, ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షులు డాక్టర్ కె.లక్ష్మణ్ తెలిపారు. బుధవారం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ ఓడిపోతుందన్న భయంతో సమాధానం చెప్పుకోలేక బీజేపీ నాయకులపై దాడులకు పాల్పడుతున్నారని విమర్శించారు. ఒక పార్టీ నుంచి బరిలో ఉన్న అభ్యర్థిపై దాడులు చేయడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదని తెలిపారు. ప్రచార మాధ్యమాల సాక్షిగా ఒక ప్రచార మాధ్యమం నిర్వహిస్తున్న లైవ్‌లోనే దాడికి పాల్పడటం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు.

నోళ్లల్లోనే నానుతున్న కుప్టి

ఆదిలాబాద్ జిల్లా నేరడిగొండ మండలంలోని కుప్టి వద్ద ప్రాజెక్టు నిర్మిస్తామని చెప్పిన నాయకుల హామీ నీటి మూటలుగానే మిగిలిపోతోంది. అధికారంలోకి రాగానే ఈ ప్రాజెక్టు నిర్మాణం చేపడుతామన్న పాలకుల మాట అమలుకు నోచుకోవడం లేదు. స్వయంగా ముఖ్యమంత్రి కేసీఆర్ హామీనిచ్చినా కార్యరూపం దాల్చ లేదు. డీటేల్స్ ప్రాజెక్టు రిపోర్టు(డీపీఆర్) సిద్ధమైనా భూసేకరణలో తీవ్ర జాప్యం జరుగుతోంది. మంత్రులు, ప్రజాప్రతినిధులు జిల్లాలో పర్యటించిన ప్రతిసారీ ప్రజలను మభ్యపెట్టేందుకు ఈ ప్రాజెక్టు నిర్మాణంపై ప్రస్తావించినా ఎలాంటి ముందడుగూ పడటం లేదు. నిధుల కేటాయింపూ కాగితాలకే పరిమితమవుతోందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఫలితంగా కడెంకు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌తో పాటు చుట్టుపక్కల మండలాలకు సాగు నీరందించడం గగనంగా మారుతోంది.

ప్రాజెక్టు హామీ నెరవేరేదెన్నడో..?

- నీటి మూటలుగానే నాయకుల మాటలు
- ఏండ్లు గడుస్తున్నా కొలిక్కిరాని ప్రాజెక్టు నిర్మాణం
- అందని తాగు.. సాగు నీరు

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

కడెంకు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌తో పాటు చుట్టుపక్కల మండలాలకు సాగునీరందించడానికి కుప్టి ప్రాజెక్టు నిర్మాణం చేయాల్సిన అవసరం ఏర్పడింది. తెలంగాణ ఉద్యమ సమయంతో పాటు ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కూడా ముఖ్యమంత్రి కేసీఆర్ ఈ ప్రాజెక్టు నిర్మాణం చేపడుతామని పలుమార్లు హామీనిచ్చారు. అధికారులు కుప్టి గ్రామం వద్ద నిర్మాణానికి అవసరమైన డీపీఆర్‌ను తయారు చేశారు. 5.30టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యంతో నిర్మించే ఈ ప్రాజెక్టుకు రూ.900కోట్లు అవసరమవుతాయని తొలుత అంచనా వేశారు. ఆలస్యం కావడంతో తాజాగా 2023-24 ఏడాది సవరించిన అంచనా ప్రకారం రూ.1300కోట్లు అవసరమవుతాయని అధికారులు ప్రతిపాదనలు పంపించారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే సుమారు 18వేల ఎకరాలకు సాగునీరందించొచ్చని ప్రతిపాదించారు. చుట్టుపక్కల సుమారు 2500 ఎకరాల వరకు ముంపునకు గురవుతాయని అధికారులు భావించారు. అప్పటి నుంచి ప్రతి బడ్జెట్‌లో కుప్టికి నిధులు కేటాయింపులు చేస్తున్నా విడుదల మాత్రం కావడం లేదు. కొన్ని నెలల కిందట కూడా రూ.300కోట్లు విడుదల చేస్తూ పరిపాలన అనుమతులు మంజూరు చేస్తున్నట్టు ప్రభుత్వం ప్రకటించినా కాగితాలకే పరిమితమైంది. దీంతో ఉద్యమ సమయం నుంచి ఇప్పటి వరకు కుప్టి ప్రాజెక్టు అంశం ప్రజాప్రతినిధులు, జనం నోళ్లలో నానుతుంది తప్పితే కార్యరూపం దాల్చడం లేదు.



ఏండ్లు గడుస్తున్నా అతీగతి లేదు..!

కుప్టి వద్ద ప్రాజెక్టు నిర్మాణం చేపడితే కడెం ప్రాజెక్టుకు ముప్పు తప్పడంతో పాటు సమీప మండలాలకు సాగు నీరందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. తొలుత ప్రాజెక్టు నిర్మాణం చేపట్టి.. ఆ తర్వాత లిఫ్టుల వద్ద నేరడిగొండ, బజార్‌హత్నూర్, ఇచ్చోడ, సిరికొండ, ఇంద్రవెల్లి, బోథ్ మండలాలకు సాగు నీరందించాలని భావించింది. ఇందుకు సంబంధించి డీపీఆర్ సిద్ధం చేసినా పనుల్లో ముందడుగు పడటం లేదు. కనీసం సమీప గ్రామాల రైతులతో మాట్లాడటం.. భూసేకరణ చేపట్టడం వంటి చర్యలేమీ చేయలేదు.

ప్రాజెక్టు నిర్మాణం త్వరగా చేపట్టాలి

కుప్టి వద్ద ప్రాజెక్టు నిర్మాణం త్వరగా చేపట్టాలి. రాష్ట్రం ఆవిర్భావ సమయంలో ప్రభుత్వం ఇచ్చిన హామీ అమలు కావడం లేదు. నిర్మిస్తామని పలుమార్లు ప్రభుత్వం చెబుతున్నప్పటికీ కార్యరూపం దాల్చడం లేదు. భూసేకరణలో భాగంగా స్థానిక రైతులతో మాట్లాడి వారికి అనుకూలమైన పరిహారం ఇప్పించాలి. లిఫ్ట్ ఏర్పాటు చేసి సమీప మండలాలకు సాగునీరందించాలి. ప్రభుత్వం ఇచ్చిన హామీని త్వరగా నెరవేర్చాలి.

- సంగెపు బొర్రన్న, రైతు నాయకుడు